ఓమ్ తత్ సత్

శ్రీ నిర్విఘ్నయోగసిద్ధి

రచన :

శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు

ప్రకాశకులు :

శ్రీవ్యాసాశ్రమము

వ్యాసాశ్రమము(పోస్టు),ఏర్పేడు (వయా),

చిత్తూరు జిల్లా, ఫోన్ - 08578- 287528

2003

1991 వ సం॥ వరకు 3000 ప్రతులు

2003 వ సం॥ 1000 ప్రతులు

వెల: రూ. 35-00

ప్రతులకు:

వ్యాసాశ్రమము(పోస్టు),

ఏర్పేడు (వయా), చిత్తూరు జిల్లా,

ఫోన్ - 08578- 287528

ముద్రణ :

శ్రీ పారాశర్య ప్రెస్

శ్రీ వ్యాసాశ్రమము

" ఓమిత్యేకాక్షరం బ్రహ్మధ్యేయం సర్వముముక్షుభిః"

" వర్థతాం బ్రహ్మ విద్యా చ లోకేభ్య స్సుఖమేధతామ్"

ఓమ్



మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు

ప్రథమపీఠాధిపతులు

శ్రీశ్రీశ్రీ విమలానందగిరిస్వాములవారు



ప్రస్తుతపీఠాధిపతులు

శ్రీశ్రీశ్రీ విద్యానందగిరిస్వాములవారు

విషయ సూచిక

పీఠిక	౧
మొదటి భాగము – యోగసిద్ధి	1
రెండవ భాగము– యోగవిఘ్నములు	23
మూడవ భాగము – యోగవిఘ్ననివారణోపాయములు	61
నాల్గవ భాగము – నిరతిశయానందబ్రహ్మప్రాప్తి	103

ఓం సత్యం శాన్తం దయ

ప్రతివారు ఎట్టికార్యమును ప్రారంభించు నప్పుడుగాని, మాట్లాడు నప్పుడుగాని పై జెప్పిన నాల్గు వాక్యములను మూడుసార్లు ఉచ్చరించి అర్థమును భావనజేసి ప్రారంభించిన ఆకార్యమును నిర్విఘ్నముగాను, నిర్దోషము గాను జరుగును. ఓంకారము నుచ్చరించు నప్పుడు వారి వారి మతానుసారముగా ఇష్ట దెవమును భావన జేసికొనవలయును.

ఓమ్

పీఠిక

నిర్విఘ్న యోగసిద్ధి కలుగుటకై ముముక్షువులకు, భక్తులకు కావలసిన విషయము లన్నియు విస్తారమును సంక్షిప్తమును గాక గ్రహించవలసిన సారమంతయు దీనియందు నిరూపించడమైనది. ప్రస్తుత మెచ్చుట చూచినను, పురాతన ఋషుల చరిత్రముల నవలోకించినను ముఖ్యముగ ఒక్క సంగతి కనబడుచున్నది. అదేమన స్త్రీపురుష లోకేష్టలమునం దుండుటయే యగును. ఇది యుభయులకును శ్రేయస్కరము కాదు. దీనియందు స్త్రీయొక్క దోషమేమియు ప్రత్యేకముగా చెప్పదగినది లేదు. సృష్టియొక్క శక్తి ఆలాగున నుంటున్నది. సృష్టికర్త తన శక్తినంతయు దీనియందే స్థిరపరచి యున్నాడు. అది లేనిచో సృష్టియే నశించును. ఏ తపశ్శక్తిచే బ్రహ్మసృష్టి చేసెనో, అట్టి తపఃప్రభావము గలవాడు మాత్రమే సృష్టిని జయించగల్గును. అయితే బ్రహ్మయొక్క తపఃప్రభావము అమోఘమైనది, అపారమైనది. లేనిచో బ్రహ్మాండములను, చరాచరప్రాణికోట్లను సృజింప జాలడు. మానవునకు తన యాత్మ జయమునకు అంత మహాతపస్సు అక్కర లేదు. తనయందుగల విషయ దోషమును రహిత మొనర్చిన చాలును.

పృథివ్యాం యాన్తి భూతాని జిహ్వోపస్థనిమిత్తకమ్ ।
జిహ్వోపస్థపరిత్యాగే కో న ముచ్యేత బన్ధనాత్ ॥

భూలోకములోగల సమస్త ప్రాణికోటులును జిహ్వేంద్రియ, గుహ్యేంద్రియములకొరకే సకల కార్యములను చేయుచున్నవి. ఈ రెండింద్రియములను నిగ్రహించినవాడు ఎవడు ముక్తుడు కాకున్నాడు? అని పరాశర మునివరుడు వచించెను. ఈ రెండింద్రియము లెంతవఱకు తెరువబడి యుండునో అంతవరకు మోక్షద్వారము మూయబడి యుండును. ఈ యింద్రియద్వయ మెప్పుడు మూయబడునో మోక్షద్వార

మప్పుడు తెరువబడును. అయితే ఈ యింద్రియ ద్వంద్వమును బంధించిన ఎట్లు జీవించ గలుగుదుమని సందేహపడ నక్కరలేదు. ఈ యింద్రియములు రెండింటిలో రెండేసి వృత్తులు గలవు. తక్కిన నేత్రాదీంద్రియము లన్నిటిలోను ఒక్కొక వృత్తిమాత్రమే గలదు. ఈ యింద్రియములలోగల ఒక్కొక వృత్తిని తొలగించిన సమరసజ్ఞానము గలుగును. జిహ్వేంద్రియమునకు రసమును గ్రహించుట, వాక్యము నుచ్చరించుట యని యుభయవృత్తులు గలవు. గుహ్యేంద్రియమునకు దేహసంరక్షణకొఱకు నీరును వదలుట, మఱి యొక్కటి సృష్టి చేయుట యనునవి గలవు. ఇచట సృష్టి హేతుకార్య ముపేక్షించిన వానికి పునర్జన్మ ముండదు. పురుషునకైననేమి, స్త్రీకైననేమి ఈ సృష్టివృత్తు లెంతకాలమువఱకుండునో, అంతవరకు పునర్జన్మము తప్పక గలుగును. జన్మరాహిత్యము పొందదలంచువాడు ఈ యింద్రియములను నిరోధించుకొనవలయును. ఆలాగుననే రసమును గోరి భోగపరత్వమును పొందనీయక యోగపరత్వమునకు దగిన యాహారము భుజించిన ఈజిహ్వేంద్రియమును నిరోధించినవాడగును. అట్టివా డమృతత్వమును పొందగలుగును. కావుననే శాస్త్ర మీలాగున వచించుచున్నది?

> వేధా ద్వేధా భ్రమం చక్రే కాంతాసు కనకేషు చ ।
> తాసు తేష్వప్యనక్తో హి నరో నారాయణో భవేత్ ★॥

బ్రహ్మదేవుడు రెండు విధములగు భ్రమలతో గూడ మానవులను సృష్టించెను. ఆ భ్రమ లెవ్వియన కాంతలయందును కనకమందును కలుగునవి యని గ్రహించేది. ఈ యిరుతెగల భ్రమలనుండి విముక్తి నొందిన నరుడు నారాయణుడగును. లేక అట్టి మనుష్యుడు ఈశ్వరుడగును. ఈ జీవుడే శివత్వము నొందగలుగును. శివజీవైక్యము, నరనారాయణైక్యము, ఆత్మ పరమాత్మైక్యము పొందగలవా డిట్టిస్థితి గలిగియుండవలయును. అట్టి జీవిమాత్రమే సంసార కాలచక్రమునుండి, సంసార భ్రమనుండి విముక్తి పొందగలుగును. కావుననే 'భ్రమంచక్రే' అని ప్రయోగింపబడినది. ''ఖండితం హి జగత్సర్వం సదేవాసురమానుషమ్''– సర్వప్రాణికోటులును,

దేవతలును, అసురులు, రాక్షసులు వీరెల్లరు దీనివలననే బద్ధులైరి అని దత్తాత్రేయులు వచించిరి. దీనిని జయించిన వాడు మాత్రమే భ్రమరహితుడగును. కావుననే భారతమున నిట్లు వచింపడమైనది. ఈక్రింద కనబడు శ్లోకము భారతమునందేగాక మనుస్మృతి మొదలగు అనేక గ్రంథములలో కనబడుచున్నది. మనుమహర్షి కృతయుగమునందుండిన వారగుటచే ఆ మనుస్మృతి శ్లోకమును ఈవల నుండువా రంగీకరించియున్నారు. ఆ శ్లోకమున కట్టి ప్రభావము గలిగి యుండుటచేతనే స్మృతులలోను, సంహితలలోను, పురాణములలోను కనబడుచున్నది. ఆ శ్లోకమిది :

మాత్రా స్వస్రా దుహిత్రా వా న వివిక్తాసనో భవేత్ ।
బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి ॥

విరక్తుడై బ్రహ్మనిష్ఠ చేయువాడు తల్లితోగాని, కుమార్తెతో గాని, తోడబుట్టువుతోగాని యొకే స్థలమున ఉండరాదు. ఏలయన ఇంద్రియ సమూహము మిక్కిలి బలము గలిగినది. బ్రహ్మవేత్తయొక్క మనస్సునైనను కరుగజేయగలుగును. స్త్రీలనుండి పురుషులకు చెప్పేలాగున, పురుషుల నుండి స్త్రీలును సంరక్ష చేసికొనవలయును. మఱియు బ్రహ్మనిష్ఠనుండి పతితుడగుటకు కారణమొండు గలదు. అది ఈ క్రింద నిరూపింపబడు చున్నది.

విహితస్యాననుష్ఠానాత్ నిషిద్ధస్య చ సేవనాత్ ।
అనిగ్రహాచ్చేంద్రియాణాం నరః పతనమృచ్ఛతి ॥

విధిప్రకారము తనయొక్క అనుష్ఠానమును చేయకపోవుటచేతను, నిషిద్ధ కార్యములలో ప్రవేశించుటచేతను, ఇంద్రియముల నిరోధము కలుగకపోవుటచేతను మానవుడు పతితుడగుచున్నాడు. ఓహో! దీనికన్న పరమోపదేశము మఱియొకటి కావలయునా?

ఇక నీ పీఠికను వ్రాసి పెంచదలంచలేదు. ఒక ఋషిదగ్గర చిరకాలము సేవ చేయుచుండిన శిష్యుడు తీర్థయాత్ర చేయవలయునను తలంపుతో

గురుదేవుని ప్రార్థించగా ఆ మహాత్ముడు కరుణ గలిగి ఆశీర్వదించి ఈక్రింద చెప్పెడి శ్లోకము నుపదేశించి దీని నెప్పుడెప్పుడు స్మరింతువో అప్పుడు నాదగ్గఱ నుండినవాడ వగుదువు అని చెప్పి పంపెను.

> బ్రహ్మచర్యమహింసాం చ సత్యం చైవాపరిగ్రహమ్ ।
> యత్నేన హే రక్షత హే రక్షత హే రక్షతేతి ॥

ఓ కుమారుడా! ఆత్మపుత్రుడా! ప్రయత్న పూర్వకముగ బ్రహ్మ చర్యమును అహింసను, సత్యమును, అపరిగ్రహమును ఎల్లప్పుడు రక్షింపుమా! రక్షింపుమా! రక్షింపుమా! యని ముమ్మారులు పలికెను. నిర్మల హృదయమున్ను, గురుదైవములయందు విశ్వాసమున్ను కలిగినవానికి దీనికన్న ఎక్కువ చెప్పవలసిన పని లేదు. ‘‘గురుదైవత భక్తానాం న భయం విద్యతే క్వచిత్’’– గురుదేవుని యందును, ఇష్టదైవము నందును విశ్వాసము గలవారి కెచ్చటను విఘ్నమును, భయమును గలుగవు. పురుషులకు బ్రహ్మనిష్ఠయందెంత యధికారము గలదో, స్త్రీలకును అట్టి యధికార మనాదికాలమునుండి యేర్పడియున్నది. విశాలమైన ప్రదేశమున స్త్రీ పురుషులకు ప్రత్యేక స్థలము లేర్పడియుండిన ఒకే స్థలములో నుండుట అంత విరోధము లేదుగాని, అట్లుగానిచో నుభయులును వేరు వేరు ప్రదేశములయం దుండుటయే శ్రేయస్కరము.

లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు.
ఓం తత్ సత్ ఓమ్.

చరాచర సుఖాభిలాషి

శ్రీమలయాళస్వామి.

ఓం

నిర్విఘ్న యోగసిద్ధి

యోగసిద్ధి

ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వి నావధీతమస్తు । మా విద్విషావహై ॥
ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

సహ – నౌ – అవతు – సహ – నౌ – భునక్తు – సహ – వీర్యం– కరవావహై – తేజస్వి – నౌ – అధీతం – అస్తు – మా –విద్విషావహై॥

(బ్రహ్మ=పరబ్రహ్మము), నౌ సహ=గురుశిష్యులగు మా యిరువురను, అవతు = రక్షించునుగాక! నౌ సహ = మా యిరువురను. భునక్తు= (ఆత్మజ్ఞానమును) అనుభవింపజేయుగాక! సహ = మేమిరువురముగూడ, వీర్యం = సామర్థ్యమును, కరవావహై = సంపాదింతుముగాక! నౌ= మా యిద్దరియొక్క, అధీతం = అధ్యయనము, తేజస్వి=తేజోవంతమైనది, అస్తు=అగుగాక, మా విద్విషావహై=పరస్పరము ద్వేషింపకుందుముగాక!

పరబ్రహ్మము(పరమేశ్వరుడు) శిష్యాచార్యులమగు మమ్ము రక్షించు గాక! మమ్ములను పాలించు గాక! మేమిద్దరమును విద్యాసామర్థ్యమును గలిగి యుందుము గాక! మా యిద్దరియొక్క యధ్యయనము తేజోవంత మగును గాక! మేమిద్దరము వైమనస్యము లేక యుందుముగాక!

ఆధ్యాత్మిక – ఆధిభౌతిక – ఆధిదైవికము లను దోషత్రయము శమించుట కొరకును, కాయిక వాచిక మానసికములను దోషత్రయము శాంతించుటకొఱకును, ఉచ్చారణ క్రియా ద్రవ్యములలో లోపవేుదైన ఉండినచో క్షయించుటకొఱకున్ను ముమ్మారు శాంతిమంత్రమును

పఠించడమైనది. ఇది కృష్ణయజుర్వేద తైత్తిరీయోపనిషత్తుయొక్క శాంతిపాఠమై యున్నది. దీనిని పవిత్రభావముతో పఠించువారికి పైజెప్పిన దోషత్రయము నశించుటయేగాక, గురుశిష్యులకు ఎప్పటికిని మనోవైరుద్ధ్యము గలుగక పోవునదేగాక, సదా పరస్పరప్రేమయు, ఆంతరంగిక విశ్వాసమున్ను గలిగి యుందురు.

యోగసిద్ధేశ్చాన్తరాయా బలాదాయాన్తి భూరిశః ।
తేషాం నివర్తనోపాయః గురుదైవతధర్మతః ॥

యోగసిద్ధికి అనేకముగా విఘ్నములు ప్రకృతిబలమువలన వచ్చుచున్నవి. వాటిని నివర్తించు ఉపాయము గురువు, దైవము, ధర్మము అనువానివలన సిద్ధించుచున్నది. శ్రీగురుదేవునియొక్కయు, ఈశ్వరునియొక్కయు, ధర్మదేవతయొక్కయు కడుంగడు అనుగ్రహముచే బహుళముగా సంభవించుచున్న యంతరాయము లన్నియు దొలగుచున్నవని భావము.

ఈశ్వరకరుణగాని, గురుదేవుని యనుగ్రహముగాని, ధర్మదేవత యాశీర్వాదముగాని లేనిచో సాధకునికి గల విఘ్నములు దొలగవు. ప్రతి దానికిన్ని ఒక్కొక్క ధర్మదేవత గలదని యార్షసిద్ధాంతము. ఆస్తికులయినవారు ఈశ్వరునిపై నమ్మకము గలిగియుందురు. ఆస్తిక్యబుద్ధి లేనివారు కూడ ధర్మబుద్ధి గలిగి ప్రవర్తించుదురు. వాస్తవముగ విచారించిన రెండును ఒకటియే. ధర్మబుద్ధి గలిగి ప్రవర్తించువారిని ధర్మదేవత ఎల్లప్పుడును రక్షించుచుండును. వారికి ఎలాటి అపాయమున్ను గలుగనీయక తన నీడవలె వెంబడించి రక్షించుచుండును. రాజును అంగరక్షకులు ఏలాగున ఏలాటి అపాయమున్ను గలుగనీయక చూచుచుందురో, ఈ ధర్మదేవతయు నాలాగున విఘ్నములు గలుగనీయక సంరక్షించుచుండును. కావుననే ''ధర్మో రక్షతి రక్షితః'' ధర్మమును రక్షించువారిని ధర్మము రక్షించునని చెప్పుట. ధర్మమునకధిదేవత యేలాగున నుంటున్నదో, ఆలాగున నధర్మమునకున్ను అధిదేవత గలదు. అది సమయము దొరకుటకు కనిపెట్టి సమయము దొరకగానే

విఘ్నములను గలుగజేసి పతితునిగా జేయును. పాతకకృత్యము లొనర్చెడి గొప్పదొంగను పోలీసువారు కనిపెట్టియుండి సమయము దొరకినప్పుడు ఎట్లు బంధింతురో అధర్మపరుని గతియు నాలాగున నుండును. కావుననే గురువుయొక్క కృపయు, లేక యీశ్వరకరుణయు, లేక ధర్మదేవత యను గ్రహము గలిగేలాగున ప్రతివారును చూచుచుండవలయును. అందువలననే కొన్ని కార్యములు తీర్మానము చేయదలంచినపుడు కుదరకపోయిన ఇచ్చట కొన్ని దుష్టశక్తులు గలవని చెప్పుదురు.

తపోభిః క్షీణపాపానాం శాంతానాం వీతరాగిణామ్ ।
ముముక్షూణామపేక్ష్యోఽయ మాత్మబోధో విధీయతే ॥

(ఆత్మబోధము)

శాస్త్రోక్తములయిన జప, ధ్యాన, తపము లీశ్వరార్పణ బుద్ధితో చేయునపుడు సమస్తపాపములు నశించి, ప్రకృతివికృతులు క్షయించి, నిర్మల హృదయులై పరమశాంతు లగుదురు. తదుపరి రాగద్వేషములు నశించి, విషయ విరక్తి గలిగి వైరాగ్యమును పొందుదురు. పిమ్మట మోక్షమందు తీవ్రతర విచారణ గలుగును. అట్లున్నవారు నిరతిశయానంద మోక్షము నొందుదురు. ఈలాగున ఆత్మశుద్ధి గలుగకపోవుటయే అనేక విఘ్నములు గలుగుటకు కారణమగుచున్నది.

పరిపక్వం మనో యేషాం కేవలోఽయం చ సిద్ధిదః ।
గురుదైవతభక్తానాం సర్వేషాం సులభో జవాత్ ॥

పై నుదాహరించిన ప్రకార మాచరించువారి హృదయము దూదివలె పవిత్రమై యుండును. అగ్ని ప్రవేశించినపుడు దూది యేలాగున భస్మమగుచున్నదో ఆలాగుననే గురూపదేశ సమయములందు హృదయగ్రంథులు నశించి, స్వరూపజ్ఞానసిద్ధి యుదయించును. ఆలాగుననే గురువునందును. దైవమునందును భక్తి గల సకల మనుజులకును ప్రయాసము లేకయే త్వరలోనే యాత్మసిద్ధి గలుగునని యపరోక్షానుభూతి.

యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది శ్రితాః ।
అథమర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥ (కఠోపనిషత్తు)

ఒకని హృదయమందున్న సమస్త సంకల్పములు, సంస్కారములు నశించునప్పుడు శరీరముతో గూడియుండినను ఈ లోకములోనే అతడు ముక్తుడును, పరబ్రహ్మానందము ననుభవించినవాడును అగుచున్నాడు.

కొందఱాత్మతత్త్వము నెఱుంగుదు మటంచు
గర్వులై నిక్కి చిత్తనిగ్రహము లేక
ఉపరతిసుఖంబు గానక విపులవిషయరాగ
లోలత జెడుదు రూరక మహాత్మ! (సీతారామాంజనేయము.)

వేదాంతమునకు అనగా బ్రహ్మవిద్యకు గలిగిన పతనమునకు ఇదియే కారణము. ముముక్షు అవస్థలో, సాధనావస్థలో, అభ్యాసావస్థలో, జిజ్ఞాసావస్థలో నుండువారు తమ్ము ముక్తాత్ముల మయితిమని తలంచి విధినిషేధముల నతిక్రమించి ప్రవర్తించిరి. ఆ ప్రవర్తనమే అపాయములో బడిపోవుటకు కారణమైనది. పైజెప్పిన నలువురకును వాసన నశించదు. ఆ పేర్లలోనే దీని యొక్క రహస్యము గలదు. మోక్షము నిచ్ఛించువాడు ముముక్షువనియు, సాధ్యావస్థకు యత్నించువాడు సాధకుడనియు, ఆరూఢస్థితి నొందుటకు ప్రయత్నించువా డభ్యాసియనియు, తత్త్వమును దెలిసికొనుట కాసక్తి గలవాడు జిజ్ఞాసువనియు అర్థము గలిగియున్న సంగతిని మఱచుటచేతనే ఇంత యనర్థము గలిగినది. వీరు తమలోగల దోషములను గనిపెట్టి ప్రాయశ్చిత్తాదులు చేయుచుండుటచే త్వరలోనే శుద్ధాత్ము లగుదురు.

వాసనా ద్వివిధా ప్రోక్తా శుద్ధా చ మలినా తథా ।
మలినా జన్మ హేతుస్స్యాత్ శుద్ధా జన్మవినాశినీ ॥

జీవులకు శుద్ధమనియు, అశుద్ధమనియు వాసనలు ద్వివిధములు. మలిన వాసన యైనయెడల విషయమందు ప్రవేశించి యనేకమైన జననమరణములను దుఃఖసాగరమునకు పాత్రుడగును. శుద్ధవాసన యైనచో జన్మరహిత

మగు శాశ్వతానంద ముక్తిని పొందును.

శుభాశుభాభ్యాం మార్గాభ్యాం వహన్తీ వాసనాసరిత్ ।
పౌరుషేణ ప్రయత్నేన యోజనీయా శుభే పథి ॥

మంచి చెడుగులను రెండు మార్గములుగా ప్రవహించెడు వాసనయను నదిని గొప్ప పురుష ప్రయత్నముచే యశుభ వాసననుండి శుభవాసనా మార్గముగా ద్రిప్పవలయును అని వాసిష్ఠము.

నదిలో ప్రయాణము చేయు నావికులు నది రెండు పాయలుగ చీలుచుండు స్థలమున ఏ పాయలో తాము పోవలయునో ఆ దారికి పడవను ద్రిప్పి గమ్యస్థానమును జేరునట్లు దీమంతులు తమ వాసనను శుభమార్గము లోనికి మరలించుటకు ప్రయత్నించవలయును.

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః ॥

అభ్యాస వైరాగ్యములచే మనస్సును స్వాధీనము జేసికొనుటకు సాధ్యము గానివానికి యోగానుభవము సిద్ధింపదని నాయొక్క నిశ్చయాభి ప్రాయము. కాని ప్రతిదినము క్రమక్రమముగా వైరాగ్య ధ్యానాభ్యాస ప్రయత్నములచే మనస్సు స్వాధీనమగును. ఇది నా మతము అని గీత.

స్వేచ్ఛగా అరణ్యములో సంచరించెడు గజమునుబట్టి క్రమాభ్యాస ముచే నెట్లు మావటివారు స్వాధీనము జేసికొందురో, అలాగున విషయారణ్య ములో సంచరించెడు మనస్సనెడి గజమును అనుష్ఠానముచే క్రమముగా వశపరచుకొనవలయును. స్వాధీనపడువఱకు మితమైన యాహారమును బెట్టి సాయంప్రాతఃకాలములలో మావటివాడు శిక్షణ నిచ్చుచుండును. అలాగున యుక్తాహారము, రెండు సంధ్యలలో ధ్యానానుష్ఠానములను జేయువారికి కొంతకాలమునకు మనస్సు వశపడును.

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాఽమ్భసి ॥

ఇంద్రియములు పూర్వసంస్కారముచే ప్రపంచవిషయములపై బోవు నపుడు అట్లు పోనీక అడ్డుపరచి ధ్యానమందు నిలుపవలయును. అట్లు పోయినచో సముద్రమందు గొప్పగాలికి లోబడిన నావ మునుగునట్లు వీని ప్రజ్ఞయు నశించును.

తుపానుగాలి రేకెత్తు లక్షణమును నావికులు తెలిసికొని యోడను అపాయము గలుగని స్థలములోనికి జేర్చునట్లున్ను, లేక లంగరువేసి కట్టి వేయునట్లున్ను సాధకుడు ఏ స్థలములో నుండిన విషయవాసనచే మనస్సునకు మాలిన్యము గలుగునని తోచునో ఆ స్థలమును తప్పక విడువవలయును. ఎంత చక్కని దృష్టాంతముతో భగవాను డుపదేశించెనో అది గ్రహించిన ఇంద్రియములు ఎట్లు ప్రవర్తించినను మనసే ప్రధానమని చెప్పెడివారి స్థితిని గ్రహించుకొనవచ్చును.

అకృత్వా శత్రుసంహారమగత్వాఽఖిలభూశ్రియమ్ ।
రాజాఽహమితి శబ్దాన్నో రాజా భవితు మర్హతి ॥

రణరంగమునందు ధీరుడై శత్రుసంహారముజేసి మహామండలాధిపత్యమును బొందక నేను రాజు, నేను రాజనిన మాత్రమున రాజగునా? కాడుగదా? ఆలాగుననే యింద్రియములనెడి సైన్యములను, మనశ్చిత్తాహంకార బుద్ధులనెడి మంత్రిప్రభృతులను జయింపక మోక్షసామ్రాజ్య పట్టాభిషిక్తుడై రాజయోగి గానేరడు అని వివేకచూడామణి.

బాహ్యరాజ్య జయమెట్టిదో ఆత్మరాజ్య జయమున్ను అట్టిదే.

అనుభూతిం వినా మూఢో వృథా బ్రహ్మణి మోదతే ।
ప్రతిబింబితశాఖాగ్ర ఫలాస్వాదనమోదవత్ ॥

మూఢు డనుభవములేక పరబ్రహ్మానుభవము గలవానివలె వ్యర్థముగా సంతోషించుచున్నాడు. అది యెట్లున్నదనగా చెరువుకట్టయందున్న వృక్షాగ్ర. ఫలము నీటియందు ప్రతిఫలించుచుండగా దానిని జూచి తాను నీటిలో మునిగి పండును తీసికొని భుజించుటకు యత్నించువానివలె నున్నది.

ఈదృష్టాంత మెటువంటిదో పుస్తకములలోగల వేదాంతవాక్యములను మాత్రము వల్లించి చెప్పువాని స్థితియు నాలాగుననే యుండును.

పతత్యసౌ ధ్రువం భిక్షుర్యస్య భిక్షోర్ద్వయం భవేత్ ।
ధీపూర్వం రేత ఉత్సర్గో ద్రవ్యసంగ్రహ ఏవ చ ॥

సన్న్యాసి యయినవానికి రెండు దోషములున్నచో వాడు నిశ్చయముగా పతితుడగును. అవి యేవనగా, ఒకటి మనఃపూర్వకముగా కృత్రిమభావముతో రేతోనష్టము గలుగజేయుట, రెండవది స్వార్థమునకు ద్రవ్యమును సమకూర్చుట. ఈ రెండును బ్రహ్మనిష్ఠుల కుండరాదని సన్న్యాస సముచ్చయము.

తావదేవ నిరోద్ధవ్యం యావద్హృది గతం క్షయమ్ ।
ఏతద్జ్ఞానం చ ధ్యానం చ శేషోఽన్యో గ్రంథవి స్తరః ॥

ఎంతవఱకు హృదయమందు వృత్తిరాహిత్యము గలుగలేదో అంతవఱకును బ్రహ్మానుసంధానమగు ధ్యానమున్ను, శ్రవణ, మనన, నిదిధ్యాసనములనున్ను విడువరాదు. యోగముచేతను, జ్ఞాన శాస్త్రముచేతను. గురుముఖమునుండియు ఈ రహస్యమే తెలిసికొనందగినది. ఇతరములగు సమస్త వేదాన్త శాస్త్రములయొక్క సారమిది యొకటియే.

అంకుశేన వినా మత్తో యథా దుష్టమతంగజః ।
విజేతుం శక్యతే నైవ తథా యుక్త్యా వినా మనః ॥

ఏలాగున మదించిన దుష్టగజము అంకుశము వినా స్వాధీనము గాదో, ఆలాగున విషయములలో ప్రవర్తించు మనస్సు వైరాగ్యపరమగు ధ్యాననిష్ఠాభ్యాసము వినా స్వాధీనపడదు. అనగా మనోనిరోధమునకు వైరాగ్యపరమగు ధ్యానయోగమే ముఖ్యసాధన మగును.

ధర్మోపదేశసమయే జనాస్సర్వేఽపి పండితాః ।
తదనుష్ఠాన సమయే మునయోఽపి న పండితాః ॥

పరుల కుపదేశించెడి సమయములో జనులందరును మహాపండితులే గాని తానుపదేశించునట్లు అనుష్ఠించెడి విషయములో మునులుగూడ

అసమర్థులుగా నుంటున్నారు.

పరోపదేశే పాండిత్యం సర్వేషాం సుకరం నృణామ్ ।
ధర్మే స్వకీయేఽనుష్ఠానం కస్యచిత్తు మహాత్మనః ॥

వేదాంతమును పరుల కుపదేశించుట చాలా సులభము. ఆ చెప్పెడి విధముగా ననుష్ఠానమందుండు మహాత్ముడు ఎచ్చటనో యొకానొకడు మాత్రము గనిపించును.

కుశలా బ్రహ్మవార్తాయాం వృత్తిహీనాః సురాగిణః ।
తేఽప్యజ్ఞానతయా నూనం పునరాయా న్తి యా న్తి చ ॥

బ్రహ్మమునుగూర్చి మాట్లాడుటయందు మహాసమర్థులై యుండియు, పరిశుద్ధ సదాచారహీనులును, విషయాసక్తులు నైనవారెవరు గలరో వారు నిశ్చయముగ అజ్ఞానాంధకారమగు తమస్సులో బడియుండువారు. వీరు మఱల మఱల చచ్చుచు పుట్టుచు నుందురుగాని మోక్షమును బొందజాలరు.

యథా భర్జితబీజస్య ప్రరోహిత్వం వినశ్యతి ।
తథాऽఽత్మజ్ఞానినో నిత్యం జగద్బుద్ధిర్విలీయతే ॥

ఏలాగున అగ్నియందు వేగించిన వి త్తనమునకు అంకురించు శక్తి నశించి యుండునో ఆలాగున జ్ఞానాగ్నియందు దగ్ధమైన సంస్కారముగల యాత్మ జ్ఞానికి ప్రపంచ విషయవృత్తులు భస్మములై యుండును.

నిప్పులో వేగిన విత్తనమును, పచ్చివిత్తనములును చూచునపుడొకే విధముగ నుండినను వేగిన విత్తనమును భూమిలో నాటిన మొలకెత్తదు. పచ్చిదియైనచో మొలచును. ఆలాగున విషయవాసన నశించని వానికి విషయసంసర్గము గలుగునప్పుడు వికారము గలుగును. వాసనా క్షయము గలిగిన యోగి యైనచో విషయవికారము గలుగదు.

అబ్ధివద్ధృతమర్యాదా భవన్తి విగతాశయాః ।
నియతిం న విముంచంతి మహాన్తో భాస్కరా ఇవ ॥

మహాత్ములగు విగతాశయులు సముద్రమువలె మర్యాదను గాపాడుదురు. సూర్యాదులవలె విధిప్రకారము సన్మార్గమున తప్పక నడతురు అని వాసిష్ఠము.

ఏలాగున సముద్రము గొప్పదైనను తన కేర్పడిన చిన్నదైన కట్టను దాటక హద్దులో నిలిచియుండునో, మఱియు సూర్యాదిగ్రహము లెంత గొప్ప ప్రకాశవంతము లయినను తమ కేర్పడియుండు జ్యోతిశ్చక్రరేఖనుండి తప్పక నడుచుచుండునో ఆలాగున ఎంత మహిమగల జ్ఞానియైనను, తన విధిని దాటి యొక్క యడుగైన పెట్టడు. ఒక చిన్నకార్యము నయిన జేయడు.

కర్మానురూపేణ గుణోద్గమో భవేద్గుణానురూపేణ మనః ప్రవృత్తిః ।
మనోనుగైస్తైరుభయాత్మకేంద్రియైర్నివర్త్యతే పుణ్యమపుణ్యమత్ర ॥

కర్మమునకు తగినట్లు గుణము కలుగును. గుణమునుబట్టి మనస్సు ప్రవర్తించును. మనస్సు ననుసరించి యింద్రియములు పుణ్యమునుగాని, పాపమును గాని యాచరించుచుండునని శ్రీశంకర భగవత్పాదులు.

కర్మశుద్ధి గలుగనిచో మనశ్శుద్ధి గలుగదనియు, మనశ్శుద్ధి లేనిచో ఇంద్రియములకు శుద్ధి సిద్ధించదనియు ఇందువలన గ్రహించుకొనవల యును. మనస్సే ప్రధానమని చెప్పి విషయలోలురై యుండువారి మత మిచ్చట ఖండించడమైనది. కర్మయే ప్రధానమని చెప్పబడియున్నను దేహేంద్రియ ములు చేయు ప్రవృత్తికి మాత్రమే మనస్సు కారణమగును. కొంత లోతుగా దిగి విచారించిన కర్మానుగుణముగానే మనస్సు ప్రవర్తించునను సత్యమును కనుగొనగలము. కావున కర్మమును (ప్రవర్తనమును) మార్పు చేసికొనిన మాత్రమే మనస్సులో మార్పు గలుగును.

వంతెన మొదలగు పనులు జేయువారనేకు లుండినను వారికి కారణ పురుషుడు ఇంజనీరుగా సామాన్యజనులు దలంతురు. పనిలోగాని, పనివారిలో గాని యేదైన మార్పు చేయవలసి యుండిన సాధారణజనులు ఇంజనీరుతో మాట్లాడుదురు. ఇంజనీరులో ఏవైన లోపము లుండిన గొప్పవారు మాత్రమే

ఇంజనీరుకు కారణభూతమగు ప్రభుత్వముతో మాట్లాడుదురు.

ఆలాగున సాధారణ మానవులు ఇంద్రియములు చేయు చేష్టలకు మనస్సు కారణమని తెలిసికొనువఱకు మాత్రమే వెళ్ళుదురు. గొప్ప ప్రజ్ఞావంతు డగాధముగా విచారించిన మనస్సునకు కారణము కర్మ యని గ్రహించుకొని కర్మను సవరించుటకు యత్నించును. అప్పుడే యది సరిపడును. అట్లుగానిచో శుభాశుభ గుణములు గలిగి మనస్సుండుటకు కారణమేమి? అను ప్రశ్నకు సమాధానము లభించదు. 'ఇంద్రియాణాం మన శ్చాస్మి'' యని గీతలో వచించుట కిదియే కారణము. మఱియొక స్థలమున ''గహనా కర్మణో గతిః'' అనియు, ''కవయోఽప్యత్ర మోహితాః'' అనియు ప్రయోగించుట కిదియే కారణము. ఒకస్థలమున మనస్సు కారణముగా కనిపించినను దీర్ఘముగా ఆలోచించిన మనస్సు కార్యముగాను, కర్మ కారణముగాను గోచరించక మానదు.

మలినో హి యథాఽఽదర్శో రూపాలోకస్య న క్షమః।
తథాఽవిపక్వకరణ ఆత్మజ్ఞానస్య న క్షమః ॥

మలినమయిన యద్దములో నేలాగున తనరూపము గనుపించదో ఆలాగున పరిపక్వముగాని హృదయము గలవారికి తనలో తానై వెలుగుచుండు దైవస్వరూపము గోచరింపదని మునిభావబోధిని.

మలినమగు అద్దములో జూచువారు బ్రాహ్మణులుగాని, అబ్రాహ్మణులుగాని, స్త్రీలుగాని, పురుషులుగాని, గృహస్థులుగాని, సన్న్యాసులుగాని, పండితులుగాని, పాండిత్యము లేనివారుగాని యేలాగున తమ స్వరూపమును జూడజాలరో, ఆలాగున మలిన హృదయు లెవ్వరైనను తనలో వెలుగుచుండు పరమాత్మను దర్శింపజాలరు.

యతో నిర్విషయస్యాస్య మనసో ముక్తిరిష్యతే।
తస్మాన్నిర్విషయం నిత్యం మనః కార్యం ముముక్షుణా ॥

ఏకారణముచేత మనస్సుయొక్క నిర్విషయస్థితియే ముక్తియని చెప్ప

బడుచున్నదో, అట్టి కారణమువలన ముముక్షువైనవాడు నిరంతరము మనస్సునకు నిర్విషయస్థితి గలిగేలాగున ప్రయత్నించు చుండవలయును.

ఆచారహీనం న పునంతి వేదా యద్యప్యధీతాస్సహ షడ్భిరంగైః ।
ఛందాంస్యేనం మృత్యుకాలే త్యజంతి నీడం శకుంతా ఇవ జాతపక్షాః ॥

నాలుగు వేదములున్ను, షడంగములైన ఆరు శాస్త్రములున్ను చదివినవాడైనను ఆచరణ లేనివాడైనచో పక్షులు రెక్కలు రాగానే గూటిని విడిచి వెళ్ళిపోవునట్లు అంత్యకాలమున వీడు చదివిన వేదశాస్త్రము లన్నియు వీనిని విడచి వెళ్ళిపోవును.

న తపస్తప ఇత్యాహుర్బ్రహ్మచర్యం తపోత్తమమ్ ।
ఊర్ధ్వరేతా భవేద్యస్తు స దేవో న తు మానుషః ॥

మహర్షులు కేవల తపస్సును తపస్సని చెప్పరు. మఱియేమన ఉత్తమమైన బ్రహ్మచర్యమునే తపస్సని వర్ణించిరి. ఎవ డూర్ధ్వరేతస్సు గలవాడగునో యట్టివాడు మనుష్యుడు గాడు; దేవుడే యగును అని జ్ఞానసంకలన తంత్రమున ఈశ్వరవచనము.

''తైలక్షయే యథా దీపో నిర్వాణమధిగచ్ఛతి''- తైలము నశించిన వెంటనే జ్యోతి యారిపోవునట్లు బ్రహ్మచర్యమనెడి యోజస్సు క్షీణించినచో మానవుని ప్రజ్ఞయు క్షయించును. మఱియు పెట్రోలు మొదలగు వానిచే నడుపబడు యంత్రములు నూనె యయిపోయినచో ఎట్లాగిపోవునో, ఆలాగున శరీరమ నెడి యంత్రమునకు తైలమువంటి శుక్రము క్షీణించిన మానవుని మానసిక కాయికశక్తి యంతయు క్షీణించిపోవును. కావుననే శుక్ల వృద్ధియగు ఇరువది సంవత్సరములవఱకున్ను, శుక్లము క్షీణించిన 50సంవత్సరముల ఆవలనున్ను ఉద్యోగమున కర్హత లేదని చెప్పెడి రహస్యము.

ఈ బ్రహ్మచర్యము నాలుగు విధములు. 1.నైష్ఠిక బ్రహ్మచారి యనియు, 2.గృహస్థ బ్రహ్మచారి యనియు, 3.విధుర బ్రహ్మచారి

యనియు, 4.అఖండ బ్రహ్మచారియనియు ఈ బ్రహ్మచారులను పిలిచెదరు. 1. ఆజీవితము బ్రహ్మచర్యమును శీలించువాడు నైష్ఠిక బ్రహ్మచారి యనియు, 2.ఋతుకాలమున మాత్రము విషయమందు ప్రవర్తించువాడు గృహస్థ బ్రహ్మచారి యనియు, 3.కొంతకాలము గృహస్థాశ్రమమందుండి విరక్తి గలిగి వానప్రస్థ జీవితమును గడుపువారు లేక దాంపత్య వియోగము గలిగిన పిమ్మట బ్రహ్మచర్యమును నిర్వహించువారు విధురబ్రహ్మచారు లనియు, 4. అఖండ బ్రహ్మాకారవృత్తి గలిగి బ్రహ్మమందే విహరించువారిని నఖండ బ్రహ్మచారులనియు గ్రహించుకొనవలయును.

వీరిలో శుకగార్గులు నైష్ఠిక బ్రహ్మచర్యమును అనుష్ఠించినవారలు. చూడాలా జనకులు గృహస్థబహ్మచర్యవ్రతమును సలిపినవారలు. విశ్వామిత్ర మైత్రేయాదులు విధుర బ్రహ్మచర్యమును శీలించినవారలు. బ్రహ్మభావముతో విహరించువారు అఖండ బ్రహ్మచారులని పిలువబడుదురు.

యదేవేహ తదముత్ర యదముత్ర తదన్విహ ।
మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి ॥

ఇహలోకమున జీవించియున్నపుడు మీ హృదయములో ఏ భావము గలిగియుండునో, పరలోకములోను మీ కట్టి భావము గలిగియుండును. పరలోకమున నెట్టి భావముండునో, దాని కనుగుణమగు జన్మమే మఱల గలుగుచుండును.కావున ఇచ్చటనే బ్రహ్మాకారవృత్తి గలిగియుండిన పరములోను అట్టి బ్రహ్మాకారస్థితి గలుగును. ఇచట భేదబుద్ధిని గలిగి యుండువాడు మఱల మఱల జననమరణములనే పొందుచుండును అని కఠోపనిషత్తు.

ఇచ్చట ఆత్మశుద్ధి లేక యాత్మజ్ఞానమును బొందకపోయిన పరములోను, మఱియొక జన్మము వచ్చునపుడును అదే ప్రకారముండును. కనుక జీవించి యుండునపుడే జీవేశ్వరుల యైక్యజ్ఞానమును బొందేలాగున జూడవలయును. సాధారణముగ వైష్ణవులు చనిపోయినపుడు పరమపదము

వేంచేసినారనియు, ఆలాగున శైవులు మరణించునపుడు శివలోకప్రాప్తిని పొందిరనియు చెప్పుదురు. అట్టి విష్ణుత్వముగాని, శివత్వముగాని జీవించియున్నపుడు గలిగిన మాత్రమే మోక్షము గలదుగాని వేఱుమార్గము లేదని శ్రుతియే చెప్పుచున్నది.

న హి దుఃఖప్రదం వస్తు సుఖం దాతుం సమర్హతి ।
కిం విషం పిబతో జంతోరమృతత్వం ప్రయచ్ఛతి ॥

దుఃఖమును గలుగజేసెడి కృత్యము సుఖమును గలుగజేయజాలదు. ఎట్లన, విషపానమును జేసినవానికి మరణము గలుగునేగాని యమృతత్వ మెట్లు గలుగును?

కావున ఇచ్చటనే నిర్విషయస్థితిని పొంది యమృతత్వమును బొందే లాగున జూడవలయును. అట్లు గాక యిచ్చట విషయముల ననుభవించు వారికి అమృతత్వమెట్లు లభించును?

అమృతం చైవ మృత్యుశ్చ ద్వయం దేహే ప్రతిష్ఠితమ్ ।
మృషా హి సాధ్యతే మృత్యుః సత్యేన సాధ్యతేఽమృతమ్ ॥

ప్రతివారియొక్క హృదయములో నమృతకలశమున్ను, విషకుంభ మున్ను ప్రతిష్ఠితములై యున్నవి. అసత్యవర్తనము గలవానికి మరణ హేతువగు విషపాత్రమే లభించును. సత్యవర్తనము గలవానికి మృత్యు రహితమగు అమృత కలశము సిద్ధించును.

అసత్యప్రవర్తనముచే లాభము, సుఖము లభించునని కొందఱు తలం తురు. వారికి దుఃఖమున్ను, నష్టమున్ను గలుగునేగాని సుఖమున్ను, లాభమున్ను గలుగదు. సత్యప్రవర్తనము గలవానికే సుఖలాభములు సిద్ధించును. మాయయొక్క భ్రాంతివలన ఈసత్యమును జను లెరుంగకున్నారు.

అనిష్కల్మషచిత్తస్య సర్వతీర్థేషు మజ్జనమ్ ।
F3 నరస్యాంగారకస్యేవ సదా క్షీరాభిషేచనమ్ ॥

కల్మషముగల మనస్సుతో గూడినవాడు సమస్త తీర్థములయందు స్నానము జేయుటచేత పాపవిముక్తుడు గాడు. ఎట్లన బొగ్గును తెల్లని గోక్షీర ములో ఎంత కడిగినను దానికి ఎట్లు నలుపుబోయి తెలుపు రాజాలదో ఇతని యొక్క స్థితియు నాలాగున నుండును.

ఆవుపాలు పవిత్రముగాను, తెల్లగాను ఉండినను బొగ్గును తెలుపు చేయుటకు ఆపాలలో నెన్ని సారులు ముంచి కడిగినను తెలుపు కాదుగదా! తీర్థయాత్రలు చేయువా రీసత్యమును హృదయములో నుంచుకొనిన పుణ్యాత్ము లగుదురు.

సర్పిషా కాష్ఠభారేణ వర్ధతేఽగ్నిశిఖా యథా ।
ఉపభోగేన కామేన హ్యాశా చోపరివర్ధతే ॥

అగ్నిహోత్రుడు కట్టెలచేతను, నెయ్యిచేతను ఎట్లు వృద్ధిని బొందు చుండునో ఆలాగున విషయభోగములచేత ఆశ మఱల మఱల వృద్ధి నొందునేగాని శాంతి నొందదు.

విషయసుఖముల ననుభవించిన శాంతించునని కొందరు చెప్పుదురు. పైదృష్టాంతముచే నిది తెలిసికొనవచ్చును. ఘృతసమిధాదులను వేయక యుండిన అగ్ని యేలాగున స్వయముగా చల్లారిపోవునో, ఆలాగున విషయ త్యాగముచేతనే ప్రకృతి శమించును గాని వేఱు మార్గము లేదు అని మనుస్మృతి.

యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తే ద్వంద్వ మోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥

పాపక్షయమునకును; ఆత్మశుద్ధికిని తగిన పుణ్యకర్మలను జేసెడు ఏ జనులయొక్క పాపము నశించినదో, అట్టివారు రాగద్వేషమువలన గలిగిన మోహమునుండి విడువబడినవారై అచంచలమైన వ్రతనిష్ఠ గలవారై నన్ను ధ్యానించుచున్నారు అని గీత.

ఈశ్లోకముచే పాపము గలిగినందుచేతనే తాను ప్రారంభించిన

అనుష్ఠానము లన్నిటికి విఘ్నములు గలుగుచున్నవనియు, అట్టి పాపము ఈశ్వరార్పణ బుద్ధితో నాచరించెడు పుణ్యకర్మలచే మాత్రమే నశించు ననియు, పాపము నశించిన మాత్రమే ఏలాటి విఘ్నములు గలుగక నిరాటంకముగ బ్రహ్మనిష్ఠ, జప,ధ్యాన,తపో, యోగాదులు జరుగ గల వనియు శ్రీభగవాను డుపదేశించెను.

మచ్చి త్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి।
అథ చేత్త్వమహంకారా న్న శ్రోష్యసి వినజ్క్ష్యసి ॥

ఓ యర్జునా! నా యందు చిత్తము నేకాగ్రపరచి యుందువేని నీయొక్క సమస్త ప్రతిబంధములున్ను నశించి నా అనుగ్రహమునకు పాత్రుడవు కాగలవు. ఈ వాక్యమున విశ్వాసము గలిగి ఆచరింపక పోయితివేని తప్పక పతన మొందగలవు అని గీత.

యావదాత్మా న లబ్ధో౽యం శుద్ధం జ్ఞానం చ నోదితమ్ ।
మలీనవిషయే రాగస్తావదజ్ఞానినో భవేత్ ॥

ఎంతవరకు ఈ ఆత్మ లభించలేదో, శుద్ధమైన జ్ఞాన ముదయము కాలేదో, ఎంతవరకు విషయవాసన నశించలేదో, అంతవరకు తానజ్ఞాన దశలో నున్నట్లే తలంచవలయును.

ఈశ్లోకముచేతనే బ్రహ్మనిష్ఠ లెచట పొరపాటు పొందుచున్నారో తెలు పడమైనది. నిర్విషయస్థితి పొందకయు విషయవాసన నశింపకయు తాము జీవన్ముక్తుల మైతిమని తలంచుటవల్లనే ప్రమాదములో పడిపోవుచున్నారు.

అంతస్తిమిరనాశాయ శాబ్దబోధో నిరర్థకః ।
న నశ్యతి తమో నామ కృతయా దీపవా ర్తయా ॥

గృహాంతర్భాగములో గల చీకటి దీపముయొక్క వార్తవలన నేలాగున నశింపదో, ఆలాగున హృదయగుహయందు గల అజ్ఞానతమస్సు శాస్త్రము లను పఠించుటచేగాని, చెప్పుటచేగాని తొలగదు. చక్కని అనుష్ఠానము గలిగియుండిన నశించును.

గురువులుగాను, ప్రబోధకులుగాను ఉండువారు ఈ పరమసత్య మును మరువక యుందురుగాక!

అంతశ్శుద్ధివిహీనై స్తు యేఽధ్వరా వివిధాః కృతాః ।
న ఫలంతి మునిశ్రేష్ఠ! భస్మని న్యస్తహవ్యవత్ ॥

ఆత్మశుద్ధి లేనివారు అనేక విధములగు యజ్ఞములుగాని, వ్రతములు గాని, దానములుగాని, తీర్థయాత్రలుగాని చేసినను అవి ఫలమును కలుగ జేయజాలవు. అవి యన్నియు బూడిదయందు హోమించిన హవిస్సువలె వ్యర్థములగును.

యతంతో యోగిన శ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।
యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః ॥

జ్ఞానసిద్ధికొఱకు యత్నించుచున్న ధ్యానయోగానుష్ఠానపరులు తమ యందున్నట్టి పరమాత్మను దర్శించుచున్నారు. ఆత్మసంస్కారము లేనివారు, అంతఃకరణశుద్ధి లేనివారు పైజెప్పిన వారివలె ప్రయత్నించువారుగా నటించినను ఈ ఆత్మను చూడజాలరు.

వేషముచేతను, పేరుచేతను మహాత్ములవలె నటించినను ఆత్మశుద్ధి లేని వారు తమలోగల పరమాత్మను జూడజాలరు. సారవంతమైన భూమిలో వ్యవ సాయమును జేయువారు పొందెడి ఫలమును ఊషరక్షేత్రములో జేయు కృషీ వలు లెట్లు పొందగలరు? అనగా విత్తనమున్ను, వ్యవసాయపు పనులున్ను ఉభ యుల కొకేవిధముగ నున్నను క్షేత్రమందు గల భేదముచే ఫలాఫలములు ఎట్లు భేదము గలిగియున్నవో, అంతఃకరణశుద్ధి గలవారికిని, లేనివారికిని ఇట్టి భేదము గలిగియుండును.

నావిరతో దుశ్చరితాన్నాశాంతో నాసమాహితః ।
నాశాంతమానసో వాఽపి ప్రజ్ఞానే నైనమాప్నుయాత్ ॥

దుర్వ్యాపారమునుండి విరమింపనివాడు ఈయాత్మను బొంద జాలడు. ఇంద్రియవిషయములనుండి శాంతి నొందని వాడున్ను ఈ

యాత్మను బొందజాలడు. మనస్సు సమాహితము కానివాడును ఈయాత్మను దర్శింపజాలడు. మనోవృత్తులు సంపూర్ణముగ విలయము నొందనివాడును ఈ యాత్మను బొందజాలడు. మఱల నెవరికి ప్రాప్తించును? ప్రజ్ఞాన సాక్షాత్కారము గలవారికి మాత్రమే ఆత్మ సిద్ధించును అని కఠశ్రుతి.

యేన నారాధితో దేవో యస్య నో గుర్వనుగ్రహః ।
న వశ్యం హృదయం యస్య తస్య శాంతిర్న సిద్ధ్యతి ॥

ఎవడు నిర్మలభక్తితో సర్వేశ్వరుని ఆరాధించలేదో, ఎవనికి సద్గురుకృప గలుగలేదో, ఎవనికి హృదయము స్వాధీనముగా లేదో వానికి ఆత్మ శాంతి(జ్ఞానసిద్ధి) గలుగనేరదు అని సర్వవేదాంతసార సంగ్రహము.

నాస్తి బుద్ధిరయు క్తస్య నచాయుక్తస్య భావనా ।
న చాభావయతశ్శా న్తిరశాన్తస్య కుతస్సుఖమ్? ॥

మనోనిగ్రహము లేనివారికి బ్రహ్మభావము గలుగదు. బ్రహ్మభావన లేనివారికి ప్రకృతిదోషము శమించదు. ప్రకృతి నశింపని వానికి ఆత్మసుఖ మెక్కడిది? అని గీత.

ఆత్మశుద్ధి లేనివారికి స్వస్థానమునందుగాని, ఇతర పుణ్యప్రదేశము లలో గాని, యేకాంతమునం దుండినను శాంతి గలుగదు.

దేవద్విజగురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్।
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥

శివవిష్ణ్వాది దేవతలను, బ్రహ్మనిష్ఠులను, గురువులను, జ్ఞానులను పూజించుటయు, మృజ్జలములచేత శరీరశుద్ధియును, సత్యదయాదులచే హృదయశుద్ధియు, సన్మార్గవర్తనము, బ్రహ్మచర్యవ్రతమును, జీవహింస చేయక యుండుటయును శరీరముచే జేయందగిన తపస్సని ఋషులు చెప్పుచున్నారు.

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥

పరులమనస్సును నొప్పించనిదియు, నిజమైనదియున్ను, హితముగ నుండునట్టిదియు నగు వాక్య మేది కలదో, అట్టి వాక్యమును చెప్పుటయు, వేదోపనిషత్ గీతలను పఠించుటయు, ప్రణవాది మంత్రములు జపించుటయు వాచిక తపస్సని వేదముచే చెప్పబడుచున్నది.

మనః ప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।
భావసంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే ॥

నిర్మలమైన మనస్సు కలిగియుండుటయు, అందరి ఎడల సౌమ్య భావము కలిగియుండుటయు, మౌనము అనగా బ్రహ్మచింతన చేయుటయు, లెస్సగా మనోనిగ్రహము కలిగియుండుటయు, శుద్ధమైన మనస్సు కలిగి యుండుటయు (బహ్మభావన గలిగియుండుటయు) అనునవి మానసికమైన తపస్సని చెప్పబడుచున్నది.

ఈ మూడు శ్లోకములలో త్రివిధ తపస్సులను గురించి వివరించడ మైనది. 1.దేహతపస్సు,2.వాక్తపస్సు,3.మానసికతపస్సు, తపశ్శబ్దమునకు శుద్ధ ము చేయుట, దహింపజేయుట యని అర్థములు గలవు.దేహశుద్ధియు, వాక్శుద్ధియు, మనశ్శుద్ధియు గలిగియుండుట, లేక దేహదోషము, వాగ్దోషము, మానసిక దోషము భస్మీకరించుట అనియు గ్రహించదగును. ఈత్రికరణశుద్ధి లేకపోవుటచేతనే అనేక విఘ్నములు కలుగుచున్నవి. దేహశుద్ధి గలిగిన బ్రహ్మచర్య శుద్ధియు, శీతోష్ణముల సహించుశక్తియు, వజ్ర కాయమును కలుగును. ఇట్టివారు ఎంతసేపు నిష్ఠలో నుండినను శరీరము నకు బాధ కలుగదు. వాక్శుద్ధి కలిగిన చెప్పిన వాక్యములన్నియు ఫలించును. హృదయశుద్ధి కలిగిన సంకల్పము లన్నియు ఫలించును. ఇదే త్రివిధ తపస్సు లచే గలిగెడు ప్రయోజనము. కావుననే మహనీయులను గురించి చెప్పినపుడు వారు వాక్శుద్ధి, వాక్సిద్ధి, సంకల్పశుద్ధి, సంకల్పసిద్ధి కలవారని జనులు చెప్పు వాడుక గలిగియున్నది.

ఈశుద్ధిత్రయము లేనికారణముచేతనే అనేక విఘ్నములు గలుగు చున్నవి. శ్రీకృష్ణభగవానులు అందరికిని ఆచరించుటకు తగిన తపస్సునే

చెప్పిరి. అట్లుగాక కొన్ని శాస్త్రములలో తపస్సని చెప్పినపుడు అరణ్యవాసము, కందపక్వ ఫలాదులను భుజించుటనియు, నిరాహారత్వము కలిగి యుండుటనియు వినినప్పుడే జనులు భయపడెదరు. కావుననే భగవానులు ''బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః'' అని సెలవిచ్చిరి. పైచెప్పిన ప్రకారము అనేకులు జ్ఞానతపస్సుచేత పవిత్రాత్ములై పరమాత్ముడగు తన్ను పొందుచున్నారని చెప్పిరి.

నివృత్తిమార్గే దాంపత్యం సానుకూలం భవేద్యది ।
పూర్వస్మిన్ పుణ్యపుంజేన నా స్తిచేత్ ప్రవ్రజేత్ పుమాన్ ॥

స్త్రీలకుగాని, పురుషులకుగాని యుండవలసిన భాగ్యములన్నిటి లోను ముఖ్యమైనది అనుకూల దాంపత్య మేర్పడుట యగును. ముఖ్యముగా నారీమణులకు అనుకూల దాంపత్యమునకు మించిన మహాపుణ్యము మఱియొకటి లేదు. ఇది కలుగనిచో ఎంత శ్రీమంతులైనను, ఉన్నతోద్యోగు లైనను శాంతి గలుగదు. అట్లు దాంపత్యానుకూలత గలుగనిచో నివృత్తి మార్గమున మహాసంకట మేర్పడును. కలిగెనేని పూర్వజన్మములో నుభయు లును ఒకేదైవమును, లేక ఒకే గురువును ఆరాధించిన వారలుగా నుండవల యును. అనుకూలము కలుగనిచో సన్న్యాసము తప్ప మరి గతి లేదు.

అనా

పుణ్యపుంజేన శుద్ధం తచ్చి త్తమైకాగ్ర్యమృర్ఛతి ॥

అనాత్మయగు దృశ్యవిషయములో అరుచి కలుగుటయు, ఆత్మ ధ్యానమం దభిరుచి గలుగుటయు గలిగెనేని పూర్వజన్మములో చేసిన అనేక పుణ్యకర్మఫలమనియే గ్రహింపవలయును. అట్లైననే ఆత్మశుద్ధి గలిగి చిత్తైకాగ్రత యేర్పడును అని అనుభూతి ప్రకాశము.

విషయాసంగరూపో యః పాప్మాఽసావాసురత్వతః ।
విద్యేచ్ఛాం ప్రతిబధ్నాతి సోఽయమాదౌ నివ ర్త్యతామ్ ॥

విషయాసక్తి స్వరూపమేది కలదో, అది పాపస్వరూప మనియు,

ఆసుర స్వరూపమనియు గ్రహించుకొనవలయును. ఇది మోక్షేచ్ఛను ప్రతిబంధించును. అందువల్ల ముముక్షువులు ప్రప్రథమమున విషయవాంఛను నివృత్తి చేసికొనవలయును.

యథా కాష్ఠమయో హ స్తీ యథా చర్మమయో మృగః ।
యశ్చ విప్రోఽనధీయానస్త్రయస్తే నామ బిభ్రతి ॥

కఱ్ఱతో చేయబడిన యేనుగున్నూ, చర్మముతో చేయబడిన జింకయున్ను, అధ్యయనము చేయని విప్రుడున్ను (సన్న్యాసియు) ఈ ముగ్గురు నామమాత్రమేగాని ప్రయోజనము లేదు. అనగా నామధారులని యర్థము అని మనుస్మృతి.

పరాన్నేన తు భు క్తేన మైథునం యోఽధిగచ్ఛతి ।
యస్యాన్నం తస్య తే పుత్రా అన్నాచ్ఛుక్రం ప్రవర్తతే ॥

పరాన్నము భుజించెడు ఏ గృహస్థుడు భార్యతో చేరునో వానికి బుట్టెడు సంతానములు ఆ అన్నము పెట్టిన వానివే యగును. ఏలన అన్నము చేత పురుషులకు శుక్లమున్ను, స్త్రీలకు రక్తమున్ను ఏర్పడును. ఈ రెండింటి వల్లనే పిండోత్పత్తి యగును అని శంఖలిఖిత స్మృతి.

పాపాన్నముచే నేర్పడిన బిడ్డలు పాపరూపులే యగుదురు. పుట్టిన తరువాత వారి నెంత శిక్షించినను మంచిస్థితికి రాజాలరు. కావున వంశోద్ధారకులగు ఉత్తమసంతానములు గలుగవలసియుండిన మాతాపితరులు ఆహారములో జాగ్రత్త వహించవలయును. ఆలాగున పాపాహారము భుజించి తప మొనర్చువారుకూడా మెలకువ గలిగియుండవలయును. ఏలన అన్నముచే రసము, రసమునుండి రక్తము, రక్తమునుండి మాంసము మొదలగు సప్తధాతువులున్ను, మనోబుద్ధి చిత్తాహంకారములును ఏర్పడును. సాత్త్వికాహారమని తలంచిన చాలదు. వస్తువు శుద్ధమైనను వచ్చే మార్గము అశుద్ధమైనచో అది పాపాహారముగాను, తామసాహారముగాను తలంచవలయును. కావున సాత్త్వికాహార మెచట దొరకునో యని భ్రమపడి పరుగెత్తకూడదు.

సత్యార్జిత ధనముచే శుద్ధవస్తువుతో చేయబడు పదార్థమే సాత్త్వికాహార మగును.

అవ్రతా హ్యనధీయానా యత్ర భైక్షచరా ద్విజాః ।
తం గ్రామం దండయేద్రాజా చోరభుక్తి ప్రదో హి సః ॥

బ్రహ్మచర్య వేదవ్రతాదినిష్ఠ లేనివారున్ను, గురుదీక్షా వ్రతమును శీలించని వారును, వేదోపనిషద్గీతాదులను చక్కగా అధ్యయనము చేయనివారును అగు బ్రాహ్మణులుగాని, సన్న్యాసులుగాని భిక్షాన్నము భుజించి ద్రిమ్మరులై తిరుగుచుండిన అట్టివారికి అన్నముపెట్టు గ్రామస్థులను రాజైనవాడు దండించవలయును. ఏలన దొంగలకు అన్నముపెట్టి పోషించు వారు ఎట్లు దండనార్హులో వీరును అట్టి వారే యగుదురు అని పరాశరస్మృతి.

వేదకాలమున రాజ్యమును, మతమున్ను రాజశాసనములో నుండెను. అందువల్లనే అట్టి కాలపు విప్రులును, యతులుసు, వేదవేదాంత పారంగతు లును, బ్రహ్మనిష్ఠాపరులును నైయుండిరి.

పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూస్తస్మాత్పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్ ।
కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షదావృత్తచక్షురమృతత్వమిచ్ఛన్ ॥

బ్రహ్మదేవుడు ఇంద్రియములను బహిర్ముఖముగా సృజించెను. కావున సర్వజీవులు బాహ్యమునే గాంచుచున్నారుగాని అంతరాత్మను చూచుట లేదు. ఎవడో అంతఃకరణ శుద్ధిగల ధీరుడు మాత్రమే అమృతత్వ స్వరూపమగు ఆత్మ నవలోకింప దలంచి అంతర్ముఖుడై పరగి తుదకు ప్రత్యగాత్మను సాక్షాత్కరింప జేసికొన గలుగుచున్నాడు అని కఠోపనిషత్తు.

ఒక వెడల్పుగల అద్దమును పట్టుకొని బాహ్యముగా నుంచినచో పురో భాగవస్తువు లన్నియు దానియందు ప్రతిఫలించునేగాని అద్దము పట్టుకొనిన వాని దేహము ప్రతిబింబించ జాలదు గదా? అట్టి అద్దమును తనవైపు త్రిప్పిన బాహ్యదృశ్యము ప్రతిబింబింపక తనదేహము ప్రతిఫలించునట్లు అంతర్దృష్టియు, బాహ్యదృష్టియు గల వానిస్థితి గలిగియుండును. కావున

చిత్తనిరోధమున్ను, నిర్మలత్వమును ఎంత అవసరమో గ్రహించుకొనవచ్చును.

కామబంధనమేవేదం నాన్యద స్తీహ బంధనమ్ ।
కామబంధన ముక్తో హి నేహ భూయోఽభిజాయతే ॥

కామము(విషయాసక్తి) ఒకటియే ఈజీవుని కిచట బంధనమునకును, పతనమునకును, విఘ్నములకును కారణము. ఇది ఒకటి తప్ప ఏ బంధనమును, విఘ్నమును లేదు. ఈ కామబంధనమునుండి విడుదల బొందిన జీవి మరల జనన మరణములను పొందదు. కామబంధనమే బంధనము గాని మఱియొకటి ఆత్మను బంధించునది లేదని శ్రీ వేదవ్యాస భగవానులు శిష్యులతో అనేకసార్లు చెప్పిరి.

★★★★

రెండవభాగము

యోగవిఘ్నములు

యశ్ఛందసామృషభో విశ్వరూపః । ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ ।
స మేంద్రో మేధయా స్పృణోతు । అమృతస్య దేవ ధారణో భూయాసం ।
శరీరం మే విచర్షణం। జిహ్వా మే మధుమత్తమా । కర్ణాభ్యాం భూరి విశ్రువం।
బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః । శ్రుతం మే గోపాయ ॥

యః– ఛందసాం– ఋషభః – విశ్వరూపః – ఛందోభ్యః –అధి– అమృతాత్– సంబభూవ – సః – మా – ఇంద్రః – మేధయా –స్పృణోతు – అమృతస్య – దేవ – ధారణః – భూయాసం – శరీరం– మే – విచర్షణం – జిహ్వా– మే – మధుమత్తమా – కర్ణాభ్యాం – భూరి – విశ్రువం – బ్రహ్మణః – కోశః– అసి – మేధయా – పిహితః – శ్రుతం – మే – గోపాయ॥

యః = ఏ ప్రణవము (ఈశ్వరుడు), ఛందసాం = వేదములలో, ఋషభః = శ్రేష్ఠమైనదో, విశ్వరూపః = సర్వరూపమైనదో, ఛందోభ్యః = వేదరూపములైన, అమృతాత్ = అమృతమునుండి, అధి సంబభూవ = గలిగెనో, ఇంద్రః = పరమేశ్వర స్వరూపమైన, సః = అట్టి పరమాత్మ, మా = నన్ను, మేధయా = ప్రజ్ఞచేత, స్పృణోతు = సంతోష పెట్టునుగాక! హే దేవ= ఓ ప్రకాశస్వరూపుడవగు పరమేశ్వరా! అమృతస్య = బ్రహ్మజ్ఞానముయొక్క, ధారణః= ధరించువాడనుగా, భూయాసం = అగుదును గాక! మే, నాయొక్క, శరీరం=దేహము, విచర్షణం–యోగ్యమైనదిగా (భూయాత్= అగుగాక!), మే=నా యొక్క, జిహ్వా=నాలుక, మధుమత్తమా = అమృత స్వరూపముగా, (భూయాత్=అగుగాక!) కర్ణాభ్యాం=చెవులతో, భూరి= అతిశయముగా; విశ్రువం=శ్రవణము చేయునుగాక! బ్రహ్మణః= పరమాత్మకు, కోశః=నివాసస్థానముగా, (త్వం=నీవు) అసి=అగుచున్నావు. మేధయా=లౌకికప్రజ్ఞచేత, పిహితః=కప్పబడితివి.(సః=అటువంటి) (త్వం= నీవు) మే=నాయొక్క, శ్రుతం=శ్రవణముజేసిన వేదజ్ఞానమును, గోపాయ= రక్షించుమా!

ఏ ప్రణవస్వరూపుడగు పరమేశ్వరుడు వేదములలో శ్రేష్ఠుడు గానున్నాడో, అమృతరూపములైన వేదములనుండి సముత్పన్నమైన సర్వరూపుడై యున్నాడో, అట్టి సర్వేశ్వరుడు నన్ను ప్రజ్ఞావంతునిగను, సంతోషవంతునిగను చేయుగాక! ఓ ప్రకాశస్వరూపుడవగు పరమాత్మా! నేను బ్రహ్మజ్ఞానమును ధరించువాడనుగా నగుదునుగాక! నా శరీరము జ్ఞానయోగ్యమైన దగునుగాక! నానాలుక అమృతస్వరూప మగునుగాక! శ్రోత్రములచేత విశేషముగా వినువాడ నగుదునుగాక! ఓ పరమాత్మా! నీవు పరబ్రహ్మమునకు అధిష్ఠానముగా నున్నావు. లౌకిక జ్ఞానముచేత నావరింపబడి యున్నావు. ఆ నీవు నాశ్రవణ జ్ఞానమును రక్షించుమా!

ఈలాటి వేదములలో చెప్పబడిన శాంతిమంత్రములను అర్థము తెలిసే లాగున పఠించి ప్రార్థింపక పోవుటయే విఘ్నములు కలుగుటకు కారణమగు చున్నది. విఘ్నములు నశించుటకొఱకే వేదములలో ఇట్టి మంత్రములను పరమేశ్వరుండు ఏర్పరచుట యైనది.

అన్నదోషేణ చిత్తస్య కాలుష్యం సర్వదా భవేత్ ।
కలుషీకృతచిత్తానాం ధర్మస్సమ్యక్ న భాసతే ॥

ఆహారదోషముచే సర్వదా చిత్తమునకు కల్మషము గలుగును. కల్మషచిత్తము గలవారికి ధర్మరహస్యమైన జ్ఞాన ముదయించదు.

బురదనీటియందు చంద్రబింబము ప్రకాశించనట్లు కలుషిత హృదయములలో జ్ఞానము ప్రకాశించదు. ఆహారము శరీరమునకు గదా, మనస్సునకేమి సంబంధమని తత్త్వచింతన లేనివారు పలుకుదురు. ఆహారముయొక్క కనిష్ఠభాగము మనోబుద్ధి చిత్తాహంకారములుగా మారుచుండునన్న సత్యమును వారెరుంగకయున్నారు. దానికి సంబంధించిన ప్రమాణము క్రింద తెలుప బడును. ఆహారనియమము లేనివానికి ఆత్మనియమ ముండదు.

ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః ।
స్మృతిలాభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః ॥

శుద్ధాహారముచే మనఃశుద్ధియు, మనశ్శుద్ధిచే దృఢమైన ప్రజ్ఞయు కలుగును. దృఢప్రజ్ఞచే సర్వగ్రంథులు (హృదయములోని ముడులు) నిశ్శేషముగా నశించును అని సన్న్యాస సముచ్చయము.

అత్యాహారః ప్రయాసశ్చ ప్రజల్పో నియమగ్రహః ।
జనసంగశ్చ లౌల్యం చ షడ్భిర్యోగో వినశ్యతి ॥

శుద్ధాహారమైనను మితిమీరి తినుటయు, అధికశరీర పరిశ్రమ చేయుటయు, అధికభాషణమును, మూర్ఖపు పట్టుదల గలిగియుండుటయు, ప్రాకృత జనులతో కలిసియుండుటయు, విషయలోలత్వము కలిగియుండుటయు- అను ఈ ఆరింటివల్ల యోగమునకు విఘ్నము కలుగునని హఠయోగప్రదీపిక.

వ్యాధిస్త్యానసంశయప్రమాదాలస్యావిరతిభ్రాంతిదర్శనా
లబ్ధభూమికత్వానవస్థితత్వాని చిత్తవిక్షేపాస్తేఽన్తరాయాః ॥

రోగము, యోగనిష్ఠానర్హత, సంశయము, అజాగ్రత్త (సోమరితనము), మత్తత (మాంద్యము), అతృప్తి, భ్రమ, సమాధియందు మనస్సు నిలువకపోవుట, చిత్తచాంచల్యము అను ఈ తొమ్మిదిన్నీ చిత్తస్థైర్య భంగకరములు, యోగమునకు విఘ్నములని పతంజలిమహర్షి అభిప్రాయము. ఈ విఘ్నములనుండి నివృత్తి గలుగుటకు అనన్యభక్తితో పరమేశ్వరుని ధ్యానించవలయును. ఈ విషయమై యోగపాదమున 23వ సూత్రమును చూడుడు.

ఈశ్వరప్రణిధానాద్వా ।

ముందు వివరింపబడిన శ్రద్ధాద్యుపాయములవలన సమాధియు, తత్ఫలమును మిగుల శీఘ్రముగా సిద్ధించుచున్నను, భగవత్ప్రణిధానమను సుకరమగు సాధనవలన అంతకన్న శీఘ్రముగ సమాధియు, తత్ఫలమును ప్రాప్తించును.

అష్టాంగ యోగసాధనములకన్న సులభముగా కేవల ఈశ్వరార్పణ హృదయముతో పరమేశ్వరుని ధ్యానించువానికి నిర్వికల్ప సమాధియు,

కైవల్యప్రాప్తియు కలుగును.

స్త్రీణాం స్త్రీసంగినాం సంగం త్యక్త్వా దూరత ఆత్మవాన్ ।
క్షేమే వివిక్త ఆసీనశ్చింతయేన్మామతంద్రితః ॥

తీవ్రతర ముముక్షు వైనవాడు స్త్రీలను, స్త్రీలతో సంబంధముగల పురుషులను సహా దూరముగా విడిచి యేకాకియై నిర్మలమైన ఏకాంత స్థలము నందు ఆసీనుడై యింద్రియ సంయమియై ఆత్మచింతన చేయవలయునని శుకులు భాగవతమున తెల్పిరి.

స్త్రీసంబంధము గలవాడైనచో విరక్తుని మనస్సునుకూడ క్రమముగా విషయవాసనలోనికిగాని, వివాహములోనికిగాని దింపుటకు అవకాశము కలదు. పురుషులకు చెప్పినది స్త్రీలకుగూడ అన్వయించును. వైరాగ్యము గల స్త్రీలు పురుషులుండే స్థలములో ఉండుట మంచిది గాదు.

రసాయన క్రియావాదో జ్యోతిషం క్రయవిక్రయమ్ ।
వివిధాని చ శిల్పాని వర్జయేత్పరదారవత్ ॥

రసాయన క్రియలున్ను, రసవాదవిద్య (బంగారము చేయుట), వైద్యము, మాంత్రికము, జ్యోతిషము, క్రయవిక్రయములు మరియు అనేకములగు శిల్పములు మొదలైనవానిని తీవ్రతర ముముక్షుత్వము గలవాడు ఏకపత్నీవ్రతనిష్ఠ గలవాడు పరస్త్రీలతో సంబంధము చేయనట్లు వర్జించవలయును.

పైజెప్పినవానివల్ల ప్రాకృత జనులు ఎక్కువగ జేరి బ్రహ్మనిష్ఠకు ప్రతి బంధమును కలుగజేయుదురు. దీనివల్ల పరోపకారదూరులై యుండవల యునని అభిప్రాయము గాదు. పై తెలిపిన కార్యములు చేయువారు అనేకులుం టున్నారు. తీవ్రబ్రహ్మనిష్ఠులు చాలా అరుదైరి. పైన నిరూపించినవారు దేహ మునకు సంబంధించిన రోగమును నివృత్తి చేయుదురేగాని ఆత్మకు సంబం ధించిన భవరోగమును రహిత మొనర్చజాలరు. భవరోగము గలవారు దేహారోగ్యమును, భోగమున్ను గలిగియుండినను ఆత్మశాంతిని, మానసిక

సుఖమును పొందజాలరు.

సమాధౌ క్రియమాణే తు విఘ్నాశ్చాయాంతి వై బలాత్ ।
అనుసంధానరాహిత్యమాలస్యం భోగలాలసమ్ ॥

లయస్తమశ్చ విక్షేపో రసాస్వాదశ్చ శూన్యతా ।
ఏవం యద్విఘ్నబాహుళ్యం త్యాజ్యం తద్బ్రహ్మవిజ్ఞనైః ॥

యోగసమాధి నభ్యసించువానికి విఘ్నములు తనంతటనే బలాత్కారముగానే వచ్చుచుండును. అవేవనగా బ్రహ్మానుసంధానము లేకుండుట సోమరితనము, భోగాసక్తి, ఏమియు తెలియక పోయెడు అవస్థ, నిద్ర, వివేకము మందగించుట, రసాస్వాదము (నేను బ్రహ్మానుభవము పొందిన వాడనను అభిమానము), ఏమియు తోచకపోవుట అను ఎనిమిదిన్నీ యోగవిఘ్నములు. (అపరోక్షానుభూతి 127, 128)

ఇట్టి విఘ్నములను ఆహారనియమముచేతను, కొంత ప్రాణాయామముచేతను, మెలకువగల బ్రహ్మనిష్ఠుల దగ్గర నుండుటచేతను నివృత్తి చేసుకొనవలయును.

అగ్నికుండసమా నారీ ఘృతకుంభసమో నరః ।
సంసర్గేణ విలీయేత తస్మాత్తాం పరివర్జయేత్ ॥

స్త్రీ నిప్పుకుండవంటిది, పురుషుడు నేతికుండతో సమానుడు. కాబట్టి యీ రెండింటి సంయోగముచే నాశముకల్గును. కనుక స్త్రీని వర్జించవలయును అని అవధూతగీతలో దత్తాత్రేయవచనము.

నిప్పుకుండపై నేతికుండను పెట్టిన ఎట్లు కరుగక యుండదో బ్రహ్మనిష్ఠలగు స్త్రీపురుషులయొక్క ఏకస్థల నివాసమున్ను అటువంటిదే. పురుషులకు చెప్పేలాగున బ్రహ్మచర్య వ్రతమును సల్పు నారీమణియు గ్రహించుకొనవలయును. ప్రకృతియొక్క శక్తి ఆలాగున నుండునని శ్రీదత్తాత్రేయులే చెప్పియుండగా, ఇక సందేహము ఏల? విశాలమైన ప్రదేశములలో దూర దూరముగా స్త్రీపురుషులకు ప్రత్యేక నివాసస్థల ముండిన అంత బాధా

కరము గాదు.

గౌడీ మాధ్వీ తథా పైష్టీ విజ్ఞేయా త్రివిధా సురా ।
చతుర్థీ స్త్రీ సురా జ్ఞేయా యయేదం మోహితం జగత్ ॥

1.బెల్లము, చెరుకుపాలు మొదలగువానిచే చేయు సారాయి. 2. ఇప్పపువ్వు, మరికొన్ని వస్తువులు కలిపి చేయు సారాయి, 3.మినపపిండి, తుమ్మచెక్క మొదలగు కొన్ని వస్తువులు కలిపి ఉత్పత్తి చేయు సారాయి(కల్లు) అని సారాయి మూడు విధములు, ఆడుది నాల్గవదియైన గొప్ప సారాయి యని తెలిసికొనుము. ఈ స్త్రీమోహమను సారాయిచేత సమస్త ప్రాణులును బద్ధుల గుచున్నవి.(అవధూతగీత) 'దేవాసుర మానుషం'- దేవతలు, అసురులు, రాక్షసులు, మానవులు ఈ నాల్గవ సారాయిచేత మోహపరవశులై పోవుచున్నారు. పైజెప్పిన మూడు సారాయిలవల్ల కొంతసేపు మాత్రమే కైపు కలిగి ఒడలు తెలియక పోవునేగాని, నాల్గవ సురాపానముచే గలిగెడు కైపు ఈ జన్మ అంతమువరకే గాక మరుజన్మమువరకు నిలచియుండును. ఇది పూర్వ జన్మవాసన యని చెప్పబడును.

వేధా ద్వేధా భ్రమం చక్రే కాంతాసు కనకేషు చ ।
తాసు తేష్వవ్యసక్తో హి నరో నారాయణో భవేత్ ॥

బ్రహ్మదేవుడు రెండు విధములగు మాయలచేత జీవులను సృష్టించెను. అవి యేవన కాంతయు, కనకము నగును. ఈ రెంటినుండి విముక్తి బొందిన నరుడు నారాయణుడగును. అలాగున పురుష సంబంధమును, ధనమును విడిచినచో నారి నారాయణి యగును. ఇది ఉత్తమ గృహస్థాశ్రమములో నుండువారిని గురించి చెప్పినది కాదు. విరక్తులై బ్రహ్మనిష్ఠ చేయువారిని గురించి తెల్పినదని గ్రహించుకొనవలయును.

అసమ్మానాత్తపోవృద్ధిః సమ్మానాత్తపసః క్షయః ।
అర్చితః పూజితో విప్రో దుగ్ధా గౌరివ సీదతి ॥

బహుమాన సత్కారాదులు కలుగవలెనని తలంచి యుండు యోగి

క్రమముగా కృష్ణపక్ష చంద్రునివలె క్షయించును. ఆలాగున గౌరవాదులు కావలయునని తలంపులేని యోగి శుక్లపక్ష చంద్రునివలె వృద్ధినొందును. మఱియు గౌరవాదులకు లోబడిన యోగిజ్ఞానముకూడ పాలు పితికిన తరువాత ఆవుయొక్క పొదుగు చిక్కిపోవునట్లు క్షయించును అని మనుస్మృతి.

మనో నామ మహావ్యాఘ్రో విషయారణ్యభూమిషు ।
చరత్యత్ర న గచ్ఛంతు సాధవో హే ముముక్షవః ॥

విషయమను మహారణ్యమునందు మనస్సను (ప్రకృతియను) పెద్దపులి తిరుగుచున్నది. కాబట్టి సాధువులగు ముముక్షువులారా! మీ రచ్చోటికి వెళ్లవద్దని వివేకచూడామణి.

అభక్ష్యభక్షణే శ్రద్ధా తథాఽభక్ష్యస్య భక్షణమ్।
అభక్ష్యం బ్రహ్మవిజ్ఞానవిహీనస్యైవ దేహినః ॥

శాస్త్రనిషిద్ధ భక్షణమునందు ఆశయు, ఆలాగున నిషిద్ధాహారము భుజించుటయు బ్రహ్మజ్ఞానమునకు హానికరము అని పాశుపత బ్రహ్మోపనిషత్.

ఉపనిషత్తులే ఈ లాగున నుద్ఘోషించుచుండగా అది తినిన నేమి? త్రాగిన నేమి? మనస్సే కదా కారణమని చెప్పువారిని గురించి లోకమే గ్రహించుకొనవచ్చును.

జ్ఞానే మమోదితే భోగాః కిం కుర్వంతీతి యే విదుః।
భోగే సంగం మతేర్భంగం జ్ఞానశైథిల్యమాప్నుయుః॥

జ్ఞానము కలిగిన పిమ్మట భోగము మమ్ము ఏమి చేయునని యెవరైన విచారశూన్యులు తలంచిరేని విషయభోగములచే వారి మనస్సు చెడిపోవుననియు, జ్ఞానముకూడ గాలిచే మేఘము శిథిలమై పోవునట్లు నశించుననియు గ్రహించుకొనవలయును.

యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః।
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్॥

ఎవడు శాస్త్రమునందు చెప్పబడిన విధుల నతిక్రమించి యథేచ్ఛగా సంచరించునో వాడు తత్త్వజ్ఞాన మొందడు. స్వర్గఫలమునుగూడ అనుభవింపడు. ఇహలోకసుఖమునుకూడ పొందలేడు. మరి యేమన దుర్గతినే పొందును.

సర్వే బ్రహ్మ వదిష్యంతి సంప్రాప్తే తు కలౌ యుగే।
నానుతిష్ఠంతి మైత్రేయ! శిశ్నోదరపరాయణాః॥

ఓ మైత్రేయుడా! కలియుగమున అందరున్నూ వేదాంతు లగుదురు. బ్రహ్మమును గురించియే మాట్లాడుదురు. బ్రహ్మనిష్ఠలు చేయవలసిన అనుష్ఠానములను కొంచెమైనను చేయరు. మరియు నెట్లుందురనగా శిశ్నోదర పరాయణులై ప్రబలముగా తిరుగుచుందురని పరాశరవచనము.

శిశ్నోదర పరాయణులనగా జిహ్వేంద్రియ గుహ్యేంద్రియ సుఖములనే కోరువారు. ఈ రెండింటియొక్క నిరోధ మెంతవరకు కలుగలేదో, అంత వరకు ముక్తిద్వారము తెరువబడదు. వీటి నిరోధ మెప్పుడు కలుగునో అప్పుడే బ్రహ్మరంధ్రము తెరువబడును.

ఉత్తమాం వృత్తిమాశ్రిత్య నీచవృత్తిం సమాశ్రితః ।
ఆరూఢపతితో జ్ఞేయః సర్వకర్మబహిష్కృతః ॥

ఎవడు పరమపావనమగు బ్రహ్మనిష్ఠాది సద్వృత్తుల నాశ్రయించి నీచ వృత్తియగు విషయభోగాదుల నవలంబించునో వాడు ఆరూఢపతితుడని తెలియదగినది. అట్టివాడు సమస్త పుణ్యకర్మములనుండి బహిష్కరింపదగిన భ్రష్టుడని భావము.

ఇంద్రియాణాం హి చరతాం విషయేషు స్వభావతః।
బలాదాహరణం తేషాం ప్రత్యాహారస్స ఉచ్యతే ॥

ఇంద్రియములకు స్వభావముగా విషయములందు సంచరించుట నైజగుణము. ఆ యింద్రియములను ధ్యానబలము గల బుద్ధిచే నాకర్షించి పరబ్రహ్మనిష్ఠయందు నిలుపుట ప్రత్యాహారమని చెప్పబడును.

ప్రవృత్తిమార్గముయొక్కయు, నివృత్తిమార్గముయొక్కయు స్వభావ మిచ్చట నిరూపించడ మైనది. విషయములలో సంచరించు స్వభావమును దానినుండి మఱలించుటయే నివృత్తిమార్గస్థుని కార్యము. ప్రవాహవేగమునకు లోబడిపోయెడి అచేతనవస్తువులు సముద్రములోనికి చేరును. చైతన్యజీవులు ప్రవాహమున కెదురేగి గమ్యస్థలములోనికి చేరుదురు. ఇదియే ప్రవృత్తి నివృత్తి మార్గములలో నుండువారి లక్షణమని గ్రహించవలయును.

మణిమంత్రౌషధైర్వహ్ని స్సుదీప్తో௨పి యథేంధనమ్।
ప్రదగ్ధుం నై వ శక్తస్స్యాత్ ప్రతిబద్ధ స్తథైవచ ॥

జ్ఞానాగ్నిరపి సంజాతః ప్రదీ ప్తస్సుదృఢో௨పి చ।
ప్రదగ్ధుం నై వ శ క్తస్స్యాత్ ప్రతిబద్ధస్తు కల్మషమ్ ॥

మండుచుండెడి యగ్నిని మణిమంత్రౌషధములచే కట్టు గట్టునప్పుడు ప్రజ్వలించినట్లు కనిపించినను ఎట్లు దహనశక్తి లేకుండ పోవునో; యాలాగున శాస్త్రజ్ఞానాగ్ని ప్రకాశించి దృఢబోధ గలిగినను విషయవాసన యుండినచో కర్మబీజములను దహింపజేయ శక్తి గలిగియుండదు అని పరాశరసంహిత.

ఘుటిక మొదలగు మణిమంత్రౌషధములచే అగ్నియొక్క దహనశక్తిని కట్టిన మామూలుగా వెలుగుచున్నట్లు కనపడినను కాల్చెడి శక్తి యుండదు. ఇట్టి ఘుటికామణి మొదలగు ప్రయోగములవలననే కొందరు అగ్ని గుండములో గూర్చొనియున్నను కాలకుందురు. అది జ్ఞానశక్తిగాని, యోగశక్తి గాని కాదు. జనులను భ్రమింపజేయుటకు మాత్రమే యుపయోగ పడును.

న ప్రమాదో௨త్ర క ర్తవ్యో విదుషా మోక్షమిచ్ఛతా।
ప్రమాదే జృంభతే మాయా సూర్యాపాయే తమో యథా॥

మోక్షమును గోరువారు సమాధినిష్ఠ విషయమై యజాగ్రత్త నొంద దగదు. సూర్యుడస్తమింపగా చీకటి ఉజ్జృంభించినట్లు ప్రమాదమునందు మాయ ఉజ్జృంభించుచున్నది అని వివేకచూడామణి.

విపరీతార్థధీర్యావన్న నిశ్శేషం నివర్తతే ।
స్వరూపస్ఫురణం యావన్న ప్రసిద్ధ్యత్యనర్గళమ్ ॥

ఎంతవఱకు ఆత్మస్వరూపముయొక్క విపరీతభావన నిశ్శేషముగా తొలగదో, ఎంతవఱకు స్వరూపానుభవ మనర్గళముగ సిద్ధింపదో, అంత వఱకు వారు సమాధినిష్ఠలను, నిదిధ్యాసనముల నభ్యసించుచుండవలయు నని సర్వవేదాంతసంగ్రహము.

గృహకర్మసమాస క్తమహం బ్రహ్మేతి వాదినమ్।
కర్మబ్రహ్మోభయభ్రష్టం తం త్యజేదంత్యజం యథా॥

గృహకృత్యములలో ఆసక్తిగల చిత్తముగలవాడై నేను బ్రహ్మసాక్షాత్కారము గలవాడనని చెప్పువాడు కర్మ, బ్రహ్మ ఉభయములనుండి భ్రష్టుడగును. అట్టివాడు అంత్యజునివలె సజ్జన సంఘములనుండి తొలగింప బడదగినవాడు.

గృహస్థాశ్రమసంబన్ధ ధర్మమును విడువనివాడును, బ్రహ్మసాక్షాత్కారస్థితిని పొందనివాడును ఉభయభ్రష్టు డనబడును.చెట్టు నెక్కినవాడు పై కొమ్మయందు కాలిని పెట్టుటకు ముందుగా రెండవపాదము నెత్తిన ఏలాగున క్రిందపడిపోవునో ఆలాగున గృహస్థధర్మము ననుష్ఠించక, బ్రహ్మధర్మమును బొందక తన ధర్మమును విడిచినవాడును పతనము నొందును.

మక్షికాపాదమాత్రం తు యథా హి విషమం విషమ్ ।
క్రియా తు నిఖిలాఽల్పాపి విపాకే దారుణా భవేత్ ॥

అణుమాత్రం విషం య త్తద్గ్రాహకాలే లవాగ్నివత్ ।
తథైవానుభవే భోక్తుర్మహాపీడాం కరోతి హి ॥

తథైవ పాతకం కర్మ క్రియాకాలేఽల్పమేవ యత్ ।
తద్భోగసమయే కర్తుర్విపాకే మేరుతాం వ్రజేత్ ॥

ఓ మానవుడా! కర్మఫలము మిగుల విచిత్రమైనది. చెప్పెద వినుము. మిగుల తెలివి గలవాడుకూడ కర్మకు లోబడి కష్ట మొందుచున్నాడు. ఈగ కాలు మాత్రము మిగుల స్వల్పమైనను విషము చాలా చెడ్డది. కర్మ లొనర్చునపుడు స్వల్పముగా నున్నప్పటికిని అవి యనుభవకాల మప్పటికి మిగుల దారుణము లగును. విషమును అణుమాత్రము పుచ్చుకొనినను అనుభవకాలమునకు స్వల్పమగు అగ్ని విశేషముగ ప్రజ్వలించునట్లు విశేషబాధను గలిగించును. అదే రీతిగా పాపకార్యమును జేయునపుడు మిగుల స్వల్పముగ నున్నప్పటికిని అనుభవకాలము వచ్చునప్పటికి మేరు పర్వతమువలె మిగుల గొప్పది యగును అని మాఘపురాణము.

పాపకర్మముయొక్క స్వభావమును విన్నారుగదా! మఱ్ఱివిత్తనము ఎంత సన్నదియైనను వృక్షముగా పరిణమించునపు డెంత గొప్పదిగా నుండునో పాపముయొక్క స్థితియు నాలాగున నుండును.

చిత్రామృతం నామృతమేవ విద్ధి చిత్రానలం నానలమేవ విద్ధి ।
చిత్రాంగనా నూనమనంగనేతి వాచావివేక స్త్వవివేక ఏవ ॥

ఓ! రామచంద్రా చిత్రమందలి యమృత మమృతము గాదు. చిత్ర మందలి యగ్ని యగ్నిగాదు. చిత్రమందలి స్త్రీ స్త్రీగాదు. ఇట్లే వాచా వివేకము వివేకము గానేరదు. అది యవివేకమే యగును.

అనుష్ఠానములేని వేదాంతబోధ లన్నియు సినిమాలో గనిపించెడి క్షీరసాగర మథనమున గలిగెడు అమృతమువలెను, లంకాదహనము వలెను, స్త్రీబొమ్మలవలె నుండును. అట్టి యమృతమును భుజించిన దేవత్వము సిద్ధించునా? అట్టి నిప్పులో తృణమైనను కాలునా? అట్టి స్త్రీతో సంసార మును జేసి సంతానమును గనగలుగునా? పైజెప్పిన బోధలవలన గలిగెడు ప్రయోజన మిట్టిదే.

ఇహైవ నరకవ్యాధేశ్చికిత్సాం న కరోతి యః ।
గత్వా నిరౌషధం దేశం వ్యాధిస్థః కిం కరిష్యతి॥

ఈ జన్మమునందే నరకవ్యాధికి చికిత్సను ఎవడొనర్పడో అనగా సంసార తరణోపాయమునకై యత్నింపడో అతడు పరలోకమును పొందినను ఏమి చేయగలుగును? ఔషధమును, వైద్యుడున్ను లేని దేశములో రోగము గలవాడు వెళ్ళి ఏమి బాగుచేసికొనగల్గును? అనగా సత్కర్మలచే స్వర్గాది లోక ముల పొందినను అచట మోక్షసాధన కార్యముల నేమియు జీవులు చేయ జాలరు. దానికి మనుష్యలోకమే తగియున్నది. కామ్యకర్మల ఫలమను భవించుటకు మాత్రము స్వర్గలోక మేర్పడినది. అనగా మనుష్యజన్మలో మాత్రమే బ్రహ్మధ్యానమును జేయుటకు తగిన యంతఃకరణసృష్టి యేర్పడియున్నది. అట్టి సామర్థ్యము దేవతలకుగాని, మరి యెవ్వరికిగాని కలిగియుండలేదు. జన్మము లన్నింటిలోను మానవజన్మము జ్ఞానముతో గూడిన దనియు, ఉత్కృష్ట మైనదనియు చెప్పుటకు కారణమిదియే.

ఉపసర్గాః ప్రవర్తంతే దృష్టే హ్యాత్మని యోగినః।

కామ్యాః క్రియా స్తథా కామాన్మనుష్యో యోఽభివాంఛతి ।
స్త్రియం దానఫలం విద్యాం మాయాం కుప్యం ధనం దివమ్

దేవత్వమమరేశత్వం రసాయనం వయః క్రియామ్ ।
మరుత్ప్రపదనం యజ్ఞం జలాగ్న్యావేశనం తథా ॥

శ్రాద్ధానాం సర్వదానానాం ఫలాని నియమాం స్తథా ।
తథోపవాసాత్ పూర్తాచ్చ దేవతాభ్యర్చనాదపి ॥

విఘ్నైమిత్థం ప్రవర్తేత యత్నాద్యోగీ నివర్తయేత్
బ్రహ్మసంగి మనః కుర్వన్నుపసర్గైః ప్రముచ్యతే ।

యోగుల కాత్మదర్శన కాలమం దేవిఘ్నములు గలుగుచున్నవో, వాటిని నీకు సంగ్రహముగా జెప్పెద వినుము. కామ్యక్రియలున్ను; అట్లే కామముచేత పురుషుడు, స్త్రీ, దానఫలము, విద్య, వంచనము, బంగారు, వెండి మొదలగునవిన్ని దానికంటె అన్యములైన లోహములున్ను, ధనము, స్వర్గము, దేవత్వము, ఇంద్రత్వము, రసాయనము, వయస్సు, క్రియ వాయువులో చరించుట, యాగము, జలస్తంభనము, అగ్నిస్తంభనము నందు ప్రవేశించుట, అ ట్లే శ్రాద్ధముయొక్క ఫలమును, సకలదానముల ఫలమును, వివేకములేని నియమముల నిచ్ఛగించుచున్నాడు. అట్లే కఠినోపవాసముల చేతను, ఇష్టాపూర్తములయిన గుంటలు, బావులు, తటాకములు మొదలగు నవి నిర్మించుటచేతను, దేవతార్చనలచేతను, అతిథులచేతను, బాహ్య కర్మములచేతను కలుగు విఘ్నములను గోరుచున్నాడు. ఈలాటి విఘ్నములు కలుగుచున్నవి. వాటిని యోగియైనవాడు ప్రయత్నముచేత మరలించి మనస్సును బ్రహ్మమునందు లగ్నముచేసి త్యజించి యావిఘ్నములనుండి విడివడుచున్నాడు అని హఠయోగ ప్రదీపిక–పీఠిక.

ఇది ఒక్కొక్కదానిని విశదీకరించి వ్రాయవలసినచో గ్రంథ బాహుళ్య మగును. కనుక అనుభవజ్ఞులద్వారా గ్రహించుకొనవలయును.

విహితస్యాననుష్ఠానాన్నిషిద్ధస్య చ సేవనాత్ ।
అనిగ్రహాచ్చేన్ద్రియాణాం నరః పతనమృచ్ఛతి ॥

విహితమైన యనుష్ఠానమును చేయకపోవుటచేతను, నిషిద్ధకార్య మును చేయుటచేతను, ఇంద్రియములయొక్క నిగ్రహము లేకపోవుటచేతను మనుజుడు పతితు డగుచున్నాడు.

యతతో హ్యపి కౌంతేయ! పురుషస్య విపశ్చితః।
ఇంద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః॥

ఓ యర్జునా! ఇంద్రియములను విషయములనుండి మఱలించుటకు ప్రయత్నించుచున్న విద్వాంసుడైన పురుషునియొక్క మనస్సునుగూడ క్షోభ

మును గలుగజేయునట్టి యింద్రియములు బలాత్కారముగ హరించుచున్నవి అని గీత.

దీనియందు ''యతతః విపశ్చితః'' అను రెండు పదములను ప్రయోగించ డమైనది. ప్రయత్నము జేయువాడును, విద్యావంతుడు అగువాని మనస్సు గూడ ఆకర్షింపబడునని చెప్పుచుండగా తదితరులను గుఱించి చెప్పవలయునా?

ధ్యాయతో విషయాన్పుంసస్సంగ స్తేషూపజాయతే ।
సంగాత్సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే ॥

క్రోధాద్భవతి సమ్మోహస్సమ్మోహాత్స్మృతివిభ్రమః।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥

ఇంద్రియ విషయములను చింతించుచున్న మనుజునకు ఆ విషయ ములందాసక్తి కలుగుచున్నది. అట్టి యాసక్తిచే కోరిక గలుగుచున్నది. కోరిక వలన కోపము జనించుచున్నది. కోపమువలన నవివేకము గలుగుచున్నది. యుక్తాయుక్త వివేకము లేని యవివేకమువలన మతిభ్రమ గలుగుచున్నది. మతిభ్రమవలన బుద్ధి నశించుచున్నది. అట్టి బుద్ధినాశమువలన తాను తప్పక నశించుచున్నాడు.

ఇవన్నిటికిని విషయవాంఛయే కారణ మగుచున్నది. అట్టి సంకల్పము గలుగునపుడే నివృత్తి చేసిన ప్రమాదము గలుగదు. చింతచెట్టు అంకురించు నపుడే సులభముగ గోటితో త్రుంచివేయువచ్చును. పెద్ద మానైనచో తీసివేయుట కెంత ప్రయాసమో వాసనావృత్తులయొక్క స్వభావ మాలాగున నుండును.

న కర్మణామనారమ్భాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥

పురుషుడు చేయవలసిన యనుష్ఠానములను చేయకపోవుటచేత నిష్కామ కర్మముచేత పొందలసిన మోక్షమును బొందడు. నిష్కామకర్మను

ష్ఠానమును వదలుటచేతను, లేక దేహసన్న్యాసము మాత్రముచేతను నైష్కర్మ్య సిద్ధిని పొందడు.

ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్న వశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపన్థినౌ ॥

ప్రతి ఇంద్రియముయొక్క విషయమునందును ఇష్టానిష్టములు గలిగి యుంటున్నవి. కనుక ఆ రాగద్వేషములకు అధీనము గాకూడదు. ఆ రాగ ద్వేషములు ఈ ముముక్షువగు పురుషునకు శత్రువులు. అనగా విఘ్నకారులు.

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్త మనశ్నతః ।
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున! ॥

ఓ యర్జునా! యధికముగా భోజనము జేయువానికిని, బొత్తిగా భుజింపని వానికిని, నధికముగా నిద్రించువానికిని, బొత్తిగా నిద్రించని వానికిని యోగము సిద్ధింపదు.

1. ఎక్కువ భుజించుట, 2.భోజనము లేకుండుట, 3.అధికముగా నిద్రించుట, 4. నిద్రలేకపోవుట – యీ నాలుగు యోగమునకు విఘ్నములు.

ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేకజన్మ సంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ ॥

పట్టుదలతో యత్నించుచున్న యోగనిష్ఠుడు పాపరహితుడై అనేక జన్మములందు అనుష్ఠించుటవలన పొందదగిన యోగసిద్ధిని బొందు చున్నాడు. పిమ్మట సర్వోత్తమమగు మోక్షమును బొందుచున్నాడు.

ఏ వృక్షమునుండి యెక్కువ ఫలము లభించునో, యది ఫలించుట కున్ను ఎక్కువ కాలము పట్టును. స్వల్పఫలము నిచ్చెడు కూరగాయల చెట్లు త్వరలో ఫలించినను శీఘ్రముగనే నశించును. బ్రహ్మనిష్ఠులు హృదయ క్షేత్రమున ప్రణవస్వరూపమగు పరబ్రహ్మబీజమును బెట్టి పోషించుచున్నారు. దీని ఫలమారంభించిన యనంత కల్పములవఱకును నశించని బ్రహ్మానంద

ఫలమును గలుగజేయున దగుటచే ఫలించుట కెక్కువ కాలము పట్టును. కావుననే ''న స పునరావర్తతే'' అనియు, ''యస్మాద్భూయో న జాయతే'' యనియు శ్రుతిస్మృతులు ఘోషించు చున్నవి. ''యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ'' యని గీతాచార్యు డుపదేశించుట కిదియే హేతువు.

యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।
న విముంచతి దుర్మేధా ధృతిస్సా పార్థ తామసీ ॥

ఓ యర్జునా! దుష్టబుద్ధిగల యే మనుజుడు అతినిద్రను, భయమును, దుఃఖమును, దిగులును, మదమును విడువడో అట్టి స్వభావము తామస గుణమే యగును. ఇవన్ని యోగమునకు విఘ్నకారులు అని గీత.

స తరతి స తరతి స లోకాంస్తారయతి ।

ఎవడు సంసార సాగరమును దాటునో వాడే దాటినవాడు. వాడు లోకములో నుండువారిని దాటించుటకు శక్తిమంతు డగునని నారదభక్తి సూత్రము.

దీనివలన తాను తరించిన పిమ్మటనే ఇతరులను తరింపజేయుటకు యత్నించవలయును. లేనిచో ప్రయోజన ముండదు. శ్రీ బుద్ధదేవుని జీవిత చరిత్రములో నీ విషయము గనందగును. శ్రీశంకర, శ్రీయేసు, శ్రీమహామ్మదు మొదలగు ప్రవక్త లాలాగుననే చేసిరి. వారి చరిత్రములో నీ విషయము తెలిసికొనవచ్చును.

స్త్రీ ధన నాస్తిక చరిత్రం న శ్రవణీయమ్ ॥

భగవద్భక్తులు, విరక్తపురుషులు స్త్రీ ధన నాస్తికులయొక్క చరిత్రములను వినరాదు. ఈ మూడును బ్రహ్మజ్ఞానమునకు విఘ్నములు.

శుద్ధిద్వయం మహత్కార్యం దేవానామపి దుర్లభమ్ ।
కౌపీనశుద్ధిః ప్రథమా వాక్యశుద్ధిరనంతరా ॥

దేవతలకు సహా మహత్కార్యమగు ఈ శుద్ధిద్వయము మహా

దుర్లభము. మొదటిది కౌపీనశుద్ధి – రెండవది వాక్యశుద్ధి.

కౌపీనశుద్ధి యనగా బ్రహ్మచర్యవ్రతము. వాక్ శుద్ధియనగా సత్య వచనము, నిషిద్ధాహారమును కోరకుండుట. దేవతలు మొదలు మనుష్యు లందరును ఈ శుద్ధిద్వయమును పొందకనే మాయామోహములో బడిపోవు చున్నారు. ఈ ద్వివిధశుద్ధులు లేకపోవుటయు విఘ్నకారణము.

ద్వయమేతన్న సిద్ధం చేజ్జీవితం తు నిరర్థకమ్ ।
యథా త్వం విద్ధి పుణ్యాత్మన్ రంధ్రపాత్రే చ పాచనమ్ ॥

జిహ్వోపస్థల రెంటియొక్క శుద్ధి గలుగనిచో నతని జీవితము నిరర్థ కము. ఓ పుణ్యాత్ముడా! అదెట్లనిన వినుము. రంధ్రము పడిన పాత్రము పచనక్రియ కెట్లుపయోగపడదో యాలాగున నుండును.

ఉలూకస్య యథా భానురన్ధకారః ప్రతీయతే ।
స్వప్రకాశే పరానందే తమో మూఢస్య జాయతే ॥

గుడ్లగూబకు సూర్యప్రకాశము చీకటిగా కనబడునట్లు మూఢునకు స్వప్రకాశ పరానందమునందు చీకటియే కనబడును.

అంతఃకరణమున తమోగుణము గలవానికి నిరతిశయానంద బ్రహ్మ సుఖమందు దృష్టి గోచరింపదు.

లయ, విక్షేప, కషాయ, రసాస్వాదేభ్యో రక్షితం
మే చిత్తమవిఘ్నేన బ్రహ్మణ్యవస్థితం భూయాత్ ॥

లయము (ఆలస్యము), సోమరితనముచేగాని, నిద్రచేగాని ప్రవృత్తి రహితమైనది. విక్షేపము– వృత్తి బహిర్ముఖ మగుట, కషాయము రాగాది దోషమువలన కలిగెడి మనోమాలిన్యము, రసాస్వాదము– తాను యోగసమాధిని పొందినట్లు గలిగెడి భావము. ఇది యానందమయ కోశమున గలుగును. పైజెప్పిన నాలుగును నిర్వికల్ప సమాధినిష్ఠకు ప్రతిబంధకములు. అనగా విఘ్నములు అని బ్రహ్మవిదాశీర్వాద పద్ధతి.

ప్రతివారును ధ్యానానుష్ఠానానంతరము ఈ బ్రహ్మవిదాశీర్వాద పద్ధతి యను చిన్నగ్రంథమును పారాయణచేయుట మంచిది. అట్లయిన యోగ విఘ్నములను దెలిసికొనవచ్చును. విఘ్ననివృత్తియును త్వరలో సిద్ధించును.

వాసనాక్షయ, మనోనాశ, తత్త్వజ్ఞానాభ్యాసవశాత్ జ్ఞానరక్షా, తపస్సిద్ధిః, సర్వసమత్వం, దుఃఖనివృత్తిః, సుఖావిర్భావ ఇత్యేతత్పంచ ప్రయోజనసిద్ధిర్భూయాత్॥

వాసనానాశమువలనను, మనోనాశమువలనను, తత్త్వజ్ఞానాభ్యాసము వలనను కలిగిన జ్ఞానరక్ష, తపస్సిద్ధి, సర్వసమత్వము, దుఃఖ నివృత్తి, సుఖా విర్భావము అను నీ అయిదు ప్రయోజనములయొక్క సిద్ధి కలుగునుగాక!

ఇట్టి యీశ్వర ప్రార్థనమువలన విఘ్నములు తొలగును.

రాహుగ్రస్తస్య సోమస్య యథా జ్యోత్స్నా న భాసతే।
తథా తమోఽభిభూతానాం భూతానాం నశ్యతే సుఖమ్॥

ఏలాగున రాహువుచే గ్రస్తమైన చంద్రునియొక్క ప్రకాశము కొంచెమైనను కనుపించక యావరణమైపోవునో, ఆలాగున తమోగుణముచే వ్యాప్తమైన హృదయముగల జీవులయొక్క ఆత్మప్రకాశమున్ను ఆవరణమై పోయి శాశ్వతమైన దివ్యసుఖమును పొందజాలరు.

సంపూర్ణ రాహుగ్రస్త గ్రహణకాలమున చంద్రప్రకాశము కొంచెమయి నను కనుపించదు. గ్రహణవిమోచనము గలిగి రాగా రాగా ఏలాగున కొంచెము కొంచెముగా ప్రకాశమేర్పడి పూర్ణవిమోచనము గలుగునపుడు బాగుగా ప్రకాశించునో, ఆలాగున అనుష్ఠానముచే ప్రకృతిదోషము హృదయమునుండి తొలగుచుండ కొంచెము కొంచెము ఆత్మశాంతియు, ఆత్మసుఖమున్ను గలుగుచు, సంపూర్ణముగా ప్రకృతి నశించునపుడు నిరతిశయానందము గలుగును.

యోగాభ్యాసేన మే రోగ ఉత్పన్న ఇతి కథ్యతే।
తతోఽభ్యాసం త్యజేదేవం ప్రథమం విఘ్నముచ్యతే॥

ద్వితీయం సంశయాఖ్యం చ తృతీయం చ ప్రమత్తతా ।
ఆలస్యాఖ్యం చతుర్థం చ నిద్రారూపం తు పంచమమ్ ।

షష్ఠం తు విరతిర్భ్రాన్తిః సప్తమం పరికీర్తితమ్ ।
విషమం చాష్టమం చైవ అనాఖ్యం నవమం స్మృతమ్ ॥

అలబ్ధిర్యోగతత్త్వస్య దశమం ప్రోచ్యతే బుధైః ।
ఇత్యేతద్విఘ్నదశకం విచారేణ త్యజేద్బుధః ॥

1. యోగానుష్ఠానముచేత నాకిట్టి వ్యాధి గలిగినదని తలంచి అందువలన నేను అనుష్ఠానమును విడిచితినియనునది మొదటివిఘ్నము, 2. సంశయము, 3. ప్రమాదము, 4. ఆలస్యము, 5. అతినిద్ర, 6. అనుష్ఠానము నందు ప్రీతి లేకుండుట. 7. భ్రమ, 8. ప్రయాసమని తోచుట, 9. అశాస్త్రప్రవర్తనము, 10. ఆత్మనిష్ఠయందు నిలుకడ లేకపోవుట– యోగీశ్వరులచేత ఈవిధముగ దశవిఘ్నములు చెప్పబడినవి కావున బుద్ధి మంతుడు ఈ పైజెప్పిన దశవిఘ్నములు గలుగనీయక చూడవలయును.

జపంతః ప్రణవం నిత్యం ముచ్యంతే సర్వపాతకైః ।
సదాఽభ్యాసేన సంయుక్తాః పరం మోక్షం లభన్తి చ ॥

ఈ విఘ్నములు నశించుటకును, పాపదోషములు క్షయించుటకును, బ్రహ్మభావముతో గూడిన ప్రణవమును నిత్యమును జపించవలయును. దీని వలన సర్వవిఘ్నములును, పాపములును నశించును. ఈ లాగున అను ష్ఠానమును జేయువారు పరమమయిన మోక్షమును పొందగలరు.

ఎంతవఱకు హృదయమున పాపముండునో అంతవఱకు విఘ్నములు గలుగుచుండును. ప్రణవమును గాని, యితరములగు దివ్యమం త్రములనుగాని హృదయములో మనస్సు నుంచి యీశ్వరభావముతో జపము చేయుచుండిన దోషము నశించును. జపకాలములో తాను జపించెడి యిష్టదేవతయొక్క భావమును హృదయమున నిల్పి ప్రతిమంత్రమున్ను, దివ్య శక్తిని గలిగినదిగా భావించి ప్రతిబీజాక్షరమున్ను హృదయమున స్ఫురించే

లాగున నెమ్మదిగా జపమొనర్ప వలయును. అట్లయినమాత్రమే పాప రాసులన్నియు నిప్పుచే దూది కాలిపోవునట్లు భస్మము లగును.

సర్వపాపేషు నష్టేషు బుద్ధిర్భవతి నిర్మలా ।
సైవ బుద్ధిస్సమాఖ్యాతా జ్ఞానశబ్దేన సూరిభిః ॥

ఎప్పుడు ధ్యాన జప తపస్సులచే పాపకర్మము లన్నియు నశించునో అప్పుడు బుద్ధి నిర్మలమగును. విఘ్నములు నశించును. అట్టి దోషరహితమైన విశుద్ధబుద్ధి యేది గలదో అట్టి బుద్ధియే జ్ఞానోపలబ్ధిని కలుగజేయునని మహర్షులు చెప్పిరి.

యది శైలసమం పాపం విస్తీర్ణం బహుయోజనమ్ ।
భిద్యతే ధ్యానయోగేన నాన్యో భేదః కదాచన ॥

అనేక యోజనముల విస్తీర్ణమై మహాపర్వతమువలె నుండు పాపముల న్నియు, ధ్యానయోగము ఒక్కదానిచే మాత్రమే నశించుటకు యోగ్యమగునే గాని వేఱు ఏ యుపాయముచేతను, ఒకప్పుడును భేదింప శక్తి చాలదు.

అనేక యోజనముల విస్తీర్ణము గలిగి యనేక కాలములనుండి పడియుండు కట్టెలన్నియు, అగ్నికణము పడినంతనే యెట్లు బూడిదయై పోవునో ఆలాగున దివ్యమంత్రమును దివ్యభావముతో జపించెడివారి పాపకర్మములున్ను, విఘ్నములున్ను నశించును.

యావచ్చ పాతకం దేహే తావత్సిద్ధిర్న జాయతే ।
గతే చ పాతకే తస్య సర్వం చ సఫలం భవేత్ ॥

ఎన్ని ధ్యానానుష్ఠానములు చేయువాడైనను ఎంతవఱకు దేహములో పాతకము నశించలేదో అంతవఱకు దైవజ్ఞానసిద్ధి యేమియు కలుగదు. ధ్యాన జపాదులచే పాపములు నశించునపుడు సమస్త సాధనలు ఫలమును గలుగజేయును.

ఒకప్పుడు తప్పుపని చేసి కారాగృహములో నెంతకాల ముండ

వలయునని శిక్ష యేర్పడి యుండునో అట్టి కాలము పూర్తియగులోపల బయటికి వచ్చుటకు యత్నించిన కాపలావారు అడ్డగించి లోపలకు త్రోయుదురు. కాలము పూర్తయగునపుడు ఇదివఱలో తన్ను నిరోధించిన విరోధులే ప్రేమతో బయటికిని విడిచిపెట్టుదురు. ఆలాగున పాతక ముండువఱకు పరమశాంతితో నిష్ఠయందుండుటకు యత్నించినను విఘ్నములు గలుగుచునే యుండును. పాపము నశించిన నిరతిశయ పరమసుఖనిష్ఠలో నుండవచ్చును. అయితే కారాగృహములో నుండువారి ప్రవర్తనము మంచిదిగా నుండిన సంవత్సరమునకు రెండు మాసములుగాని, నాలుగు మాసములుగాని శిక్ష తగ్గించు నేర్పాటు గలదు. ఇచ్చటగూడ దుష్టప్రవృత్తి గలిగియున్నచో కాలమును పొడిగించు పద్ధతిగూడ ఉన్నది. ఆలాగున అనుష్ఠాన కాలములో గలిగెడి విఘ్నములను ఓర్చుకొని వ్రతమును చెడనీయక యుండెనేని త్వరలోనే విఘ్నములు నశించును. అట్లుగాక ప్రవర్తనము చెడెనేని దీర్ఘకాలము దుఃఖము ననుభవించవలసి యుండును.

ఆచారాన్మోచితో విప్రో న వేద ఫలమశ్నుతే ।
ఆచారేణ తు సంయుక్తస్సంపూర్ణఫలభాక్ భవేత్ ॥

వేదాధ్యయన తత్పరుడై యున్నను ఆచరణయందు జాగ్రత్త లేక పోయిన వేదాధ్యయన తపస్సుల ఫలము ననుభవింపజాలడు. ఆచరణయందు జాగ్రత్త గలవాడు తపస్స్వాధ్యాయేశ్వర ప్రణిధానముల కెంతఫలము శాస్త్రములో చెప్పబడియున్నదో దానిని తప్పక పొందగల్గును అని మనువు.

ఎంత శ్రేష్ఠమైన ఔషధసేవ చేయుచున్నను పథ్యము సరిగా లేనిచో ఔషధముయొక్క ఫలము నెట్లు పొందజాలడో, దీనియొక్క స్థితియు ఆలాగున నుండును.

భయం క్రోధమథాలస్యమతిస్వప్నాతిజాగరమ్ ।
అత్యాహారమనాహారం నిత్యం యోగీ వివర్జయేత్ ॥

భయము, కోపము, సోమరితనము, అతినిద్ర, అతిజాగరణము,

అత్యాహారము, అనాహారము– వీనిని ధ్యాననిష్ఠగల యోగి ఎల్లప్పుడును విడువవలయును. ఇవియు విఘ్నములే.

వనేఽపి దోషాః ప్రభవన్తి రాగిణాంగృహేఽపి పంచేన్ద్రియ నిగ్రహ స్తపః।
అకుత్సితే కర్మణి యః ప్రవర్తతే నివృత్తరాగస్య గృహం తపోవనమ్॥

రాగద్వేషములు గలవాడు వనమునందుండినను దోషములే గలుగుచుండును. గృహస్థాశ్రమ మందుండినను పంచేన్ద్రియముల నిగ్రహము గలవాడు తాపసుడే యగును. నిందితముగాని కర్మను జేయువాడెచ్చట నుండినను జ్ఞానియే(ముక్తుడే) యగును. రాగరహితునకు గృహము తపోవనమువంటి పుణ్యభూమి యగును.

ఒకడు క్షీరాన్నమును జేయదలంచినచో రుచిగా నుండవలసిన స్వగృహములో వండినను, లేక యేకాంత స్థలమున వండినను పంచదార, పాలు, ద్రాక్ష, జీడిపప్పు, సగ్గుబియ్యము సరిగానుండిన మాత్రమే అది హృద్యముగా నుండును. వీటిలో నేది తగ్గినను గృహమందుగాని, వనమందుగాని రుచిగా నుండదు. జ్ఞానముయొక్క స్థితియు నీలాగున నుండును. అయితే యేకాంత ప్రదేశము బ్రహ్మనిష్ఠులకు శ్రేష్ఠమని చెప్పుటకు కారణమేమన గాలి విశేషముగా వీచుచుండు ప్రదేశమున వండిన యాలస్య మగును. శ్రమయున్ను గలుగును. గాలిలేని ప్రదేశమైనచో త్వరలో పక్వమగును. శ్రమ యుండదు. ఇంతే భేదముగాని పదార్థములలో కొఱత గలిగిన ఎచ్చటనైనను రుచిగా నుండదు. ఆలాగున శమదమాది గుణములు పూర్తిగా నుండిన గృహమందైనను, వనమందైనను ముక్తిని పొందవచ్చును. ఏకాన్త ప్రదేశములో నుండిన మనోనిశ్చలత్వమునకును, ఏకాగ్రతకును, నిర్మలత్వమునకు కొంత సహాయ మేర్పడును. మఱి యేమియు విశేషము లేదు.

మఱియు సన్న్యాసియైనను, ఆశ్రమమఠములలో నుండినను, గృహకార్యములనే చింతించుచు దానిని వృద్ధిచేయజూచినచో అతడు నీచస్థితినే పొందును. సంసారమందుండినను, ఆశ్రమములో, మఠములో నుండువారి సంకల్పమునే గలిగియున్నచో ఆశ్రమవాసులను పోషించెడి హృదయమును

గలిగియుండిన యాత డుత్కృష్టస్థితిని బొందును. దేహావసాన కాలమున మొదట చెప్పినవాడు సంసారమును, రెండవవాడు సన్న్యాసముయొక్క స్థితిని పొందగలుగును. జనకుడు గృహమందుండినను హృదయమును సన్న్యాస ముగా జేసెను. కనుక ముక్తుడయ్యెను. జడభరతుడు వనమందుండినను దృశ్యరూపమగు లేడిభావము హృదయమందుండుటచే జింకయై పుట్టెను. సూక్ష్మబుద్ధి గలవారు ఈసత్యమును దెలిసికొన యత్నించవలయును.

నాన్యద స్తి సురేశానా మిష్టసిద్ధిప్రదం దివి ।
దోగ్ధ్రీ ధేనుర్యథా నీతా దుఃఖదా గృహమేధినామ్ ॥

తథైవ జ్ఞానవాన్విప్రో దేవానాం దుఃఖదో భవేత్ ।
త్రిదశాస్తేన విఘ్న న్తి ప్రవిష్టా విషయం నృణామ్ ॥

యోగాదులంజేసి దేవాదులను మఱచి, అనుష్ఠానమును వదలి అనిర్వాచ్య జ్ఞానానందానుభవ ప్రమత్తుడై ప్రవర్తించినచో దేవతలు ఇష్టా పూర్తిని బడయలేమి కోపము వహించి శపింతురు. (విఘ్నముల నొనర్తురు) మఱియు పాలుపితుకు ఆవును వేఱొకడు పెడదారిం గొంపోవ గృహమేధి యెంత యలమట బొంది చింతించి వెదకి తనదారికి త్రిప్పుకొనునో, ఆలాగుననే అమరవరులు చింతిలువారలై తమ త్రోవను వీడి కైవల్య పథములో ద్రొక్కు వానిని పలువిధముల విఘ్నముల బన్నుచు ముందుకు పోనివ్వరు- అని శివగీత

ఎంత బ్రహ్మనిష్ఠుడైనను, యోగియైనను, అహంకరించి ధర్మా నుష్ఠానము నతిక్రమించి ప్రవర్తించినచో దేవతలు ముందుకు పోనీయక విఘ్నములను గల్పించి పతితునిగా చేయుదురు. ఈ రహస్యము దెలియక పోవుటయే కొందఱున్నత స్థితిలోనికి వచ్చియు పడిపోవుటకు కారణముగు చున్నది. కావున ప్రతిముముక్షువును శాస్త్రవిధ్యతిక్రమమును జేయరాదు.

యద్యేవం దేవతా విఘ్నమాచరంతి తనూభృతామ్।
పౌరుషం తత్ర కస్యాస్తి యేన ము క్తిర్భవిష్యతి ।
సత్యం సూతాత్మజ! బ్రూహి తత్రోపాయోఽస్తి వా న వా ॥

ఓ మహానుభావా! సూతపుత్రా! ఈ తీరున దేవతలు స్వతంత్రులై తమ తృప్తికిగా నరులు పోవు జ్ఞానసరణిని విఘ్నములచే నరికట్టుచుండిరేని ముక్తి పదంబు నొందుటెప్పుడు? ఎట్టి పౌరుషముచేనైన ఆ విఘ్నములను దొలగ ద్రోయు తెఱువున్నదా? నిక్కము తెలుపు మనుటయు సూతం డిట్లనియె.

సూత ఉవాచ:-

కోటిజన్మార్జితైః పుణ్యై శ్శివే భక్తిః ప్రజాయతే ।
ఇష్టాపూర్తాని కర్మాణి తేనాచరతి మానవః ॥

శివార్పణధియా కామాన్ పరిత్యజ్య యథావిధి ।
అనుగ్రహాత్తేన శంభోర్జాయతే సుదృఢో నరః ।
తతో భీతాః పలాయన్తే విఘ్నం హిత్వా సురేశ్వరాః ॥

అనేక జన్మములనుండి యొనర్చు పుణ్యఫలములవలన ఈశ్వరుని యందు భక్తి పుట్టుచున్నది. ఆ హేతువున మనుజుడు అభిమతార్థ ప్రదములగు సత్కర్మము లాచరించును. అతడాచరించు కర్మముల నీశ్వరార్పణబుద్ధితో చేసెనేని తానీశ్వరుని యనుగ్రహమున సంకల్పసిద్ధు డగును. అమోఘంబగు నీశ్వరానుగ్రహంబున వాని సంకల్పమునకు గలుగు నంతరాయంబు లంతరించుటజేసి దేవతలు తాము వ్యర్థ ప్రయత్నులగుట నూహించియు, సర్వేశ్వరాగ్రహంబున తమకేమి కీడు మూడునో యని భీతిల్లియు అట్టివాని యుద్యమంబున కేలాటి విఘ్నము నొనర్పజాలక పారిపోయెదరు.

ఒక గ్రామమున నొక ధనికుడుండేవాడు. అతనికి ఆ జిల్లా పోలీసు సూపరింటెండెంటు నిండా మిత్రుడై యుండెను. అతడు క్రింది జవానులను లక్ష్యము చేయువాడు కాడు. అయితే సూపరింటెండెంటు ఇతనికి మిత్రుడని యెరింగియుండుటచేత సర్కిల్ యిన్స్పెక్టరు, సబ్‌యిన్స్పెక్టరు మొదలు జవానువఱ కెవరున్ను అతని జోలికి పోయేవారు గారు. అంతేగాక సహాయముగూడ చేయుచుండిరి. కారణమేమన సూపరింటెండెంటు

ఇతనికి మిక్కిలి ప్రియు డగుటచే ఇతనికి నేదైన ప్రతిబంధమును గలుగజేసిన సూపరింటెండెంటు గారికి ఆగ్రహము గలిగి తమ కేదైనా కీడు మూడునని తలంచి యుండువారు. ఈశ్వరానుగ్రహము గలిగిన వారి స్థితి యీలాగున నుండును.

మఱియొక్క గ్రామమున నొక శ్రీమంతుడుండేవాడు. అతనికిని, ఆ జిల్లా సూపరింటెండెంటుగారికిని విరోధము కారణాంతరములచే గలిగియుండెను. ఈ రహస్య మెఱింగియుండు క్రింది యధికారులు సర్కిల్ యిన్స్పెక్టరు మొదలు జవాను వఱకుండు వారందఱును ఇతనికి బాధలు గలుగజేయుచునే యుండిరి. ఈశ్వరానుగ్రహము గలుగని వారిస్థితి యీలాగున నుండును.

ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా ।
మహాభయపరిత్రాణా ద్విత్రాణాముపజాయతే ॥

అద్వితీయమగు పరబ్రహ్మనిష్ఠ స్థిరమగుట యనునది మహాఘోర సంసార దుఃఖమును తొలగించి రక్షించుటకు పరమేశ్వరునియొక్క కరుణా కటాక్షవీక్షణానుగ్రహముచే మాత్రము ఏ యిద్దరు, ముగ్గురికో ఏర్ప డుచున్నది అని అవధూతగీతలో దత్తాత్రేయ వాక్యము.

బ్రహ్మజ్ఞానులలో శ్రీదత్తాత్రేయులకు సమాను లయినవారు మఱియొక రుండియుండలేదు. ఏలయన ఆయన త్రిమూర్త్యాత్మక స్వరూపుడు. అట్టివాడే అవధూత గీతయందు మొదటనే ఈశ్వరానుగ్రహము లేనివారు సంసార దుఃఖములనుండి(విఘ్నములనుండి) దరిజేరజాలరను చెప్పుటకన్న పరమ ప్రమాణమేమి గావలయును?

ఉత్సాహః సాహసం ధైర్యం బుద్ధిశ్శక్తిః పరాక్రమః।
షడేతే యత్ర తిష్ఠన్తి తత్ర దేవోఽపి తిష్ఠతి॥

1. ఆసక్తి, 2.సాహసము, 3.ధైర్యము, 4.సూక్ష్మబుద్ధి, 5. ఆత్మశక్తి, 6. కార్యదీక్ష -యీ యారు గుణము లెవనియందు గలవో వానికి దైవ

సహాయము గలుగును.

దీనియందొక రహస్యము గలదు. పైజెప్పిన యారు గుణములు గలిగి ప్రవర్తించిన పిమ్మటనే దైవానుగ్రహము గలుగునని చెప్పడమైనది. అట్లు తాను చేయవలసిన కార్యమును జేయక ఈశ్వరానుగ్రహము కలుగలేదని చెప్పిన నేమి ప్రయోజనము? ఇది యొక విధమగు సోమరితనమే యగును. ఇప్పుడు లోకములో చాలామంది యిట్టి స్వభావము గలవారై యున్నారు.

యోగతత్త్వం ప్రవక్ష్యామి యోగినాం హితకామ్యయా।
యచ్ఛ్రుత్వా చ పఠిత్వా చ సర్వపాపైః ప్రముచ్యతే॥

యోగులయొక్క మేలుకొరకు యోగతత్త్వమును చెప్పుచున్నాడను. దీనిని వినినప్పటికిన్ని, చదివినప్పటికిన్ని సకల పాపములనుండి విముక్తి నొందు చున్నాడు అని యోగతత్త్వోపనిషత్తు.

ఈ యుపనిషత్తు శ్రీమన్నారాయణమూర్తి చతుర్ముఖ బ్రహ్మదేవున కుపదేశించినది.

విష్ణుర్నామ మహాయోగీ మహాభూతో మహాతపాః।
త త్త్వమార్గే యథా దీపో దృశ్యతే పురుషోత్తమః॥

పురుషోత్తముడైన మహావిష్ణువు మహాయోగియై సకలభూతములకును ఆశ్రయుడై, మహాతపస్సంపన్నుడై, తత్త్వమార్గమునందు దీపమువలె ప్రకాశించుచున్నాడు.

తమారాధ్య జగన్నాథం ప్రణిపత్య పితామహః।
పప్రచ్ఛ యోగత త్త్వం మే బ్రూహి చాష్టాంగసంయుతమ్॥

సకలలోకాధిపతియగు ఆ విష్ణువును బ్రహ్మదేవు డారాధించి నమస్కరించి యెనిమిదంగములతో కూడిన యోగతత్త్వమును నాకు బోధింపుమని యడిగెను.

కామః క్రోధో భయం వాఽపి మోహో లోభో మదో రజః ।
జన్మ మృత్యుశ్చ కార్పణ్యం శోక స్తంద్రా క్షుధా తృషా ॥

తృష్ణా లజ్జా భయం దుఃఖం విషాదో హర్ష ఏవ చ ।
ఏభిర్దోషైర్వినిర్ముక్తస్స జీవః కేవలో మతః ॥

జీవుడు కామము, క్రోధము, భయము, మోహము, లోభము, మదము, రజోగుణము, జన్మము, మరణము, కృపణత్వము, శోకము, సోమరితనము, ఆకలి, దప్పిక, అత్యాశ, లజ్జ, భీతి, దుఃఖము, విషాదము, సంతోషము - ఇవి మొదలగు దోషములచేత విడువబడినవాడై కేవలుడై యుండవలయును.

ఇట్టి ప్రకృతిగుణములతో కూడియుండువరకు జీవుడనబడును. ఈ గుణములనుండి విడుదల పొందినప్పటినుండి కేవల శివస్వరూపు డగును.

తస్మాద్దోష వినాశార్థ ముపాయం కథయామి తే ।
యోగహీనం కథం జ్ఞానం మోక్షదం భవతి ధ్రువమ్ ॥

యోగోఽపి జ్ఞానహీనస్తు న క్షమో మోక్షకర్మణి ।
తస్మాద్జ్ఞానం చ యోగం చ ముముక్షుర్దృఢమభ్యసేత్ ॥

కాబట్టి యీ దోషములు నివృత్తి చేయుటకు నీకుపాయమును జెప్పెదను. యోగములేని జ్ఞానమెట్లు మోక్షమొసంగును? అట్లే జ్ఞానము లేని యోగమును మోక్షము నొసంగదు. కాబట్టి మోక్షమును కోరువాడు జ్ఞానమును, యోగ మును చక్కగా నభ్యసింపవలయును.

అజ్ఞానాదేవ సంసారో జ్ఞానాదేవ విముచ్యతే ।
జ్ఞానస్వరూపమేవాదౌ జ్ఞానం జ్ఞేయైక సాధనమ్ ॥

అజ్ఞానముచేతనే సంసారము కలుగుచున్నది. జ్ఞానము చేతనే సంసారదుఃఖ నివృత్తి యగుచున్నది. ఆదియందు జ్ఞానస్వరూపముగానే యుండినది. ఆజ్ఞానము జ్ఞేయమునకు సాధనమై యున్నది.

ప్రథమాభ్యాసకాలే తు విఘ్నాస్స్యు శ్చతురానన ।
ఆలస్యం కథనం ధూర్తగోష్ఠీ మంత్రాదిసాధనమ్ ।

ధాతుస్త్రీలౌల్యకాదీని మృగతృష్ణామయాని వై ।
జ్ఞాత్వా సుధీస్త్యజేత్సర్వాన్ విఘ్నాన్ బుద్ధిప్రభావతః ॥

యోగము నభ్యసించుకాలమున ప్రథమమున విఘ్నములు సంభవించును. అవి యెవ్వియనగా సోమరితనము, ఆత్మస్తుతి, దుర్జన సహవాసము, దుష్టమంత్రమును సాధించుట, రసవాదము, స్త్రీలోలత- అనునవి. ఈయోగ విఘ్నములను బుద్ధిమంతుడైనవాడు ఎండమావులవలె దలంచి పుణ్యప్రభావము వలన త్యజించవలయును.

సాధకులలో చాలమంది ఈలాటి భ్రమలో బడిపోయెడివారు గలరు. పై జెప్పినవన్నియు ఎండమావులవలె చూచుటకు మాత్రమేగాని ప్రయోజన ముండదు. ఎండమావులను చూచునప్పుడు జలము గలదని తలంచి ఎంత పరుగెత్తిపోయినను నీరు దొరకక దాహశాంతి కాక క్లేశమును పొందునట్లు పైజెప్పిన వానియొక్క స్వభావమని గ్రహించుకోవలయును.

కందర్పస్య యథా రూపం తథాస్యాదపి యోగినః ।
తద్రూపవశగా నార్యః కాంక్షంతే తస్య సంగమమ్ ॥

యది సంగం కరోత్యేష తస్య బిందుక్షయో భవేత్ ।
వర్జయిత్వా స్త్రియాస్సంగం కుర్యాదభ్యాస మాదరాత్ ॥
యోగినోఽంగే సుగంధశ్చ జాయతే బిందుధారణాత్ ।

ఇట్టి యోగి మన్మథునివంటి అందము గలవాడుగ నుండును. స్త్రీలు అతని యందమును చూచి మోహింతురు. అప్పు డీయోగి స్త్రీలతో చేరిన యింద్రియనష్టము కల్గును. కావున స్త్రీసంగమును త్యజింపవలయును. మిక్కిలి శ్రద్ధతో యోగము నభ్యసింపవలయును. ఇట్లు అభ్యసించుచు ఇంద్రి యమును స్ఖలనము చేయకుండు యోగిశరీరమునందు మంచి పరిమళము కల్గును.

బ్రహ్మచర్యముచేతను, యోగధారణచేతను దివ్యదేహము గలుగును. అప్పుడెటువంటి స్త్రీలకైన ఆ యోగియొక్క సంసర్గమునకు అపేక్ష గల్గును. అట్టి స్త్రీలు మంచి స్వభావమున్ను, పుణ్యబుద్ధియు కలవారైనను యోగియొక్క బ్రహ్మతేజస్సునం దట్టి ఆకర్షణశక్తి గలిగియున్నది. అయస్కాంతము ఇనుము నేలాగున బలాత్కారముగ నాకర్షించునో అట్టి ఆకర్షణశక్తి సృష్టియందు గలదు. ఒకడు బ్రహ్మచర్యవ్రతమును సేవించి తపమొనర్చుచుండెనేని అతడు తక్కువజాతి వాడైనను, రూపలావణ్యము లేకపోయినను, ఉన్నతస్థితిలో నుండు స్త్రీలైన అతని సంస్పర్శమును అభిలషించుదురు. కావుననే బ్రహ్మచర్యవ్రతనిష్ఠ గలిగి ధ్యానయోగతపస్సు నొనర్చువాడు స్త్రీలుండు స్థలంబున నుండరాదని శాస్త్రము తెలుపు చున్నది.

తతో రహస్యుపావిష్టః ప్రణవం ప్లుతమాత్రయా ।
జపేత్పూర్వార్జితానాం తు పాపానాం నాశహేతవే ॥

ఏకాంతమున గూర్చుండి పూర్వజన్మకర్మ దోషములు నశించుట కొఱకు ప్రణవమును (ఓంకారము) మూడు మాత్రల కాలము జపించవలయును.

ప్రణవమునుగాని, ఇష్టదేవతా మంత్రమునుగాని, చిత్తైకాగ్రతతో హృదయమున నిలిపి జపించవలయును. ఆ దివ్యమంత్రము ప్రకాశమైనదై తన అంతఃకరణలోగల సమస్తదోషములను భస్మమొనర్చునదిగా భావన చేయవలయును.

సర్వవిఘ్నహరో మంత్రః ప్రణవః సర్వదోషహా।
ఏవమభ్యాసయోగేన సిద్ధి రారంభసంభవా ॥

ప్రణవము బ్రహ్మభావముతో జపమొనర్చిన సకల విఘ్నములను, సకల పాపములను నశింపజేయును. ఇట్లు జపించుటచేత ప్రారంభమునుండి అనేక దివ్యసిద్ధులు గలుగును. జ్ఞానముదయ మగును.

యామమాత్రం ప్రతిదినం యోగీ యత్నాదతంద్రితః ।
యథా వా చిత్రసామర్థ్యం జాయతే యోగినో ధ్రువమ్ ॥

యోగియైనవాడు ప్రతిదినమును సోమరితనము లేక ఒక జాము అభ్యసించిన యెడల వానికి వివిధములగు దివ్యసామర్థ్యములు కల్గును.

మూడు జాములు ధ్యానము చేయుట యుత్తమ పక్షమనియు, రెండు జాములు మధ్యమ పక్షమనియు, ఒక జాము కనిష్ఠపక్ష మనియు గ్రహించు కొనవలెను. మూడు ఘంటల సమయము ఒక జామని గ్రహించేది. బ్రహ్మ ముహూర్తమున ప్రారంభించి పండ్రెండు ఘంటల సమయమువరకు ధ్యాన ములో నుండిన మూడు జాముల సమయ మగును. ప్రాతఃకాలమునుండి తొమ్మిది ఘంటలకాలమువరకు ధ్యానములోనుండు టొక జామునం బడును. ఇంతవఱకైన చేయనిచో ఆత్మప్రబోధము కల్గదు. ఇట్టివారుకూడ ఇప్పుడు అరుదైరి. అందువలన పూర్వికఋషుల, యోగీశ్వరుల, సిద్ధపురుషుల స్థితిని ఇప్పుడుండువారు పొందక పోవుచున్నారు.

శిష్యాశ్చ స్వస్వకార్యేషు ప్రార్థయంతి న సంశయః ।
తత్తత్కర్మకరవ్యగ్రస్యాభ్యాసో విస్మృతో భవేత్ ॥

శిష్యులు తమ తమ కార్యములు చేయుటకై ప్రార్థించుచుందురు. ఆ కార్యములందు బుద్ధిని వినియోగించుచుండిన యెడల యోగాభ్యాసము తరిగి పోవును.

ఈ భగవద్వాక్యమును బ్రహ్మనిష్ఠుడు బాగుగ నాలోచించుకొన వలయును. ధ్యానయోగముచే కొంత ఆత్మశక్తి గలుగునప్పుడు శిష్యు లనేకులు చేరుదురు. మఠము కట్టుటకు కొందరును ఆశ్రమము స్థాపిం చుటకు మఱికొందరును, సంస్కృతపాఠశాల నెలకొల్పుటకు వేరు కొంద రును, దేవాలయమును నిర్మించుటకు కొందరును, వార్తాపత్రికలను ఆరం భించుటకు కొందరును, ప్రచారముకొఱకు కొందరును, సత్రము కట్టుటకు కొందరును ప్రోత్సహించుచుందురు. ఇత్తరి శిష్యుల వాక్యము లాలకించి అజాగ్రత్త పడక చూచుకొనుచుండవలయును. లేనిచో గుమాస్తా ఉద్యో గమునకు తయారైనపుడు చదువు మాని యుద్యోగమునకు వెళ్ళినవాని గతియే కల్గును. పాపమిత డేమి చేయగల్గును? పై చదువున్ను పోయినది.

గొప్ప యుద్యోగానికి అర్హత లేకపోయెను. చిన్నఉద్యోగము నాశింపక ఉన్నతమైన చదువు చదువుచుండిన గొప్ప యుద్యోగము వచ్చును. కావలసిన ధనమును, ప్రజల ఆమోదమున్ను బడయవచ్చును. అప్పుడెంత గొప్ప కార్యమైనను సులభముగా సాధింపవచ్చును. అట్లు కానిచో శ్రమ పడవలసియుండును. ఈతత్త్వమును తీవ్ర ముముక్షుత్వము గలవారు జ్ఞప్తిలో నుంచవలయును. యోగసిద్ధి జీవన్ముక్తి గలుగువరకు అనుష్ఠానము విడనీయక చూచుకొనిన అనేక శ్రీమంతులేగాక మహారాజులుకూడా తన ఆజ్ఞకు బద్ధులై యుందురు. అట్టి స్థితిలో ఎంత గొప్పకార్యమైనను ప్రయాసము లేక జరిగిపోవును.

అవిస్మృత్య గురోర్వాక్య మభ్యసేత్తదహర్నిశమ్ ॥

కాబట్టి గురువాక్యమునందు మరుపులేనివాడై నిరంతరమును అభ్యాసము చేయవలయును.

పైచెప్పిన విఘ్నములు తొలగుటకు గురువాక్యమందును శాస్త్రవాక్య మునందును ఏమరుపాటు కలుగక ఈశ్వరునియందు విశ్వాసము గలిగి అనుష్ఠానము చేయవలయును.

ఆసనం పాత్రలోపశ్చ సంచయశ్శిష్యసంగ్రహః।
దివాస్వాపో వృథాలాపో యతేర్బంధకరాణి షట్॥

1. ఆసనము, 2.పాత్రలోపము, 3.సంచయము, 4.శిష్యసంగ్రహము, 5.దివాస్వాపము, 6.వృథాలాపము అను నీ యారును సన్న్యాసికి ప్రతి బంధకములు (విఘ్నములు) అని నారదపరివ్రాజకోపనిషత్తు.

వీటికిగల అర్థములు ఒక్కొక్క శ్లోకముచేత క్రింద వ్రాయబడుచున్నవి. దివాస్వాపమనగా పగటినిద్ర.

ఏకాహాత్పరతో గ్రామే పంచాహాత్పరతః పురే ।
వర్షాభ్యోఽన్యత్ర యత్ స్థానమాసనం తత్ప్రకీర్తితమ్ ॥

1. ఆసనము.

గ్రామములలో నొక దినముకంటె, పట్టణములలో ఐదు దినముల కంటె అధికకాలము నిలువడమున్ను, చాతుర్మాస్యము నాలుగు మాసము లలో తప్ప ఇతర కాలములయందొకచోట విశేషకాలము నిలుచుట ఆసన మనబడును.

ఇది ధర్మబోధకులై సంచరించు బోధకులగు యతులను గురించి చెప్పడమైనది. ఒకే స్థలములోనుండి ధ్యానానుష్ఠానము చేయువారిని గురించి గాని, వేదాంతశాస్త్రశ్రవణము చేయువారిని గురించి గాని చెప్పినది కాదు.

2.పాత్రలోపము.

ఉక్తాలాబ్వాది పాత్రాణామేకస్యాపి న సంగ్రహః ।
భిక్షోర్భైక్ష్యభుజశ్చాపి పాత్రలోపస్స ఉచ్యతే ॥

సన్న్యాసి యగువాడు భిక్షాన్నము భుజించు నప్పటికి శాస్త్రమందు విధించిన సొరకాయబుఱ్ఱ, కమండలువు, వెదురుకఱ్ఱ, మట్టి మొదలగు పాత్రలే యుండును. వీటిలో నేదైన నొక దానినైన గ్రహింపక పోవుట పాత్రలోపమని చెప్పబడును.

పైజెప్పిన పాత్రలుండిన దొంగలభయముండదు. లోహపాత్ర సంబంధ ముండిన ఎవ్వరైన అపహరించుదురు. అందువల్ల ధ్యానకాలములో గాని, యాత్రాకాలములో నిద్రాసమయమందుగాని సంకల్పము గలుగుట కవకాశ ముండును.

3.సంచయము.

గృహీతస్య తు దండాదేర్ద్వితీయస్య పరిగ్రహః ।
కాలాంతరోపభోగార్థం సంచయః పరికీర్తితః ॥

దండకాషాయాదులను పరిగ్రహించి అవి ఖిలమైన తరువాత తిరిగి ధరించుటకుగాను రెండు మూడు దండములను, అలాగున కాషాయ

వస్త్రములను సంపాదించి పెట్టుకొనుట సంచయ మనబడును.

ఎప్పటి కెంత కావలయునో అంతమాత్రమే ఏ వస్తువైన దగ్గర నుంచ వచ్చును. భావికాలమునకు కావలయునని తలంచి సంపాదించి యుంచ కూడదు. ఇదియు యాత్రాపరుడైన సన్న్యాసికి విధించడమైనది. ఆశ్రమము లను, మఠములను స్థాపించి బ్రహ్మవిద్యను వృద్ధిపరచుటకు తలంచిన వారైనచో బ్రహ్మచారులకును, సాధనపరులగు వారికిని తగిన యేర్పాటు చేసికొనవచ్చును.

4. శిష్య సంగ్రహము.

శుశ్రూషాలాభపూజార్థం యశోఽర్థం వా పరిగ్రహః ।
శిష్యాణాం తు న కారుణ్యాత్ స జ్ఞేయః శిష్యసంగ్రహః ॥

శుశ్రూష, లాభము, పూజ, కీర్తి-అను వాని నపేక్షించి శిష్యులను చేర్చుకొనుట శిష్యసంగ్రహ మనబడును. కేవలము దయచేత శిష్యులను కృతార్థులను చేయువలయుననెడి ఇచ్ఛచేత చేర్చుకొనుట శిష్యసంగ్రహ మనబడదు.

బ్రహ్మనిష్ఠులైనవారు తగిన యోగ్యతలేని వారిని చేర్చుకొనిన వారివల్ల ఏదో లాభము గలుగునని తలంచినచో అది గొప్పప్రతిబంధమే యగును. ఆత్మశుద్ధియు, వైరాగ్యమును లేనివారిని చేర్చుకొనిన మరల అనేక కష్టములు పడవలసియుండును.

5. దివాస్వాపము.

విద్యా దినం ప్రకాశత్వాదవిద్యా రాత్రిరుచ్యతే ।
విద్యాభ్యాసే ప్రమాదో యః స దివాస్వాప ఉచ్యతే ॥

బ్రహ్మవిద్య ప్రకాశస్వరూప మైనందున దివా (పగలు) అని చెప్ప బడును. అజ్ఞానము అప్రకాశమైనందున రాత్రి యనబడును. ఉపనిష ద్విద్యయనెడి పగటియందు ప్రమాదము (అజాగ్రత్త) గలిగియుండుటయే

దివాస్వాప (పగటినిద్ర) మనంబడును.

ఇపు డచటచట పురుషులలోను, స్త్రీలలోను భక్తి వైరాగ్యములు గలిగి అనుష్ఠానము చేయువారు కొంతమంది యుండినను, విద్యయందు చాల అశ్రద్ధ గలిగియున్నారు. ఈకొరతను తొలగించుటకు విద్యయందుకూడ కొంత శ్రద్ధను వహించుకొనవలయును. లేనిచో అట్టివారు పగలు నిద్ర పోయెడి వారివలె నుందురని శ్రుతి యుద్ఘోషించుచున్నది.

6. వృథాలాపము.

ఆధ్యాత్మికాం కథాం ముక్త్వా భైక్షచర్యాం గురుస్తుతిమ్ ।
అనుగ్రహాత్పరి ప్రశ్నే వృథాలాపస్స ఉచ్యతే ॥

అధ్యాత్మ విషయమైన కథలను దేహధారణార్థమైన భిక్షాచరణమందు, భిక్షాందేహి అను శబ్దోచ్చారణమును, పరమేశ్వర స్తవమును మాత్రము సన్న్యాసి చేయవలయును. వీటికంటె నిరతములైన లోకసమాచారములను అనుగ్రహముచేతనైన అడిగే వారికి చెప్పుటకూడ వృథాలాప మనబడును.

యతులు అధ్యాత్మ జ్ఞానవిషయమై ధర్మబోధనార్థమై మాత్రమే వాక్యము లుచ్చరించవలయును. ఈశ్వరకీర్తన, భజనాదులు, గీతా పారాయణ, ఉపనిషత్ పఠనాదులు చేయుచుండవచ్చును. భిక్షాన్నమునకు వెళ్ళినప్పుడు ఒక్కొక్క సంప్రదాయ మనుసరించి ఒక్కొక్క వాక్యము నుచ్చరించుదురు. 1.భవతి భిక్షాం దేహి, 2.హరిః ఓమ్, 3. ఓమ్ తత్ సత్, 4.అలర్, 5.నారాయణ– ఈలాటి పద్ధతులు గలవు.

ప్రతిగ్రహసమర్థోఽపి ప్రసంగం తత్ర వర్జయేత్ ।
ప్రతిగ్రహేణ హ్యస్యాశు బ్రాహ్మం తేజః ప్రశామ్యతి ॥

ప్రతిగ్రహమందు సమర్థత గలిగియుండినను అట్టి స్వభావము మానవలయును. పరవస్తు పరిగ్రహముచే శీఘ్రముగా తన బ్రహ్మతేజస్సు నశించును.

పరవస్తుపరిగ్రహముచే తన పుణ్యము నశించును. కేవలము బ్రహ్మ నిష్ఠగాని, అధ్యయనముగాని చేయువారు, తమ కత్యవసరమునకు మాత్రము అన్నవస్త్రాదులను గ్రహింపవచ్చును. లేనిచో బ్రహ్మనిష్ఠయున్ను, అధ్య యనమున్ను, ధర్మబోధయున్ను జరుగదు.

కర్మత్యాగాన్న సన్న్యాసో న ప్రేషోచ్చారణేన తు ।
సంధౌ జీవాత్మనో రైక్యం సన్న్యాసః పరికీర్తితః ॥

విహిత కర్మానుష్ఠానములను మానుటవల్లగాని, ''సన్న్యస్తం మయా'' అని ప్రేషోచ్చారణవలనగాని సన్న్యాస మేర్పడదు. ప్రత్యగభిన్న బ్రహ్మాను భవమే సన్న్యాస మనంబడును.

ఎవరెవరికి ఏ అనుష్ఠానము చెప్పబడియుండునో అట్టి దానిని విడిచి పెట్టుట సన్న్యాసము గాదు. ఆలాగున సన్న్యాసము నను గ్రహించు సమయ మున ప్రేషోచ్చారణమను పద్ధతి యొకటి గలదు. ఇది శాస్త్రోక్తముగా సన్న్యసించెడు గురుశిష్యులయందే గల్గును. అందుచేతను సన్న్యాసము పూర్తి కాజాలదు. ఆత్మసన్న్యాసమే, లేక మానసిక సన్న్యాసమే నిజమైన సన్న్యాసము.

ద్రవ్యార్థమన్న వస్త్రార్థం యః ప్రతిష్ఠార్థ మేవ వా!
సన్న్యసేదుభయభ్రష్టః న ముక్తిం నాప్తుమర్హతి ॥

ధనముకొఱకుగాని, అన్నవస్త్రములకుగాని, తనను అందరు గౌరవిం తురనిగాని, తలంపుతో సన్న్యసించిన యెడల ఉభయలోక భ్రష్టత గలుగును. ముక్తిగలుగదు అని మైత్రేయోపనిషత్తు.

పైజెప్పిన విధముగ సన్న్యసించువా రెక్కువగుటయే పతితు లగుదు రనుటకును, సన్న్యాసముయొక్క విలువ తగ్గుటకున్ను హేతువగుచున్నది. సంపూర్ణ వైరాగ్యము, ఆత్మశుద్ధియు గలిగి సన్న్యసించిన వారైనచో, సన్న్యాస మున కింత పతనము కలుగదు.

యస్మిన్ శాంతిః శమః శౌచం సత్యం సంతోష ఆర్జవమ్ ।
అకించనమదంభశ్చ స కైవాల్యాశ్రమే వసేత్ ॥

ఎవనియందు శాంతి, శమము, శౌచము, సత్యము, సంతోషము, ఆర్జవము, దీనత్వము లేకుండుట, దంభము లేకుండుట అను గుణములు గలవో వాడు మోక్షధామము నందుండుట కర్హుడగును.

స్థాన్యుపనిమంత్రణే సంగస్మయాకరణం పునరనిష్టప్రసంగాత్ ।

తన యోగసాధన మాహాత్మ్యమున స్వర్గవాసులు తన్ను బ్రీతిపూర్వకముగా, తమలోకముల కాహ్వానించినను, వారి యాహ్వానమున బ్రీతి నుంచరాదు. వారిచే బ్రార్థితుడనైతిని గాన కృతకృత్యుడ నైతినని తలంపరాదు. అట్లు చేసెనేని మరల నాతడు సంసారాద్యనిష్టముల ననుభవించును.

(యోగదర్శనము).

యోగసిద్ధి ప్రారంభమగు కాలమున దేవతలు, అప్సరస్త్రీలు, దేవలోకములో నుండు అమృతము, దివ్యరసాయనము, మందారపుష్పము మొదలగు భోగ్యవస్తువులను తెచ్చి భక్తితో సమర్పించి తమ స్వర్గలోకమున కాహ్వానింతురు. అప్పుడు మందబుద్ధి గలవాడైనచో నాకు ఇంత గొప్ప ప్రభావము గలిగెనని తలంచి వారికి లోబడి పోయినచో యోగభ్రష్టుడై మరల జననమరణ క్లేశమగు సంసారములో బడిపోవును. శుకబ్రహ్మాది ఋషులు తప మొనర్చెడి కాలమున రంభాద్యప్సరః స్త్రీలు చేసిన చేష్టలను జ్ఞాపకములో నుంచుకొనవలయును. ఇచట దేవశబ్దమునకు అప్సరఃస్త్రీలకు, మనుష్యలోకములో గల శ్రీమంతులు, ప్రభువులు, వధూమణులు అని గ్రహించుకొనవలయును. వీరు దివ్యపదార్థములను తెచ్చి సత్కరింతురు. సుఖ భోగము లనుభవింపవచ్చునని తలంచి అట్టివారి స్థలము లోనికి వెళ్ళుదలంచెడు యోగులు, తపస్వులు, వైరాగ్యనిష్ఠ గలవారలు ఈ పరమరహస్యమును జ్ఞప్తిలో నుంచుకొనవలయును. ఈలాగున చెడినవారు చాలమంది గలరు. కావుననే కఠోపనిషత్తునందు ఈలాగున తెలుపడమైనది-

శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేత స్తౌ సంపరీక్ష్య వివినక్తి ధీరః ।
శ్రేయో హి ధీరో౽భిప్రేయసో వృణీతే ప్రేయో మందో యోగక్షేమాద్వృణీతే ॥

ఒకరు ఆత్మజ్ఞానమందు ప్రయత్నించు సమయమున శ్రేయస్సును. ప్రేయస్సును వానికి ప్రాప్తించును. శ్రేయస్సనగా=మోక్షము. ప్రేయస్సు= ప్రాపంచిక భోగము. అప్పుడు ధీరుడైనవాడు దీనిని బాగుగా యోచించి (దోషములను గనిపెట్టి) అశాశ్వతములైన భోగమును త్యజించి శాశ్వతమైన మోక్షమును గోరును. మందబుద్ధి గలవాడు (ఆత్మశుద్ధి లేనివాడు) భోగమును గొప్పదని తలంచి విషయమందు ప్రవేశించును.

కఠోపనిషత్తున మొదటనే ఈవిషయమంతయు తెలుపడమైనది. ఈ కఠోపనిషత్తు విరక్తులకు ఎంతో మేలు కలుగజేయును. ప్రపంచములో నయమనియు, భయమనియు రెండు సాధనలవల్ల ఒక్కరిని లోబరచు కొనుదురు. ఆలాగున తపఃసిద్ధి, యోగసిద్ధి ప్రారంభమగు కాలమున దేవతలు కష్టమును కలుగజేసియో, దానికి లొంగకపోయిన ఇష్టమును కలుగజేసియో భ్రష్టునిగా చేయుదురు. మొదట అనేక కష్టములు కలుగజేయుదురు. ధైర్యముతో దాని నెదుర్కొని నిష్ఠచేయుచుండిన మరల పైచెప్పిన భోగములచే భ్రష్టత్వము నొనర్చయత్నము చేయుదురు.

చాలామంది కష్టమును సహించెదరు గాని సుఖము వచ్చునప్పుడు పడిపోవుదురు. బ్రహ్మనిష్ఠుడు సుఖభోగములు అనేకములు వచ్చినను అవియు యోగవిఘ్న హేతువులని తలంచి జాగ్రత్త పడెనేని వాని నేమియు చేయజాలవు. అట్లుగాక మనతపస్సుచేత యోగశక్తిచేత ఇవి యన్నియు గలిగినవని తలంచి దానికి లోబడినచో పతనము నిక్కము. ఒకవేళ భోగము లనేకములు వచ్చినను తననిష్ఠకు భంగములేక, ఆహారాది నియమమును విడనాడక, వచ్చిన వస్తువులను భక్తులకొరకు వినియోగ పరచుచుండిన పతనము కలుగదు. ముక్తి గలుగువరకే ఇట్టి పరిస్థితి నెదుర్కొన వలసియుండును. తర్వాతయే విఘ్నములను దేవతలు చేయరు. అంతేకాదు. దాసులై భక్తులై సేవ చేయుచుందురు. ఉపకార మొనర్తురు. వైరాగ్యము గలవారియొక్కయు, లేనివారియొక్కయు లక్షణము ఈ శ్లోకము నిరూపణ చేయుచున్నది.

సాలంకారా చ యా నారీ శోభితా సా సుతన్వితా ।
యా నారీ నిరలంకారా శోభితా సా వితంతుతా ॥

త్యాగేన శోభతే యోగీ గృహీ భోగేన శోభతే ।
ఏతద్ధి లక్షణమితి శృణు రాగవిరాగయోః ॥

పుష్పవస్త్రాభరణ కుంకుమాదులచే ముత్తైదువస్త్రీ శోభించును. ఆలాగున వితంతువైన స్త్రీ ఎంత కెంతకు నిరలంకారముగ నుండునో దానికదే శోభించును. ఎంత కెంతకు త్యాగియో అంతకంతకు యోగి శోభించును. గృహస్థుడు ధనధాన్య వస్తుగృహాదులచే శోభించును. రాగి యొక్కయు, విరాగి యొక్కయు లక్షణ మీలాగున నుండునని గ్రహింపుడు.

ఈ శ్లోకము సన్న్యాసులకును, వితంతు స్త్రీలకును బాగుగా ఆలోచించదగినది. అప్పుడు సన్న్యాసి యెట్లుండవలెనో, వితంతు స్త్రీలెట్లుండవలెనో తెలిసికొనవచ్చును. ముత్తైదువ యలంకారము వితంతువు నకు నెంత గర్హ్యమో, నీచమో, గృహస్థునియొక్క భోగము సన్న్యాసి కంత పరమనీచము, నిందితము అని మరువకుందురు గాక!

మూడవ భాగము

యోగవిఘ్న నివారణోపాయములు

ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్ ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి । సర్వం బ్రహ్మోపనిషదం। మాహం బ్రహ్మ నిరాకుర్యాం। మామా బ్రహ్మ నిరాకరోత్। అనిరాకరణ మస్త్వనిరాకరణం మే అస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సంతు। తే మయి సంతు। ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ఆప్యాయంతు- మమ- అంగాని-వాక్-ప్రాణః-చక్షుః-శ్రోత్రం-అథః- బలం- ఇంద్రియాణి-చ- సర్వాణి-సర్వం-బ్రహ్మ- ఉపనిషదం-మా - అహం-బ్రహ్మ-నిరాకుర్యాం-మా-మా -బ్రహ్మ-నిరాకరోత్-అనిరాకరణం- అస్తు- అనిరాకరణం-మే- అస్తు-తత్- ఆత్మని-నిరతే-యే- ఉపనిషత్సు-ధర్మాః- తే-మయి-సంతు- తే-మయి- సంతు.

మమ=నాయొక్క, అంగాని=అవయవములు, వాక్=వాక్కు, ప్రాణః= ప్రాణము, చక్షుః=నేత్రము, శ్రోత్రం=కర్ణము, అథః=అట్లే, బలం=బలము, సర్వాణి=సమస్తములైన, ఇంద్రియాణి= ఇంద్రియములు, ఆప్యాయంతు= తృప్తినొందునుగాక (శుద్ధము లగునుగాక), సర్వం= సమస్తము, ఉపనిషదం= ఉపనిషత్ప్రతిపాదితమగు, బ్రహ్మ=బ్రహ్మమే, అహం= నేను, బ్రహ్మ=పరమాత్మను, మా నిరాకుర్యాం= నిరాకరించకుందునుగాక, మా=నన్ను, బ్రహ్మ= పరమాత్మ (ఈశ్వరుడు), మానిరాకరోత్= నిరాకరించకుండును గాక! అనిరాకరణం= ఆదరము, అస్తు= కలుగుగాక! మే= నాకు, అనిరాకరణం=విశ్వాసము, అస్తు=కలుగుగాక తదాత్మని= ఆ పరబ్రహ్మమునందు, నిరతే= ఆసక్తి గలవాని విషయమై, ఉపనిషత్సు= ఉపనిషత్తులయందు, యే= ఏ ధర్మములు ప్రతిపాదింపబడినవో, తే= ఆ, ధర్మాః=ధర్మములు, మయి=నాయందు, సంతు= ఉండుగాక, తే= ఆ, దర్మములు,మయి=నాయందు, సంతు= ఉండుగాక!

నాయొక్క వాగాదీంద్రియము లన్నియు పుష్టిమంతములగుగాక!

(సమర్థములగు గాక!) ఈ సర్వము నుపనిషద్వేద్య పరబ్రహ్మస్వరూపమే. నేను బ్రహ్మము నుపేక్షింపకుందునుగాక! నన్ను బ్రహ్మము పరిత్యజించ కుండుగాక! నాయందు బ్రహ్మమునకు విశ్వాసము గలుగుగాక! బ్రహ్మము నందు నాకాదరణ గలుగుగాక! ఆ యాత్మస్వరూపమం దాసక్తి గలవారికి నుపనిషత్తులయందు ఏ పవిత్ర ధర్మము లుపదేశింపబడినవో; ఆ ధర్మములు నా యందెల్లప్పుడు నుండును గాక! నాయందు సుస్థిరములగుగాక!

ఆదరాతిశయముకొఱకు ద్విరుక్తి ప్రయోగము చేయబడినది. దోషత్రయ శాంతికొరకు ముమ్మారు శాంతిమంత్రము ఏర్పడినది.

ఇటువంటి యుపనిషచ్ఛాంతిమంత్రములను ధ్యాననిష్ఠానంతరము భక్తి గలిగి యేకాగ్ర మనస్సుతో అర్థసహితముగా పఠింపక పోవుటయే విఘ్న ములు నశింపకపోవుటకు కారణము. భక్తితో పఠించెనేని అన్ని యోగవిఘ్న ములును నివారణము లగును.

యోగస్య ప్రథమం ద్వారం వాఙ్నిరోధోఽపరిగ్రహః।
నిరాశా చ నిరీహా చ నిత్యమేకాంతశీలతా॥

యోగమునకు మొట్టమొదట నుండవలసినది 1.వాఙ్నిరోధము (మిత భాషణము) 2.పరవస్తు పరిగ్రహవర్జనము, 3.దేనియందును ఆశ లేకుం డుట, 4.సంకల్పములను రహిత మొనర్చుట, 5. ఏకాంతమందుండుట - ఇవి యైదును మోక్షమునకు ముఖ్యద్వారములని వివేకచూడామణి.

పైజెప్పిన ప్రకారము ప్రవర్తింపక పోవుటయే విఘ్ననివారణము కలుగక పోవుటకు కారణము.

సత్సంగో వాసనాత్యాగోఽధ్యాత్మవిద్యావిచారణమ్ ।
ప్రాణస్పందనిరోధశ్చేత్యుపాయాశ్చేతసో జయే ॥

మనస్సు నశించి పరబ్రహ్మస్థితి గల్గుటకై నాల్గు సాధనములు ముము క్షువుల కత్యావశ్యకములు. 1.సత్పురుషుల సహవాసము, 2.విషయ వాసనాత్యాగము, 3.అధ్యాత్మవిద్యావిచారణము, 4.ధ్యానయోగాభ్యాస

ములు. ముముక్షువుల కివి ముఖ్యముగా నుండవలసినవి అని వాసిష్ఠము.

మనోజయముకొరకు దీనియందు కొంత ప్రాణాయామముకూడ విధించడమైనది. స్వల్పప్రాణాయామము అందరికిన్ని అత్యవసరము. శరీర దార్ఢ్యము, మనోనిర్మలత్వమును, పాపక్షయమున్ను దీనివల్ల త్వరలో సిద్ధించును. అయితే బ్రహ్మచర్యము, శుద్ధాహారము, ఏకాంతవాసము ప్రాణయామమునకు ముఖ్యముగా నుండవలసినవి.

అవిద్యాం శ్రేష్ఠయా శ్రేష్ఠః క్షా
మలం మలేనాపహరన్ యుక్తి రజకో యథా ॥

బుద్ధిమంతుడైన చాకలివా డేలాగున భూమియొక్క మలమైన చవిటి మన్నుచే వస్త్రముయొక్క మలినమును పోగొట్టునో, ఆలాగున అవిద్యా సంబంధమైన కర్మమును, విద్యాసంబంధమైన(జ్ఞానసంబంధమైన) శ్రేష్ఠ కర్మముచే పోగొట్టవలయును అని వాసిష్ఠము.

శుద్ధాశుద్ధములు రెండును ప్రకృతి ధర్మములే. చవుడును, వస్త్రములోగల మాలిన్యమును రెండున్ను ప్రకృతి ధర్మములే. అయితే శుద్ధకర్మచే అశుద్ధకర్మము నశించును. అప్పుడే విశుద్ధ స్వరూపమగు ఆత్మజ్ఞాన ముదయించును.

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥

ఏకాంత ప్రదేశమున నుండువాడును, ధ్యాననిష్ఠకు భంగము రాకుండుటకై సాత్త్వికమైన శుద్ధాహారమును మితముగ భుజించువాడును, వాక్కును, మనస్సును, శరీరమును స్వాధీనములో నుంచినవాడును, ధ్యానయోగ మందాసక్తి గలవాడును, లెస్సగా వైరాగ్యము గలవాడునై ఎవడు గలడో వానికి విఘ్నములు కలుగవు. శీఘ్రకాలమున జీవన్ముక్తి సిద్ధించును అని గీత.

ఇట్టి నియమములను పాటింపకపోవుటచేతనే విఘ్నములు కలుగుచున్నవి.

మితాశనో భవేన్నిత్యం భిక్షుర్మోక్షపరాయణః ।
కామక్రోధాదయో దోషా న భవంతి మితాశనాత్ ॥

మోక్షాపేక్ష గలవాడు నిత్యము మితాశనుడై యుండవలయును. అందువల్ల కామక్రోధాది దోషములు నశించును అని సన్న్యాస సంగ్రహము.

ఇట్టి నియమము లేకపోవుటయే కామక్రోధాదులు గల్గుటకును, పతనము గల్గుటకును కారణము.

పథ్యమౌషధసేవా చ క్రియతే యేన రోగిణా ।
ఆరోగ్యసిద్ధిర్దృష్టాఽస్య నాన్యానుష్ఠితకర్మణా ॥

పథ్యము, ఔషధసేవయు ఏరోగిచే చేయంబడునో వానిచేతనే ఆరోగ్యసుఖ మనుభవింపబడుచున్నది. ఇతరులు చేయు పథ్యౌషధసేవచే పొందసాధ్యము గాదు. తనకు గల భవరోగమునకు తానే ధ్యానానుష్ఠానము చేయక ఇతరులు చేసిన చాలునని తలంచుటయు అటువంటిదే (వివేక చూడామణి).

గురువు చేయు అనుష్ఠానము చాలునని తలంచి అనుష్ఠానము చేయని శిష్యునియొక్కయు, భర్త చేసిన అనుష్ఠానము చాలునని తలంచెడు భార్య యొక్కయు, లేక భార్య చేసిన అనుష్ఠానము చాలునని తలంచెడు భర్త యొక్కయు, ఆలాగున తండ్రి చేసిన చాలునని తలంచెడు పుత్రుని యొక్కయు, పుత్రుడు చేసిన చాలునని తలంచెడు తండ్రియొక్కయు స్థితి ఈలాగున నుండును. అయితే భార్యాభర్తలు, గురుశిష్యులు, తల్లిదండ్రులు, కుమారులుచేయు పుణ్యకర్మానుష్ఠానములలో పరస్పరము ప్రేమ కలిగి యనుసరించియుండిన కొంతవరకు ఫలము గలుగవచ్చును. ఈశ్వర జ్ఞానము, జీవన్ముక్తి మాత్రము వారికి వారే చేసికొనవలయును.

గురువు వెళ్ళునప్పుడు శిష్యునియొక్క నీడయు, శిష్యుడు పోవునపుడు గురువుయొక్క ఛాయయు ఒకటితో నొకటి సంబంధపడక వారి వారి నీడ వారివారితో నుండునట్లు అంత్యకాలస్థితియు నుండునని గ్రహించుకొన

వలయును. భార్యాభర్తలయొక్క స్థితియు; తల్లి, తండ్రి, కుమారుడు, కుమార్తెలయొక్క స్థితియును ఈలాగున నుండునని ఈశ్వరదృష్టియే మనకు చూపుచున్నది.

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్॥

తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః।
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మ విశుద్ధయే॥

సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥

పరిశుద్ధమైన ప్రదేశమందు చలింపనిదియు, మిక్కిలి ఎత్తు గానిదియు, మిక్కిలి పల్లము గానిదియు నగు స్థలమున మొదట దర్భాసనము, దానిమీద కృష్ణాజినము, దానిమీద వస్త్రము మొదలైన ఆసనములను స్థాపించి ఆ యాసనమందు కూర్చుండి చిత్తముయొక్కయు, ఇంద్రియముల యొక్కయు వ్యాపారమును నిగ్రహించినవాడై; మనస్సును ఏకాగ్రముగా చేసి ఆత్మయొక్క పరిశుద్ధతకొరకు ధ్యానయోగమును చేయవలయును. దేహమధ్యభాగమును, శిరస్సును, కంఠమును సమముగా నిక్కించి చలనము లేనివాడై స్థిరుడై తన నాసికాగ్రము (భ్రూమధ్యమును) చూచునట్లు దృష్టి నిలిపి ఇతర విషయములందు దృష్టినిగాని, మనస్సునుగాని పోనివ్వక పరమ శాంతుడై పరమాత్ముని ధ్యానము చేయవలయును అని గీత.

కొన్ని గ్రంథములలో ఏకాంతప్రదేశము మొదలగు వానిని తెలుపడమైనది. అది అందరికిని సాధ్యముగాదని తలంచి శ్రీకృష్ణభగవానుడు దయగలిగి శుద్ధమైన ప్రదేశముండిన చాలునని తెలిపెను. శుద్ధమైన స్థలములనుండి ధ్యానము చేయువారికి విఘ్నములు గలుగవు. పుణ్యభూమి మంచిదని తెలుపుట కిదియే కారణము. అచట పుణ్యజీవులుగాని, దేవతలుగాని, మహాత్ములుగాని సూక్ష్మరూపముతో నుందురు. మలినమైన పాపభూమి

యైనచో అచట భూతప్రేతపిశాచములు నివసించుచుండును. అట్టి స్థలము యోగనిష్ఠకు విఘ్నము కలుగజేయును.

పవిత్రే నిర్మలే దేశే నిత్యానుష్ఠానతోఽపి వా ।
నిర్వేదనేన మౌనేన జపమేతత్సమారభేత్ ॥

ఆలాగున పవిత్రమైన ఏ స్థలమందుగాని ఆసీనుడై నిత్యానుష్ఠానము చేయువాడు చలనము లేనివాడై, మౌనముతో కూడి జపమాచరించవలెను.

ఏకవారం చరేద్భైక్షం న ప్రసజ్జేత విస్తరే ।
భైక్షప్రసక్తో హి యతిర్విషయేష్వపి సజ్జతి ॥

సన్న్యాసియగువాడు (బ్రహ్మనిష్ఠుడు) ఏకకాలము మాత్రమే భుజించవలయును. అధికముగా తినుటయే స్వభావముగా గలిగియుండరాదు. అధికము తినుటలో ఆసక్తి గలవాడు నిశ్చయముగా విషయలోలు డగును. వీనికి ఇంద్రియ నిగ్రహముండదు అని సన్న్యాస సంగ్రహము.

ఆహార నియమము లేనివానికి మనోనియమము గలుగదు.

మాత్రా స్వస్రా దుహిత్రా వా న వివిక్తాసనో భవేత్।
బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి॥

విరక్తుడై బ్రహ్మనిష్ఠచేయువాడు తల్లితోగాని, సోదరితోగాని, కుమార్తెతో గాని యేకాంత స్థలమున నుండరాదు. ఎందుకనగా ఇంద్రియముల సమూహము మహాబలము కలది, మహాబ్రహ్మవేత్తల మనస్సునుకూడ ఆకర్షించి విషయములందు ప్రవేశపెట్టును. ఆలాగున విరక్తులై బ్రహ్మనిష్ఠ చేయు స్త్రీలుకూడా విజన ప్రదేశమందు తండ్రి, సోదరుడు, పుత్రుడు, వీరలే యుండు స్థలమందు ఉండరాదని చెప్పిన నిక తదితరులతో గలసియుండుట ఎంత ప్రమాదమో ఆలోచించవచ్చును. ఏ విధమైన ప్రమాదమును కలుగకూడదని తలంచి శాస్త్ర మీలాగున చెప్పినది.

(మనుస్మృతి.)

బోధాదూర్ధ్వం చ తద్ధ్యేయం జీవన్ముక్తిప్రసిద్ధయే ।
కామాది క్లేశబంధేన యుక్తస్య న హి ముక్తతా ॥

బ్రహ్మనిష్ఠా బలముచే తత్త్వబోధము కలిగినను జీవన్ముక్తి దృఢపడుట కొరకు మరల మరల బ్రహ్మచింతనమును, తదేకధ్యానమున్ను ఆవశ్యకముగా చేయవలయును అని పంచదశి.

తత్త్వం బుద్ధ్వాపి కామాదీన్ నిశ్శేషం న జహాసి చేత్ ।
యథేష్టాచరణం తే స్యాద్ధర్మశాస్త్రాతిలంఘినః ॥

బ్రహ్మనిష్ఠుడు పరతత్త్వము నెరింగి బ్రహ్మబోధ గలిగినను విషయాసక్తి మొదలగు కామాదులను నిశ్శేషముగా విడువడేని ధర్మశాస్త్రము నతిక్రమించిన కారణముచే జ్ఞానభ్రష్టు డగును. కావున యథేష్టాచరణము కూడనే కూడదు.

విద్యారణ్యు లీలాగున చెప్పుటచే బ్రహ్మనిష్ఠులెంతో జాగ్రత్త వహించ వలసియుండురు. ఇప్పుడు ప్రపంచములో యథేష్టాచరణమే జీవన్ముక్తి లక్షణమనియు, బంధవిముక్తుని స్వభావమనియు, నియమమునకు లోబడియుండుట బంధవిముక్తి కాదనియు చెప్పువారు కొందరు లేక పోలేదు. మీ దృష్టిలోనే అట్టివారు గలరు. అట్టి శాస్త్రోల్లంఘనమే వారి అభివృద్ధికి దట్టమైన అడ్డుగా నిలిచియున్నదని గ్రహించుకొనవలయును.

విశుద్ధాద్వైతతత్త్వస్య యథేష్టాచరణం యది ।
శునాం తత్త్వదృశాం చైవ కో భేదోఽశుచిభక్షణే ॥

అద్వైత పరబ్రహ్మజ్ఞానవేత్త స్వేచ్ఛాచరణము గలిగి విధినిషేధముల నతిక్రమించి ప్రవర్తించినచో కుక్కకును, పరమపావనుడగు మహాత్మునకును ఏమి భేదమని సురేశ్వరాచార్యులు వేదాంతవార్తికమందు వ్రాసిరి.

వాసనాయా స్తథా వహ్నే ఋణవ్యాధి ద్విషామపి ।
స్నేహవైరవిషాణాం చ శేషః స్వల్పోఽపి బాధతే ॥

విషయవాసన, అగ్ని, అప్పు, వ్యాధి, శత్రువు, పుత్రకళత్రాదుల యందు ప్రేమ, ఇతరులయందు విరోధము, విషము - ఇవి కించిత్తైన మిగిలియున్నచో క్రమముగా వృద్ధియై మిక్కిలి బాధించును. కావున ఇవి నిశ్శేషము నశింపజేసేలాగున చూడవలయును అని వాసిష్ఠము.

యథా నిరింధనో వహ్నిః స్వయోనావుపశామ్యతి ।
తథా వృ త్తిక్షయాచ్చిత్తం స్వయమేవోపశామ్యతి ॥

ఏలాగున కట్టెలు నశించినపుడు అగ్ని స్వయముగా నశించునో ఆలాగున వృత్తులు నాశమగునప్పుడు మనస్సు తనకు తానే మాయమై పోవును.

మనస్సనియు, కర్మమనియు, అజ్ఞానమనియు పర్యాయనామములు. నిప్పు మండుచుండిన మాత్రమే కట్టెలు దహించును. ఆలాగున అధ్యాత్మ జ్ఞానసిద్ధి ప్రజ్వలించి రాగా రాగా కర్మకట్టెలు క్షయించును. అందువల్ల కర్మజనిత విఘ్నములును నశించును.

ప్రతిబంధో వ ర్తమానో విషయాసక్తి లక్షణః ।
ప్రజ్ఞామాంద్యం కుతర్కశ్చ విపర్యయదురాగ్రహః ॥

ప్రతిబంధము లుండినచో జ్ఞానమునకు ఆటంకము గలుగును. ప్రతి బంధములు ముప్విధములు. అవి వర్తమానప్రతిబంధ మనియు, భూత ప్రతిబంధ మనియు, భావిప్రతిబంధ మనియు చెప్పుదురు. ఇవి వేదాంత పంచదశిలో కనందగును. వాటిలో వర్తమానప్రతిబంధము గొప్పది. అందులో అన్నిటికన్న గొప్పవి 1.విషయాసక్తి, 2.ప్రజ్ఞామాంద్యము, 3.కుతర్కము, 4.విపరీతవాదము, 5.అనవసరముగ విరోధము పెట్టుకొనుట.

ఇవి యన్నియు ముఖ్యమైన విఘ్నములని గ్రహించుకొనవలయును.

క్షాళయంతి మలేనైవ మలం క్షాళనకోవిదాః ।
వారయన్త్యస్త్రమస్త్రేణ విషం ప్రతివిషేణ చ ॥

భూమియందుండు పంకిలముచే గలిగిన మాలిన్యమును భూమియం

దేర్పడిన చవిటిమట్టిచే పోగొట్టునట్లును, ఆగ్నేయాస్త్రమును వారు ణాస్త్రముచే నశింపజేయునట్లును , విషదోషమును స్ఫుటము చేసిన పాషా ణాది విషములచే రహితము చేయునట్లును, నాగాస్త్రమును గారుడా స్త్రముచే భేదించునట్లును, ఇనుమును ఉక్కుతో నరుకునట్లును పాపకర్మము లచే కలిగెడు విఘ్నములను పుణ్యకర్మానుష్ఠానముచే రహితము చేయ వలయును.

మృద్వాసనే సమాసీనో జిత చిత్తేంద్రియక్లమః ।
ఓమిత్యుచ్చారయేత్తావన్మనో యావత్ప్రసీదతి ॥

మెత్తని యాసనమందు కూర్చుండి యింద్రియాది వృత్తులను నిశ్చల ముగా చేసికొని మనసు లయమొంది బ్రహ్మాకారస్థితి గల్గు పర్యంతము ఓంకార మంత్రమును పరమాత్మపరముగా భావనచేసి ధ్యానము చేయవలయును.

ప్రణవమును హృదయమున పరబ్రహ్మభావముతో లేక ఈశ్వర భావముతో దివ్యప్రకాశభావన కలిగి జపించవలయును. ఈలాగున చేసిన విఘ్నము లన్నియు నశించును. మెత్తని యాసనమైన ఎంతసేపు ధ్యాన మందుండినను పాదములకు బాధ కలుగదు. కరుకైన గట్టిదైన ఆసన మైనచో కొంచెము సమయమునకే పాదములకు నొప్పి కలుగవచ్చును.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥

ఎవరు ఇతరచింత లేనివారై నన్నే శరణుపొంది ధ్యానింతురో అట్టి అచంచలనిష్ఠ గలవారల యోగక్షేమములను నేనే వహించెదను అని భగవానుడు గీతయందుపదేశించినాడు.

పైజెప్పిన విశ్వాసముతో ధ్యానముచేయు పరమభక్తుల విఘ్నము లన్నింటిని భగవానుడే రహితమొనర్చి రక్షించును. అప్రాప్యమైన దానిని ప్రాపింపజేయుట యోగమనియు, ప్రాప్తించిన దానిని సంరక్షించుట క్షేమమనియు గ్రహించుకొనవలయును.

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్ ॥

భగవద్ధ్యానాసక్త చిత్తము గలవారిని అచిరకాలములోనే సంసార సాగరమునుండి నే నుద్ధరించుచున్నాను అని భగవాను డుపదేశించెను.

పరమభక్తులకు గల విఘ్నము లన్నిటిని అచిరకాలములో రహిత మొనర్చి రక్షించెదనను భగవత్ప్రతిజ్ఞాపూర్వక వాక్యములో విశ్వాసము కలిగి యుండుడు. అన్ని విఘ్నములును క్షయించుటకు ఇదే యుపాయము.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥

ఎల్లప్పుడును భగవంతుడనగు నాయం దేకాగ్రచిత్తము గలిగి ప్రీతి పూర్వకముగా భజించునట్టి ధ్యానపరులకు పరమేశ్వరుడనగు నన్ను పొందుటకు ఏ జ్ఞానము కలుగవలయునో అట్టి జ్ఞానమును కలిగించుచున్నాను.

పరమభక్తితో సర్వేశ్వరుని ధ్యానించువారికి ఏ జ్ఞానమువల్ల మోక్షము సిద్ధించునో అట్టి జ్ఞానమును భగవంతుడే కలుగజేయుచున్నాడని చెప్పిన వాక్యము లందు విశ్వాసము కలిగియుండుడు.

తేషామేవానుకంపార్థ మహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥

ఎల్లపుడును ధ్యానముచేయు భక్తుల ననుగ్రహించుటకొరకు మాత్రము వారి యంతఃకరణ మందున్నవాడనై వారియొక్క అజ్ఞాన జన్యమైన మోహాంధకారమును వెలుగుచున్న జ్ఞానమనెడి దీపముచేత పోగొట్టు చున్నాను.

అంధకార నిబిడమైన గృహాంతరాళములో తనకు కావలసియుండు సమస్త పదార్థము లుండినను చీకటిచే గ్రహించుకొనుటకు సాధ్యము కానప్పుడు ఏలాగున ఒకడు మంచిదీపము వెలిగించిన ఏ వస్తువు లెచ్చట

నున్నవని తెలిసికొనవచ్చునో, తీసుకొనవచ్చునో, అలాగున భగవంతుడే భక్తుల హృదయములలో దివ్యజ్యోతిని వెలిగించి జ్ఞానమును చూపగల్గును. కావుననే ఈ శ్లోకమునందు ''అనుకంపార్థమేవ'' భక్తులయందుగల అనుగ్రహము మాత్రమే గాని మరియొక విధముగ కాదని వచించెను.

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ఛరీర విమోక్షణాత్ ।
కామ క్రోధోద్భవం వేగం స యుక్తస్స సుఖీ నరః ॥

ఎవడు ఈదేహమును విడుచుటకంటె ముందీలోకమునందే కామ క్రోధములవలన బుట్టిన వికారములను సహించుటకొరకు సమర్థుడగు చున్నాడో వాడే యింద్రియ నిగ్రహముగల యోగియై ఆత్మజ్ఞానముతో నిత్యసుఖి యగుచున్నాడు.

దేహముతో కూడియున్నప్పుడే ప్రకృతిదోషము లన్నిటినుండియు ముక్తులు కావలయును. జీవన్ముక్తియని చెప్పుటకు కారణమిదియే. ఒక్క ముష్టి నవధాన్యములను భూమిలో చల్లివేసిన ఏయే విత్తనము వేగియుండలేదో అది మొలకెత్తునట్లు అంత్యకాలమున ఏ సంస్కారము మిగిలియుండిన దాని కనుగుణమగు జన్మము తప్పక వచ్చును. ఉడికిన విత్తనము అంకురించనట్లు జ్ఞానాగ్నియందు దహించిన సంస్కారము గలవారికి మరల జన్మ ముండదు. అట్టి యవస్థ జీవించి యున్నప్పుడే కలుగవలయును.

ఇహైవ తైర్జితస్సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః ॥

ఎవరియొక్క మనస్సు సకల భూతములయందును బ్రహ్మము సమ ముగా నున్నదను విషయమునందు నిశ్చలమై యున్నదో, అట్టివారు ఈలోక మందే జన్మమును జయించిన వారగుచున్నారు. మరియు బ్రహ్మము ప్రకృతి దోషరహితమైనది. కనుక అట్టి దోషరహితులు సదా బ్రహ్మమునందున్న వారగుచున్నారు.

ఇహైవ- యిచ్చటనే- జీవించి యున్నప్పుడు ప్రకృతిదోషము నశించినవారై యుండిన మాత్రమే బ్రహ్మాత్మైక్య జ్ఞానము కలిగి ముక్తు లగుదురు. నీటిలో నీరు, నూనెలో నూనె కలియునేగాని, నీటిలో నూనెయు, నూనెలో నీరును ఐక్యము గానట్లు పరమాత్మ స్వరూపమెంత శుద్ధమైనదో, అంతశుద్ధత జీవునికి కలిగినప్పుడే, జీవేశ్వరుల యైక్యము సిద్ధించును.

జీవస్య తండులస్యేవ మలం సహజమప్యలమ్ ।
నశ్యత్యేష వన సందేహస్తస్మాదుద్యమవాన్భవ ॥

పుత్రా! జీవునియొక్క మలము సహజసిద్ధంబైనను తండులము యొక్క పొట్టు దంచుటవల్ల యెట్లు నశించుచుండునో, ఆలాగున పురుష ప్రయత్న పరమగు ధ్యానజ్ఞానములచేత జీవునియొక్క మాయామలము కూడ నశించును. కావున ప్రయత్నవంతుడవు కమ్ము అని వాసిష్ఠము.

జీవుడు నిత్యశుద్ధ జ్ఞానస్వరూపు డనియే వేదాంతము ఉపదేశించు చున్నది. ప్రకృతిదోషము లన్నియు అంతఃకరణ ధర్మములే, అట్లుగాక జీవులకు ప్రకృతిగుణములు స్వభావములని యొకవేళ నెవరైన వచించిరను కొనుడు. అట్లైనను పుట్టుకతో పొట్టు, తౌడు వడ్లయందు కలిగియుండినను దంచుటవలన వదలిపోవును. కావున పురుషప్రయత్నముచే ప్రకృతిదోషము వదలిపోవును. ఓహో! యెంత ధైర్యమును చెప్పిరి.

తండులస్య యథా చర్మ యథా తామ్రస్య కాలిమా!
నశ్యతి క్రియయా పుత్ర! పురుషస్య తథా మలః ॥

తండులము (బియ్యము) యొక్క పైనున్న పొట్టు దంచుటవల్ల ఎట్లు వదలిపోవుచున్నదో, స్ఫుటముచేత రాగియొక్క చిలుమెట్లు నశించి సువర్ణ మగుచున్నదో, అట్లే యోగముచేతను, జ్ఞానముచేతను జీవునియొక్క అజ్ఞాన రూపమగు మలినము నశించుచున్నది అని వాసిష్ఠము.

న సౌఖ్యాల్లభతే పుణ్యం కాయక్లేశాదవాప్యతే ।
మంథనేన యథా క్షీరాన్నవనీతం ప్రజాయతే ॥

మర్దనాదిక్షుదండానాం రసో యద్వత్ప్రజాయతే ॥
తద్వచ్ఛరీరదండేన మహోధర్మః ప్రజాయతే ॥

ఎవడు సోమరితనముచే శరీర సుఖమును మాత్రము గోరుచుండునో అట్టి వానికి పుణ్యము లభింపదు. కాయక్లేశము సహించు వానికే పుణ్యము లభించును. ఏలాగున మథనము వినా క్షీరమునుండి నవనీతము జనింపదో, మర్దనము లేనిచో చెరుకునుండి రసము జనింపదో; అలాగున శరీరపరిశ్రమ చేయనివానికి జ్ఞానము సిద్ధించదు. కాయక్లేశము సహించి అనుష్ఠానము చేయువానికి మహోధర్మమగు దైవము ప్రత్యక్షమగును అని పద్మపురాణము.

మోక్షమార్గము సోమరులు పోవు దారికాదు; సోఽహంపరులు ప్రయాణముచేయు మార్గము. చెరకునందు పంచదార కనబడకపోయినను, పాలయందలి వెన్న గోచరించక పోయినను చేయవలసిన క్రియలు చేయునప్పుడు ఎట్లు గోచరించునో, దేహములోగల దైవజ్ఞానస్థితియు ఆలాగున నుండును. పాలను తరచకపోయిన ఏలాగున కుళ్ళి చెడిపోవునో, చెరుకును సకాలమున కొట్టి గానుగాడనిచో ముదిరి యెట్లు బెండై పోవునో ఆలాగున మంచి కాలములోనే యాత్మజ్ఞానము సంపాదించుటకు యత్నించవలయును. ముదుసలికాలము వచ్చునపుడు జ్ఞానము సంపాదించుకొనవచ్చునని తలంచినచో పైజెప్పిన పాలు చెరకు గతియే సంభవించును.

యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥

ఓ యర్జునా! ఎప్పుడు నీయొక్క బుద్ధి అజ్ఞానకల్మషమును దాటగలదో అప్పుడు ఇంతవరకు గురువులచేతగాని, శాస్త్రములచేతగాని నీ స్వబుద్ధితోగాని చింతించిన దానియొక్క యర్థము గోచరమగును. తరువాత నిక వినదగినది మరియొకటి లేదను బోధముకూడ గల్గును. అప్పుడే వేదముచే బోధింపబడిన సత్యము గోచర మగును. లేక సంపూర్ణముగా ప్రకృతి వదలిపోవును అని గీత.

ఈ స్థితి గలుగకపోవుటయే బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము సిద్ధింపక పోవుటకు హేతువు. సముద్రమునకు ఈవల నుండువారు ఆవలి దరియందున్న దానినెట్లు చూడగల్గుదురు?

అన్నం పుంసాశితం త్రేధా జాయతే జఠరాగ్నినా ।
మలం స్థవిష్ఠో భాగస్స్యాన్మధ్యమో మాంసతాం వ్రజేత్ ॥
మనః కనిష్ఠో భాగస్స్యాత్తస్మాదన్నమయం మనః ॥

మనుజుడు భుజించెడు అన్నపానాదులు జఠరాగ్నిచే త్రివిధములుగా మారుచుండును. స్థూలభాగము మలమూత్రములుగాను, మధ్యభాగము రసమై, రక్తమై, మాంసాది సప్తధాతువులుగాను పరిణమించును. కనిష్ఠ భాగము మనస్సుగా మారును అని సుశ్రుతము.

ఇప్పుడేది భుజించినను మనస్సే ప్రధానమని చెప్పెడువారి సిద్ధాంత మును విజ్ఞులు తెలిసికొనవచ్చును. కావున అన్నమును మార్పు చేసికొనిన మాత్రమే మనస్సునకు మార్పు గల్గునని విజ్ఞులు గ్రహించుకొనవలయును. ఆహారముయొక్క పృథివీతత్త్వము అహంకారముగాను, జలతత్త్వము చిత్తము గాను, అగ్నితత్త్వము బుద్ధిగాను, వాయుతత్త్వము మనస్సుగాను, ఆకాశ తత్త్వము అంతఃకరణముగాను మారుచుండును అని ఆయుర్వేద మెంత దీర్ఘముగ ఆలోచించుకొని తెలిపెనో గ్రహించుకొనుడు.

వివి క్తదేశ ఆసీనో విరాగో విజితేంద్రియః ।
భావయేదేకమాత్మానం తమనంతమనన్యధీః ॥

ఏకాంత ప్రదేశమున సానుకూలమైన ఆసనములో కూర్చున్నవాడై, సర్వవిషయములలోను వైరాగ్యమును కల్గినవాడై, ఇంద్రియములను జయించిన వాడై, ఆత్మవ్యతిరి క్త వస్తువునందు బుద్ధిని పోనివ్వని వాడై ఒక్కడై దేశకాల వస్తుపరిచ్ఛేద శూన్యమైనటువంటి తనయాత్మను సత్యజ్ఞానానంద స్వరూపునిగా ధ్యానము చేయవలయును.

''వివి క్త దేశే'' అని చెప్పుటచేత నిష్ఠకు ప్రతిబంధములేని స్థలముండిన

చాలును. కేవల మేకాంత ప్రదేశమని తలంచవలదు. ఇట్టి స్థలములో నుండుటచే విఘ్నములు గలుగవు.

ఆజీవితం త్రయస్సేవ్యా వేదాంతో గురురీశ్వరః ।
పూర్వం జ్ఞానాప్తయే పశ్చాత్కృతఘ్నత్వనివృత్తయే ॥

జీవించి యుండువరకు మూడు ధర్మములను ఆచరించుచుండ వలయును. అవి యేవన; గురుభక్తి, దైవభక్తి, వేదాంతశాస్త్ర విచారణము. వీని వల్లనే మొదట జ్ఞానము కలిగియుండును. కృతజ్ఞత తెలుపుటకు ఈ మూడును ఆచరణీయములు; ఆచరింపనిచో కృతఘ్నుడగును అని సర్వవేదాంతసారసంగ్రహము.

జీవన్ముక్తునకు మరల అనుష్ఠించవలసిన దెద్దియు లేదని యొక అభి ప్రాయము కలదు. శ్రేష్ఠుడైనవాని యాచరణ చూచియే శిష్యులును, తదితరు లును ఆచరింతురు. అంతవరకైన తా ననుష్ఠించివచ్చిన మార్గము ననుసరించి యుండిన నితరులుకూడ చూచి అనుష్ఠింపగలరు. ఇదియునుగాక యిట్టి పవిత్రధర్మము ఋషిపారంపర్యముగా అనుష్ఠింపబడుచు వచ్చుచున్నది. అట్లు చేయనిచో కృతఘ్నత్వదోష మాపాదించును. ఆచరించుచు వచ్చిన నిప్పుడు కలిగియుండు జ్ఞానమునకు మరింత మెరుగు కలుగునే గాని లోపము లేదు. ఆచరించనిచో నొకవేళ కీడు కలుగవచ్చును. అదియునుగాక సంపూర్ణ వాసనాక్షయము, మనోనాశము, ఆత్మజ్ఞానోదయము గలుగని వారుండినచో తప్పక ప్రమాదములో పడిపోవుదురు. అందువల్లనే శంకరభగవత్పాదు లీలాగున తెలిపిరి. కావుననే గీతలో ఈక్రింది విధముగ శ్రీ కృష్ణభగవానులు తెలిపిరి.

యద్యదాచరతి శ్రేష్ఠ స్త త్త దేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥

శ్రేష్ఠుడైనవాని యాచరణ చూచియే తక్కినవారు ఆచరింతురు. శ్రేష్ఠ పురుషుడు దేనిని ప్రమాణముగా నంగీకరించునో లోకము గూడ దానిని

అనుసరించును.

సమాధి సిద్ధిరీశ్వర ప్రణిధానాత్ ॥

పరమేశ్వరునియందు అతిశయమైన భక్తి గల్గుటవల్లను, సమస్తమును ఈశ్వరార్పణ చేయుటచేతను, నిర్విఘ్నముగా నిర్వికల్పసమాధి (బ్రహ్మ సాక్షాత్కార జ్ఞానము) కలుగును అని యోగదర్శనము.

విఘ్ననివృత్తి కీలాగున నుండుటయే యుపాయమని గ్రహించు కొనవలయును.

యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥

పరమభక్తుడైనవాడు ఏలాగున తన ఇష్టదైవమందును, మరియు గురుదేవునియందును సర్వోత్కృష్టమైన భక్తి గల్గియుండునో ఆలాగున అట్టి మహాత్ముడైన వానికి మాత్రమే ఈ వేదాంతార్థము స్పష్టముగా గోచరమగును అని శ్వేతాశ్వతరోపనిషత్తు.

ఇట్లుండువారికి విఘ్నములు తొలగిపోవును.

యస్యవాఙ్మనసీ శుద్ధే సమ్యగ్గుప్తే చ సర్వదా ।
స వై సర్వమవాప్నోతి వేదాంతోపగతం ఫలమ్ ॥

ధర్మముయొక్క ఉన్నతిని గోరువారు సదా సత్యమందు వర్తింప వలయును. ఎవనియొక్క వాణియును, మనస్సును శుద్ధములుగను, స్వాధీనములుగ నుండునో అతడే సమస్త వేదాంతాద్యనుష్ఠానములయొక్క ఫలమును పొందగల్గును. తక్కినది మరుభూమిలో గనుపించెడు ఎండ మావులను చూచి జలమని తలంచి పరుగెత్తిన వానివలె నుండును.

ఫలం కతకవృక్షస్య యద్య్వంబుప్రసాదకమ్।
న నామగ్రహణాదేవ తస్య వారి ప్రసీదతి ॥

కతకచూర్ణము మట్టినీటిని నిర్మలపరచు శక్తి కలిగియుండినను దాని

పేరుమాత్రము చెప్పిన బురదనీ రేలాగున శుద్ధము కాదో, బురదనీటిలో అరగ తీసినమాత్రమే నిర్మలోదకము కాగలుగునో, అలాగున వాక్కుతో వేదాంతము చెప్పిన చాలదు; మనస్సు నైక్యపరచవలయును.

అనుష్ఠితం తు యద్దేవైర్మునిభిర్యదనుష్ఠితమ్ ।
నానుష్ఠేయం మనుష్యైస్తచ్చోక్తం కర్మ సమాచరేత్ ॥

దేవతలును, మునులును చేసినట్లు సామాన్య మనుష్యులు చేయరాదు. వారెట్లాచరించే లాగున చెప్పిరో ఆలాగున చేయవలసియుండును.

నిగ్రహానుగ్రహశక్తి గల రామకృష్ణాది దేవతలు, సిద్ధపురుషులు కొన్ని స్థలములలో అమానుషక్రియలు చేసియుందురు. వానిని చూచి సామాన్య మనుష్యులట్లు చేయరాదు. వారు జనులకు ఆచరించుటకు దేనిని చెప్పిరో ఆలాగుననే వర్తించవలయును. శ్రీశంకరాచార్య లొక సమయమున మద్య పానము చేసినట్లును, మరియొక సమయంబున కరిగిన కంచును త్రాగి నట్లును చెప్పుదురు. ఇప్పుడుకూడ పాషాణమును మూలికలో నూరి మ్రింగు వారు గలరు. కాని అది అందరికిని ఎట్లును సాధ్యము కాదు. ఆలాగున జ్ఞానికి విధినిషేధములతో సంబంధము లేదని చెప్పి తిరుగుచుండువారు కొందరు గలరు. అట్టి ప్రమాదములో పడిపోకూడదని ఋషులు కరుణ గలిగి ఉపదేశించి యున్నారు.

వేదాంతశతరుద్రీయ ప్రణవాదిజపం బుధాః ।
స త్త్వశుద్ధికరం పుంసాం స్వాధ్యాయం పరిచక్షతే ॥

ఉపనిషత్తులుగాని, వేదములలో కొన్ని భాగములుగాని, ప్రణవము, గాయత్రి, శ్రీరామ, శివ, నారాయణాది మంత్రజపములుగాని గీతాపఠనము గాని ఇవియన్నియు అధ్యయమునకు సంబంధించిన వనియు వీనిలో నేదైన నొకదాని యనుష్ఠానము వలననే మానవుల పాపము నశించి ఆత్మశుద్ధి కలుగు ననియు బ్రహ్మవేత్తలు వచించిరి.

పైజెప్పిన వానిలో నెవరికి దేనియందు విశ్వాసము గల్గునో దాని

జపమువల్ల పాపము నశించును. అప్పుడు విఘ్నములు తొలగిపోవును.

అజ్ఞోఽపి తద్జ్ఞ తామేతి శనైశ్శైలోఽపి చూర్ణ్యతే ।
బాణోఽప్యేతి మహాలక్ష్యం పశ్యాభ్యాస విజృంభణమ్ ॥

ఓ రామచంద్రా! అభ్యాసప్రభావ మెట్టిదో చూడుము. అభ్యాసముచే అజ్ఞానియు క్రమముగా జ్ఞాని యగుచున్నాడు, పర్వతములు చూర్ణ మొనర్ప బడుచున్నవి. బాణములును అతిసూక్ష్మమగు లక్ష్యమును భేదించుచున్నవి అని వాసిష్ఠము.

అభ్యాసముచే అజ్ఞానియు విజ్ఞాని యగుచున్నాడు. విద్యావిహీనుడు గొప్పవిద్వాంసుడగుచున్నాడు. పర్వతము రాళ్ళు తీయుటచేత తరుగు చున్నది. స్థూలమైన గురిని భేదించి రాగా రాగా అతిసూక్ష్మమైన లక్ష్యమును కొట్టు శక్తి గలుగుచున్నది. కావున అభ్యాసముయొక్క ప్రభావము ఇటువంటిదని గ్రహించునది.

బ్రహ్మహత్యాసహస్రాణి భ్రూణహత్యాశతాని చ ।
ఏకో హి ధ్యానయోగశ్చ దహత్యగ్నిరివేంధనమ్ ॥

సహస్ర బ్రహ్మహత్యలును, వందలాది భ్రూణహత్యలును ధ్యాన యోగముచేత నశించును. ఎట్లన కొండంత కట్టెలు గోరంత నిప్పుచే భస్మమగును గదా?

ధ్యానయోగముచే పాపరాసులన్నియు భస్మమైపోవును.

పురమేకాదశద్వార మజస్యావక్రచేతసః ।
అనుష్ఠాయ న శోచతి విముక్తశ్చ విముచ్యతే॥

ఏకాదశ ద్వారములు గల ఈ పురము (శరీరము) నిత్యవిజ్ఞాన స్వరూపుడైన యీశ్వరునికి నివాసగృహము. అట్టి సర్వేశ్వరుని ధ్యానయోగా నుష్ఠానముచే పొందువాడు మరల సంసారదుఃఖమును పొందడు. వాడు ముక్తుడు. మరల మోహము నొందడు అని కఠోపనిషత్తు.

దీనియందు మానవునికి పదునొకండు ద్వారములు చెప్పడమైనది. జంతువులకును, సామాన్య మనుజులకును నవద్వారములు సమానములు. దీనియందు బ్రహ్మరంధ్రమొకటి. రెండవది కుండలీబోధము అను రెండు విశేషద్వారములు తెలుపడమైనది. ఈ రెండు ద్వారములు తెరువబడు నప్పుడే బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము గల్గును. (ఈశ్వరదృష్టి గలుగును) జీవగుణములు నశించి దైవత్వగుణము లుదయమగును. ఇవి తెరువబడని వారు సామాన్య మనుజులు కావుననే ఆత్మజ్ఞానము గలుగనివారు పశుప్రాయులని వర్ణింపబడిరి. దీనికి దివ్యదృష్టియనియు, జ్ఞానదృష్టి యనియు, యోగదృష్టియనియు, సమ్యగ్దృష్టియనియు పేరులు. దేవాలయము మూయబడినప్పుడు దేవుని దర్శనమెట్లు గలుగదో, తెరువబడునప్పుడెట్లు దర్శనమగునో, ఈ శరీరదేవాలయముయొక్క స్థితియు అటువంటిదే. కావుననే ''దేహో దేవాలయః ప్రోక్తః'' అని వర్ణించిరి. దీనియందు ''విముక్తశ్చ విముచ్యతే''- రెండు విధములగు ముక్తులు తెలుపడమైనవి. 1. బాహ్యబంధముల నుండి విముక్తి గలుగవలయుననియు, 2. అంతటితో తృప్తిపడక ఆత్మబంధము తొలగినప్పుడే హృదయగ్రంథులు నశించునప్పుడే నిత్యముక్తి సిద్ధించుననియు గ్రహించుకొనవలయును.

యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।
యు క్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥

నియతమైన ఆహార విహారములు గలవాడును, కాలోచితకర్మను అనుష్ఠించువాడును, ఉచితమైన నిద్ర, జాగరణ గలవాడును అగు యోగికి సమస్త విఘ్నములను నశింపజేయునట్టి యోగసిద్ధి గలుగును అని గీత.

ఇచ్చట ఆహారమును గురించి బాగుగా జాగ్రత్తపడుటకొరకే ప్రథమ మున ''యుక్తాహార''యని ప్రయోగించడమైనది. ఆహారపు మార్పులవల్లనే పైజెప్పిన అన్నిటికిని మార్పు గలుగును. ఆహార విషయము సామాన్య మని తలంచరాదు. ఆ విషయమై ఆయుర్వేదమేమి చెప్పినదో చూడుడు-

రసాద్రక్తం తతో మాంసం మాంసాన్మేదః ప్రజాయతే ।
మేదసోఽస్థి తతో మజ్జా మజ్జా శుక్రస్య సంభవః ॥

అనగా అన్నజలాదులగు ఆహారపదార్థములు 1. రసము, 2.రక్తము, 3. మాంసము, 4. మేదస్సు, 5. ఎముకలు, 6.మజ్జ (క్రొవ్వు), 7.శుక్లము అని సప్తధాతువులుగా పరిణామము పొందుచుండును. ''తస్మాదన్నమయం మనః'' మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము- ఈలాగున ఆహారము యొక్క సూక్ష్మాంశముగా మారుచుండును. కావుననే వీనిని సూక్ష్మేంద్రియములని చెప్పిరి. అందువల్ల మనోబుద్ధి చిత్తాహంకారములు శుద్ధములు కావలసియుండిన శుద్ధాహారము తప్పక యుండి తీరవలయును.

ద్వౌ భాగౌ పూరయేదన్నైస్తోయేనైకం ప్రపూరయేత్ ।
మారుతస్య ప్రచారార్థం చతుర్థమవశేషయేత్ ॥

ముముక్షువులందరు ఉదరమును సగభాగము అన్నపదార్థముల చేతను, పాతికభాగము జలముచేతను, పాతికభాగము వాయుసంచారార్థమై ఖాళీగాను ఉంచవలయును. ఇది యాహార నియమము. దీనికే యుక్తాహారమని పేరు. వీరు నిరంతరము బ్రహ్మనిష్ఠయందు ఉండవచ్చును.

ఆత్మసంమితమాహారమాహరేదాత్మవాన్యతిః ।
అత్యంతక్షుధితస్యాపి సమాధిర్నైవ జాయతే ॥

ఆత్మనిష్ఠయందుండువాడు తనయాత్మ కెంతవరకు తృప్తియని తోచునో, అంతవరకే భోజనము చేయువలయును. మిక్కిలి ఆకలితో కూడినవానికిని , మిక్కుటముగా భుజించిన వానికిని సమాధి సిద్ధించదు.

హితం మితం సదాఽశ్నీయాద్యత్సుఖేనైవ జీర్యతే ।
ధాతుః ప్రకుప్యతే యేన తదన్నం వర్జయేద్యతిః ॥

ఆహారము మితముగాను, శుద్ధమైనదిగాను, ప్రీతికరమైనదిగాను ఎల్లప్పుడు నుండవలయును. ఏయాహారము భుజించిన సుఖముగాను, త్వరితముగాను జీర్ణమగునో అట్టి యాహారమునే భుజించవలయును. ఏది

భుజించిన ధాతుప్రకోపము గల్గునో అట్టి పదార్థమును దేనినికూడ బ్రహ్మనిష్ఠ డెప్పుడును భుజించరాదు.

ధాతుప్రకోపమనగా విషయాసక్తి, దాహమును గలుగజేయుట. సరిగా జీర్ణము కాక నిద్రాభంగము. అందువల్ల స్వప్నములో శుక్లనష్టము గలుగుట యగును. ఈలాటి ఉద్రేకమగు ఆహారపానీయములను బ్రహ్మనిష్ఠుడు భుజింపరాదు. ఎక్కువ నెయ్యి, నూనెగల పదార్థములను త్యజింపవలయును. నెయ్యి ఎక్కువవాడిన శాంతి గల్గునని తలంచువారు కొందరు గలరు. స్వయముగా ఈశ్వర సృష్టిలోనే శరీరమున కెంత క్రొవ్వు కావలయునో, అది ప్రతి పదార్థములోను గలదు. ఒకవేళ పాలు ఎక్కువ వాడవచ్చునేగాని, నెయ్యి ఎక్కువ వాడకూడదు. వాడినచో బ్రహ్మచర్యమును తప్పక నష్టపరచును. అది పాలనుండి విడిపోయిన దగుటచే దేహములో నిముడదు. నిజముగా వస్తు పరిశోధన చేసినచో మానవ శరీరమునకు కావలసిన చక్కెర, నెయ్యి, ఉప్పు మొదలైన వన్నియు పదార్థములలోనే సృష్టికర్త అమర్చియున్నాడు.

యదుహ వా ఆత్మసంమితమన్నం తదవతి తన్న హినస్తి ।
యద్భూయో హిన స్తి తద్యత్కనీయో న తదవతి ॥

ఎంత అన్నము దేహమునకు చాలునో అంత అన్నము తన్ను రక్షించును. దానికన్న అధికముగా తిను అన్నము తన్ను భక్షించును. దానికన్న తక్కువ యగు అన్నము దేహమును పోషించుట లేదని శతపథ బ్రాహ్మణము.

విశేషకాలములో కొందరు ఎక్కువ భుజించుటచే అజీర్ణమునకు లోబడి బాధపడుట చూచుచున్నారుగదా! ఆహారము సరిగా లేనివారు శరీరదార్ఢ్యము కలిగి తాము నిర్వహించవలసిన పనులను చేయజాలకనే యున్నారు. మితముగా భుజించువారు ఆరోగ్యవంతులై తాము చేయవలసిన కార్యక్రమములను చక్కగ నిర్వహించుచున్నారు. శరీరమొక యంత్రము వంటిది. నిప్పు నీళ్ళు ఎక్కువైన స్టీము అధికరించి బాయిలరును పగుల గొట్టును. నిప్పు నీరు సరిగా లేనిచో యంత్రము పనిచేయజాలదు. శరీరము యొక్క స్థితియు ఈలాగున నుండును.

సాయం ప్రాతర్మనుష్యాణామశనం దైవనిర్మితమ్ ।
నాంతరం భోజనం దృష్టముపవాసీ తథా భవేత్ ॥

మనుష్యులకు భోజనము దైవనిర్మితము. అది ఉదయము రాత్రి రెండు సారులు మాత్రమే. అట్టివాని కేలాటి వ్యాధియు నుండదు. ఈరెండు మారులు తప్ప నితర సమయములలో నేమియు భుజించనివాడు నిత్యోప వాసి యని చెప్పబడినది. లేక ఈ రెండు సారులు తప్ప అధికముగ భుజించు వాడు ఉపవాసవ్రతము చేయవలయును.

శాంతిపర్వమందు ధర్మరాజా భీష్ముని ఆహారనియమ మడిగినప్పుడు ఈ లాగే చెప్పెను. ఆయుర్వేదమందు మొదటనే యీలాగున తెలుపడమైనది. ఈ ఆయుర్వేదశాస్త్ర మెవరికొరకు నిర్మింపబడినది అని యడుగగా ఆహార నియమము, బ్రహ్మచర్యనియమము ఆచరింపని వారికని తెలుపడమైనది. ఆహారనియమము, బ్రహ్మచర్య నియమము గలవారికి వైద్యులును వైద్య శాస్త్రమును అవసరము లేదని తెలియదగిన దనియు తెలుపడమైనది.

ఏకవారం చరే ద్భైక్షం న ప్రసజ్జేత విస్తరే ।
భైక్షేప్రసక్తో హి యతిర్విషయేష్వపి సజ్జతి ॥

సన్న్యాసి యగువాడు ఏకకాలము మాత్రమే భోజనము చేయ వలయును. అధికముగా తినుట కూడదు. అధికము తినుటలో ఆశ కలవాడు నిశ్చయముగా విషయలోలు డగును. అట్టివానికి ఇంద్రియనిగ్రహ ముండదు అని సన్న్యాస సంగ్రహము.

ఒకసారి భుజించువాడు యోగియనియు, రెండుసారులు భుజించు వాడు భోగియనియు(గృహస్థుడు), మూడుసారులు తినువాడు రోగి యనియు, నాలుగు సారులు తినువాడు ప్రాణముతో కూడిన శవమనియు తెలియందగును. ఏకభుక్తము చేయువారికి విశేష శారీరక మానసికమైన పని యుండిన మాత్రము రాత్రులలో ఏదైన పానీయముగాని, ఫలములుగాని, స్వల్ప ఫలాహారముగాని యుండవచ్చును. బౌద్ధమతములో భిక్షువులు భిక్షి

ణులు మధ్యాహ్న మొక్కసారి మాత్రమే భుజింపవచ్చును. ఇతర కాలములలో దాహముగా నుండిన మంచినీరు మాత్రమే త్రాగవలయును. శ్రీబుద్ధదేవున కున్న సుకుమారత్వము దేవేంద్రునికి సహా లేదనియే బౌద్ధగ్రంథములలో వర్ణించడమైనది. అటువంటి రారాజుయొక్క ఏకపుత్రుడును భిక్షుకులకు నియమించిన ప్రకారము ఒకపూట మాత్రమే భోజనము చేయుచుండెను. గృహస్థులు నిమంత్రణము చేసిన రోజుమాత్రమే భిక్షువులతో వెళ్ళి భోజనము చేసి ధర్మోపదేశము సలిపి మరల ఏకాంతస్థలములోనికి వెళ్ళేవారు. భిక్షకు ఆహ్వానించని రోజులలో బుద్ధభగవానుడు భిక్షాన్నముతోనే జీవించెను.

నాసమానసహాయేషు నివసేద్యోగవిత్ క్వచిత్ ।
వసేత్సమానశీలేషు సుశీలేషు తపస్విషు ॥

ధ్యానయోగి తనకు సమానమైన గుణము కలవారుండు స్థలములో మాత్రమే యుండవలయును. అట్లు సమాన గుణములేని స్థలములలో నొకప్పుడును ఉండరాదు. నిర్మలశీలము, పుణ్యస్వభావము, తపస్సును కలవారుండు ప్రదేశమందే నివసింపవలయును.

సామాన్యముగా సాధకులు తనకన్న ఎక్కువ నియమనిష్ఠ గలవారి స్థలములోనే యుండవలయును. అట్టివారి సహవాసమే యుచితము. తనకన్న తక్కువస్థితిలో నుండువారియొక్కయు, తక్కువ స్వభావము గలవారి యొక్కయు స్థలములో నుండరాదు. ఎక్కువ గుణము గలవారు దొరకక పోయిన తనకు సమానమైన వారైనను ఉండవలయును. లేనిచో ఏకాకియై యుండుటయే మేలు.

ముహూర్తమపి నాసీత దేశే సోపద్రవే యతిః ।
ఉపద్రవే తు మనసి సమాధి ర్నైవ జాయతే ॥

ఒక ముహూర్తసమయ మైనను ఉపద్రవ (శాంతిలేని) స్థలములో ధ్యానయోగి నివసించరాదు. మనోబాధ గల స్థలములో నుండిన నిర్వికల్ప సమాధి సిద్ధింపదు.

ముఖ్యముగా ఏప్రదేశములో నుండిన విషయవాసన గలుగునో, అట్టి స్థలమును తప్పక స్త్రీయైనను, పురుషుడైనను త్యజింపవలయును. అనగా ఏ ప్రదేశమున విషయవాసన గల స్త్రీ యుండునో అచ్చోట పురుషుడును, ఏ స్థలమున విషయవాసనగల పురుషుడుండునో ఆ ప్రదేశమున స్త్రీయును ఉండరాదు. విఘ్నములలో నిదే మొట్టమొదటిది.

సమాధినా నయేత్కాలం వృథా చిన్తాం వివర్జయేత్ ।
ధ్యానేన విలయం యాన్తి పాపాని బహుజన్మనామ్ ॥

కాలము కొంచెమేయని తెలిసి వ్యర్థము చేయక, వ్యర్థమైన చిన్తలను హృదయములోనికి రానీయక సమాదినిష్ఠలో కాలమును గడుపవలయును. ఇట్టి ధ్యానమువలన అనేక జన్మములలో జేసిన పాపములుగూడ నశించును.

ఇన్ద్రియేషు చ సర్వేషు వాగుపస్థౌ మహాబలౌ ।
ఆదౌ తయోర్జయే యత్నం కుర్యాద్యోగీ విశేషతః ॥

ఇంద్రియము లన్నింటిలోను జిహ్వేంద్రియము, గుహ్యేంద్రియమును మహాబలము గలవి. కావున ధ్యానాద్యనుష్ఠానము జేయువాడు మొట్టమొదట నీ రెండింద్రియములయొక్క విషయములను జయించుటలో మిక్కిలి యత్నము గలిగియుండవలయును.

ఈ రెండింద్రియములను జయించినచో, మఱల ప్రకృతి దగ్గరకు చేర జాలదు.

యథైకం చ సువర్ణాది మిళితం రజతాదినా ।
అల్పమూల్యం ప్రజాయేత తథా జీవోఽప్యహం యుతః ॥

యథైవ హి సువర్ణాది క్షారాదేశ్శోధితం శుభమ్ ।
పూర్వవన్మౌల్యతాం యాతి తథా జీవోఽపి సంస్కృతేః ॥

ఏలాగున అపరంజి బంగారైనను రజతతామ్రాదులతో మిళితమైన దానికి స్వల్పమైన వెల గలుగునో, ఆలాగున శుద్ధజ్ఞానశివ స్వరూపుడగు

ఆత్మ దేహాద్యహంకారములతో గూడినవాడైన వానియొక్క శివత్వము నశించి జీవత్వమును బొందుచుండును. మలినమగు బంగారమును స్ఫుటమువేసిన అపరంజి బంగారముగా మారి పూర్వముండిన విలువ యేర్పడునట్లు భక్తి, ధ్యాన, జ్ఞానాదులచే జీవుడు సంస్కరింపబడినప్పుడు జీవత్వము నశించి శివత్వము గలుగుచుండును అని వాసిష్ఠము.

మలినమగు బంగార మెంతవరకు స్ఫుటము జేయబడదో అంతవరకు అపరంజి బంగారముయొక్క విలువ గలుగనట్లు జీవునియందుగల ప్రకృతి దోషముధ్యాన తపస్సులచే నెంతవరకు నశించదో, అంతవరకు జీవుడు దీనావస్థను బొందియుండును. వసిష్ఠమునీంద్రుడు ఎటువంటి దృష్టాంతమును దెలిపిరి! ప్రపఞ్చములో పవిత్రాత్ములైన వారిని భగవంతునివలె పూజించుట జూచుచున్నారముగదా! ఆలాగున పాపజీవులను కారాగారములో కఠినముగా శిక్షించి పశువులకంటెను నీచముగా జేయుటయు గానవచ్చుచున్నది గదా! వసిష్ఠులు దెలిపిన యుపదేశమువల్ల శ్రద్ధగలవారికి తరించుటకెంతో యుత్సాహము గలుగుచున్నది.

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।
తేషా మాదిత్యవద్జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥

తనలోగల యజ్ఞానమును ఎవరు రహిత మొనర్చుచున్నారో అట్టివారికి ఆత్మజ్ఞానము సూర్యునివలె ఆ పరబ్రహ్మస్వరూపమును ప్రకాశింపజేయుచున్నది.

మేఘముచే సూర్యుడుగాని చంద్రుడుగాని ఆవరింపబడియున్నప్పుడు కనిపించరు. గాలివలన మబ్బు తొలగునప్పుడు ఎట్లు కనబడుదురో ఆత్మజ్ఞానోదయముయొక్క స్థితియు నాలాగున నుండును. మేఘావరణము గలిగియుండు నపుడును సూర్యచంద్రులు పూర్ణముగనే ఉంటున్నారు. మబ్బువలన గోచరించక పోవుచున్నారు. ఆలాగున అజ్ఞానదశలోను ఆత్మజ్ఞానము పూర్ణముగనే యుంటున్నది. జ్ఞానులకును, అజ్ఞానులకును

ఇంతియే భేదము. మేఘముతో గూడియుండునట్లు అజ్ఞానులును, మేఘము తొలగిపోయినరీతి జ్ఞానులును ఉంటున్నారు. మఱియు సూర్యోదయములేని కారుచీకటిలో ఏమియు గనిపించదు. భాస్కరోదయము గలిగిన తదుపరి అంతయు గనిపించెడు తీరున అజ్ఞానావస్థలో ఈశ్వరసృష్టిశక్తి ఏమియు తెలియదు. జ్ఞానోదయము కాగానే ఈశ్వరసృష్టిశక్తి కనిపించును.

న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥

ఓ యర్జునా! నీ యొక్క యీ మాంసచక్షువువలన విశ్వరూపధరుడ నగు నన్ను జూడజాలవు. కావున అప్రాకృతమైన దివ్యనేత్రము నిచ్చు చున్నాను. ఈ దివ్యదృష్టిచే నాయొక్క యోగమహిమను (ఈశ్వరశక్తిని) జూడుము.

పంచభూతాత్మకమైన ఈనేత్రము పంచభూతమయములైన వస్తువులను జూచుశక్తిని మాత్రమే గలిగియున్నది. ఈశ్వరత్వమును జూడజాలదు. రత్నములైనను దీపము నేలాగున ప్రకాశింపజేయజాలవో, దీప మేలాగున స్వప్రకాశమై రత్నాది వస్తువులను ప్రకాశింపజేయునో; ఆలాగున జడమునకును, చైతన్యమునకును తారతమ్యము గలదు. పైజెప్పిన వాక్యమువలన జీవునికి దివ్యదృష్టి కలుగవలసియుండిన ఈశ్వరుని యనుగ్రహముచేత మాత్రమే కలుగవలసియున్నదని గోచరించుట లేదా? ఈశ్వరభక్తివల్ల గలిగెడి ప్రయోజన మిట్టిది.

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః ।
కామః క్రోధ స్తథా లోభ స్తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥

సర్వదోషములకు మూలము కామము, క్రోధము, లోభము; కనుక నీ మూడును నరకమును బొందుటకును, ఆత్మనాశమునకును కారణములు. అందువలన నరకమునుండి విడివడదలంచినవారు ఈ మూడింటిని వదలవలయును.

ఏ॒ర్ముక్తః కౌన్తేయ తమోద్వారైస్త్రిభిర్నరః ।
ఆచరత్యాత్మనఃశ్రేయ స్తతో యాతి పరాం గతిమ్ ॥

ఓ యర్జునా! నరకద్వారమునకు హేతువులైన ఈ మూడు దుష్ట గుణములచే విడివడిన నరుడు తనకు శ్రేయస్సును గలుగజేసెడి దైవభక్తి జీవకారుణ్యధ్యానాదులను జేసికొనుచో సర్వోత్కృష్టమైన మోక్షగతిని బొందు చున్నాడు.

పాపమునుండి యేలాగున విమోచనము గలుగునో అను చింత గలవారికి భగవానుడే ఉపాయమును తెలిపియున్నాడు. కామక్రోధ లోభములు నరకద్వారములనియు, ఈ మూడు గుణములను త్యజించి యాత్మశ్రేయస్సుకొఱకు యత్నించువాడు మోక్షద్వారమును తెరచిన వాడనియు నుపదేశించిరి. దీనికంటె నుపాయమును ఎవరేమి వచించగలరు?

యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥

యజ్ఞ దాన తపంబులు ఫలాభిలాషలేని ప్రజ్ఞాశాలురకు చిత్తశుద్ధిని గలుగజేయును గాన యజ్ఞ దాన తపోరూపమగు కర్మలను తప్పక చేయ వలయును.

పాపకర్మ లుండుటచేతనే విఘ్నములు గలుగుచున్నవని పలుసారులు తెలుపడమైనది. అట్టి పాపశాంతి గలుగునప్పుడే విఘ్నములు నశించును. అట్టి పాప శాంతికొఱకు పైజెప్పిన మూడువిధులను ఆచరించవలయును. కావుననే ''న త్యాజ్యం కార్యమేవ తత్'' తప్పక చేయవలయుననియు, ఉపేక్ష చేయరా దనియు తెలిపిరి. తనకుగల దోషములు, లేక దుఃఖములు నశించుట కొఱకును, సుఖములు పుణ్యములు గలుగుట కొఱకును పైజెప్పిన యజ్ఞ దాన, తపస్సుల నాచరించునప్పుడు మనస్సున బాగుగ ధ్యానము జేసినచో అట్టి ఫలము బొందగలరు. అయితే ఇది కామ్యకర్మతో గూడినది గదాయని సందియపడ నక్కరలేదు. దుఃఖనివృత్తి గలుగుటకొఱకు పరమాత్ముని

ధ్యానించి చేయు కర్మయు, బంధనివృత్తికొఱకు గాగలది గాన దానివలన దోషము లేదు. లాభప్రాప్తి నిమిత్తము చేయునది ఫలమును గలుగజేయునే గాని దానిచే దైవప్రీతి గలుగదు. అయితే నిష్కామ కర్మయోగము కేవలము ముముక్షువులకుమాత్రమే చెల్లును. తక్కిన పుణ్యకర్మలు సాధారణ జనులు చేయుటలో విరోధము లేదు.

సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥

నన్నాశ్రయించెడి వాడెల్లప్పుడు సర్వకర్మలను చేయుచున్నవాడైనను నాయనుగ్రహమువలన నిత్యమైనదియు, నాశము లేనిదియు నగు మోక్షమును బొందుచున్నాడు.

దీనియందు 'సర్వకర్మాణి' యని చెప్పుటచే విధిచోదితమగు గృహస్థాశ్రమమునందుండినను. లేక విరక్తుడై యేకాంతమునందున్న వాడైనను విరోధము లేదు. ''మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్'' అని భగవంతుడు చెప్పుటచే భగవదనుగ్రహమువల్లనే విఘ్నము లన్నియు తొలగి శాశ్వతమగు మోక్షపదము లభించునని గ్రహించవలయును. భగవదనుగ్రహము గలుగవలసియుండిన భగవత్ప్రీతికర కార్యములను భగవదర్పిత భావముతో జేయవలయును.

మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ।
అథ చే త్త్వమహంకారాన్న శ్రోష్యసి వినజ్‌క్ష్యసి ॥

ఓ యర్జునా! నన్ను ధ్యానించుచున్న, నీవు నా యనుగ్రహమువలన సకలములైన సంసారబంధములను (సమస్త విఘ్నములను) దాటగలవు. అట్లుగాక యహంకారము గలిగి, విననొల్లవేని చెడియెదవు. అనగా మోక్షభ్రష్టుడ వగుదువు.

''మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి'' ఇచట సర్వదుర్గాణి అని సర్వనామ ప్రయోగమును జేయుటవలన సమస్త విఘ్నములను

దాటగలవు అను భగవద్వాక్యమున విశ్వాసమును గలిగియుండుడు.

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥

ఓ యర్జునా! అన్నివిధములచే నా సర్వేశ్వరుని రక్షకునిగ వేడుకొనుము. ఆ సర్వేశ్వరుని యనుగ్రహమువలన సర్వోత్కృష్టమగు పరమ శాంతిని (ప్రకృతి రహితమగు నుపరతిని), శాశ్వతమగు మోక్షమును బొందగలిగెదవు.

ఈ శ్లోకములోను ''తమేవ శరణం గచ్ఛ'' అనియు, ''తత్ప్రసాదాత్పరాం శాన్తిం'' అనియును ఉపదేశించుటవలన పరమేశ్వరానుగ్రహము వల్లనే విఘ్నము లన్నియు తొలంగును. గీతయొక్క యంతిమస్థితిలోను నిట్లుపదేశించుటవలన మిక్కిలి జాగరూకతతో నిది గ్రహించవలసియున్నది. పైజెప్పిన ప్రకారము అర్జునుడు మొదలగువారు చేసికొనుటవలననే భగవంతుడు వారికిగల సమస్త విఘ్నములను రహిత మొనర్చి సామ్రాజ్య పట్టాభిషిక్తులనుగా చేసెను. యుద్ధములో భీష్మ, ద్రోణ, కర్ణాదులను జయించుట భగవదనుగ్రహమునగాక మరేమున్నది? అంతియుగాక అర్జునునకు భగవంతుడే సారథిగా నుండి విజయమును గలుగజేసెను. భగవదనుగ్రహబలమును దీనిచేతనే గ్రహించుకొనవచ్చును. ఇచట సామ్రాజ్య విజయము, పట్టాభిషేకము ముముక్షువులకు మోక్షసామ్రాజ్యాభి షేకమని గ్రహించదగినది. అంతరాయములు ఆటంకములే.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥

నాయందర్పిత చిత్తము గలవాడ వగుము. నాయందు భక్తిగలవాడవు గమ్ము. నన్నే నమస్కరించు వాడవు గమ్ము. సకలమును నాయందు సమర్పించితివేని నన్ను బొందెదవు. నాకిష్టుడవైనందున నీకు సత్యముగా ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాడను.

''సత్యం తే ప్రతిజానే'' – ఇచట భగవంతుడు ప్రతిజ్ఞజేసి (ఆనపెట్టి) చెప్పుటయు, ఇది సత్యమని పలుకుటయు జూచినచో సర్వవిఘ్నములనుండి విముక్తి గలుగవలసి యుండినను, ''మామేవైష్యసి'' భగవంతుని (మోక్షమును) పొందవలసియుండినను, ఇది యొక్కటియే యుపాయమని తప్పక గ్రహించవలసియుండును. ఈశ్వరవిశ్వాస మొకటి లేనిచో జీవునకు ఆత్మశాంతి గలుగుటలో వేరొండుపాయము లేదు.

కష్టావస్థలో ఉన్నప్పుడిట్టి ఈశ్వరవిశ్వాస మొక్కటియే ఆత్మశాంతిని గలుగజేయును. అయితే ఈశ్వర విశ్వాసము గలవానివలె నటించి యధర్మమును గావించిన నతనికి ఈశ్వరకరుణ గలుగునా? యనెడి ప్రశ్న యొక్కటి లోకమున నిలిచియున్నది. ఈశ్వర విశ్వాసము గలవాడైనచో నతడీశ్వర ధర్మమునకు భిన్నమైన కార్యమును జేయడనియే దానికి సమాధానము. ఈశ్వర భక్తునివలె వేషములు భాషణములు గలిగియుండి అధర్మకార్యమును జేయుచుండిన; నతని హృదయములో నీశ్వర విశ్వాసము లేదనియే మనము గ్రహించవలయును. అతడు సీతాపహరణకొఱకు రావణుడు ధరించిన పరమర్షివేషమువంటివాడని మనము గ్రహించవలయును.

ఆపత్కాలములో ఈశ్వర విశ్వాస మొక్కటి లేనిచో మనస్సమాధానము గలుగుటకు వేరు మార్గము లేదు. సముద్రములో పడిపోయినవాడు నావికుని సహాయము లేనిచో నెట్లు తీరము జేరగలుగును? అగాధమైన పాడునూతిలో బడినవాడు రెండవ వాని సహాయము లేనిచో నెట్లు వెలుపలికి రాగలుగును? అలాగున నీ విఘ్నములనుండి విముక్తి గలుగవలసియుండిన ఈశ్వరానుగ్రహము తప్పక గలిగియుండవలయును. గజేంద్రుని చరిత్రయే ఇందులకు దార్కాణము.

ఐతే వేదాంతములయొక్క నిజస్వరూపము చక్కగ తెలియని వా రీ విషయమై ఇది భక్తియోగమేగాని తత్త్వవిచారణ పరమగు జ్ఞానవిచారణ గాదనియు, తక్కువ మెట్టనియు బలుకుదురు. వేదాంతసత్య మెఱింగిన మహనీయులందరు ముఖ్యముగా శంకరాచార్యులుగూడ ఈశ్వరాను

గ్రహము లేనిచో ఈశ్వర తత్త్వమును బొందజాలరని వక్కాణించిన భాగముల నుండి కొంతవరకు ఈ గ్రంథములో నిరూపించడమైనది. ఇక నీ విషయమై విస్తారముగా వ్రాయవలసి యుండిన అదియే ఒక గొప్ప గ్రంథమగును. ఇట్టి ఈశ్వరకృపకు దూరులై "అహంబ్రహ్మాస్మి" యను మహావాక్యమును జెప్పువారలలో చాలమంది పతితు లగుటకును, విఘ్నబాహుళ్యముచే బద్ధులగుటకున్ను ఇదియే కారణము. నిజముగా లోతులోనికి దిగి దీర్ఘముగా నాలోచించిన వేదాంత తత్త్వమగు "అహం బ్రహ్మాస్మి" యొక్క ఫలమే కలుగును. ఏలన నతడు తనయొక్క జీవభావమును త్యజించి బ్రహ్మభావన జేయుటయు నొక విధమగు ఉపాసనయే యగును. అట్టి బ్రహ్మభావములో రూఢిగ నిలుకడ గలిగినవారు ధన్యులే.

అయితే బ్రహ్మము ప్రకృతిరహిత మగుటచే అట్టివాని నుండి ప్రకృతి గుణము లెవ్వియు బయలుపడగూడదు. ఆలాటి స్థితి గలుగుటకు మహా ప్రజ్ఞావంతులకు మాత్రమే సాధ్యమగును. తక్కిన వారలందరు ఇట్టి యీశ్వర భక్తిపరమగు బ్రహ్మాత్మైక భావమును బొందుటయే సులభమార్గము. దీనినే శ్రీ శంకరభగవత్పాదులు "భేజే భ్రమర కీటవత్" అను భ్రమరకీటక న్యాయమని తెలిపిరి. పైజెప్పిన విధముగ వేదాంతతత్త్వ బ్రహ్మసిద్ధిలో ఆరూఢస్థితి గలిగియుండిన మహాత్ముడైన తనయొక్క సర్వేంద్రియముల ద్వారా రోమకూపములతో సహా ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములతో సహా బ్రహ్మభావమున కనువైన ప్రకృతివాసనగాని, గుణముగాని గలిగియుండ రాదు. ఉండినచో గిల్టునగను బంగారునగయని చెప్పి విక్రయమునకు తెచ్చినవానివలె నుండునని మనము గ్రహించుకొనవలయును.

ఈశ్వరానుగ్రహాచ్ఛాన్తి దాన్త్యాదిగుణసంయుతమ్ ।
జన్మ చేల్లభ్యతే తస్మిన్ విద్యయా మోక్షమాప్నుయాత్ ॥

ఈశ్వరానుగ్రహమువల్లనే జీవునికి శమదమాది గుణములతో గూడిన జన్మము లభించును. అట్టి శాన్తిదాన్త్యాది దైవగుణములు గల జన్మమందే జ్ఞానము గలుగును. అట్టి జ్ఞానమువల్లనే జీవన్ముక్తి (మోక్షము) సిద్ధించును

అని అనుభూతిప్రకాశము.

వనం తు సాత్త్వికో వాసో గ్రామో రాజస ఉచ్యతే ।
తామసం ద్యూతసదనం మన్నికేతం తు నిర్గుణమ్ ॥

సాత్త్వికులకు వనవాసము, రాజసులకు గ్రామవాసము, తామసులకు జూదమాడు స్థలమును, నిర్గుణులకు నా స్థానమును (పరమేశ్వర స్థానము) ఇష్టములు.

దేవానామమృతం నౄణామృషీణాం చాన్న మోషధిః ।
దైత్యరక్షఃపిశాచాదేర్దత్తం మద్యామిషాది చ ॥

బ్రహ్మదేవుడు సృష్టికాలమున ఎవరెవరి కేయే యాహారములను విధించెనో, వాని నీశ్లోకము నిరూపించుచున్నది. 1.దేవతలకు అమృతము, 2.మానవుల కన్నము, 3.ఋషులకు కందమూల ఫలాదులు. 4.భూతప్రేత పిశాచ రాక్షసాదులకు మద్యమాంసాదులును బ్రహ్మదేవునిచే నేర్పరుపబడెను. కావున మద్యమాంసాదులను ఎవరికొరకేర్పరచిరో విజ్ఞులు తెలిసికొనగలరు.

దీనియందు సత్త్వగుణము గలవారి కేకాంత ప్రదేశమును విధించెను. ఆలాటి స్థలములో నుండిన విఘ్నములు గలుగనేరవు.

ఇన్ద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశమ్ ।
జితేన్ద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః ॥

ఇంద్రియములయొక్క జయముకొఱకు రాత్రింబవళ్ళు యోగానుష్ఠానమును గలిగియుండవలయును. ఇంద్రియజయము గలవాడు మాత్రమే ప్రజలను స్వాధీనములోనుంచి నడుపుటకు శక్తిమంతుడగును అని మనుస్మృతి.

ప్రభువు ప్రజలను, బోధకుడు జనులను, గురువు శిష్యులను ధర్మమార్గములో నడుపుటకు ఇంద్రియజయము గలుగవలయును. వ్యష్టికిని, సమష్టికిని పరస్పర సంబంధము గలదు. తన దేహములోగల ఇంద్రియము

లను తన యిష్టానుసారముగా నడుప శక్తిగలవాడు మాత్రమే లోకమున గల జనులను న్యాయమార్గములో నడుపగలుగును. రాజులకును ఇట్టి భక్తి గలిగియుండిన మాత్రమే ప్రజలను న్యాయమార్గములో నడుప సమర్థత గలుగును.

అసాధ్యః కస్యచిద్యోగః కస్యచిద్జ్ఞాన నిశ్చయః ।
ఇత్థం విచార్య మార్గౌ ద్వౌ జగాద పరమేశ్వరః ॥

ఒకానొకనికి యోగము సాధ్యము గాదు. కాని జ్ఞానము సాధ్యమగును. మఱియొకనికి జ్ఞానము సాధ్యము గాదు కాని యోగము సాధ్యమగును. ఈ ప్రకారము భగవాను డాలోచించి రెండైన యోగజ్ఞాన మార్గములను సృష్ట్యాదియందే ఏర్పాటుచేసెను.

జీవులకు పూర్వజన్మ సంస్కారము ననుసరించియే యోగమునందు గాని, జ్ఞానమునందుగాని, భక్తియందుగాని, నిష్కామకర్మయందుగాని ప్రవృత్తి గలుగుచుండును. ఆయా సంస్కారముల ననుసరించి యభిరుచి పుట్టును. ప్రకృతిగుణములు నశించిన నెవ్వరైనను ముక్తు లగుదురు.

యోగాత్పరతరం పుణ్యం యోగాత్పరతరం శివమ్ ।
యోగాత్పరతరం సూక్ష్మం యోగాత్పరతరం న హి ॥

ధ్యానయోగమునకంటెను శ్రేష్ఠమైన పుణ్యము వేరొండు గానంబడదు. ధ్యానయోగముకన్న అధికతరమగు మంగళకరము మఱియొకటి లేదు. ధ్యానయోగమునకన్న శ్రేష్ఠమైనది, గ్రహించందగినది సూక్ష్మతరము నైన జ్ఞానము మఱియొకటి లేదు. ధ్యానయోగమునకన్న ఉత్కృష్టమగు వస్తువు మఱియొకటి గానంబడదు.

శ్రవణం మననం ధ్యానం విద్యాయాస్సాధనం త్రయమ్ ।
అజ్ఞానం సంశయో భ్రాన్తి రిత్యేతేషాం నివర్తకమ్ ॥

శ్రవణముచే నజ్ఞానము, మననముచే సంశయము, నిదిధ్యాసముచే భ్రాన్తియు నశించును. బ్రహ్మవిద్యయొక్క సాధనత్రయము దీనివలన

నిరూపించడ మైనది.

శ్రుత్వా తత్త్వమసీత్యేవం బోధ్యమానోఽప్యనేకశః ।
న విజానాత్యయం తత్త్వమీశానుగ్రహవర్జితః ॥

బహుకాలము తత్త్వమస్యాది మహావాక్యములను శ్రవణము గావించినను, బహువిధములుగా దేశికేంద్రునిచే బోధింపబడినను ఈశ్వరానుగ్రహము లేనివాని కీతత్త్వము బోధపడనేరదు అని సర్వవేదాన్తసార సంగ్రహము. (శ్రీశంకరాచార్యులు)

పతిహీనా యథా నారీ మాతృహీనో యథా శిశుః ।
గురుహీన స్తథా ప్రాణీ తస్య జన్మ నిరర్థకమ్ ॥

భర్తలేని స్త్రీయు, ఆలాగున తల్లిలేని శిశువును, తద్విధముగనే గురువు లేని మానవుని జన్మయు నిరర్థకము.

బ్రహ్మనిష్ఠుడైన గురువు లభించిన విఘ్నములు గలుగనీయక తగు మార్గము నుపదేశించును.

శైలే శైలే న మాణిక్యం మౌక్తికం న గజే గజే ।
సాధవో న హి సర్వత్ర చన్దనం న వనే వనే ॥

ఎచట చూచిన కొండలలో రాళ్ళు గనిపించునేగాని వాటిలో మాణిక్యమెంత దుర్లభమో, ఆలాగున గజము లనేకములు గోచరించును గాని గజముత్యముగల యేనుగెంత దుర్లభమో, ఆలాగున ఎచట చూచినను విస్తారముగ వనములలో పలు విధములగు వృక్షములు గనిపించునుగాని శ్రీగంధపు చెట్టెంత యరుదుగ నుండునో, ఆలాగున నెచట జూచినను సాధువు లనేకులు గనుపించినను నిజమగు సాధనానుష్ఠానము గల సాధువు లభించుట కడుంగడు దుర్లభము అని అష్టావక్రగీత.

దుర్లభో విషయత్యాగో దుర్లభం త త్త్వదర్శనమ్ ।
దుర్లభా సహజావస్థా సద్గురోః కరుణాం వినా ॥

విషయనివృత్తి మహాదుర్లభము, తత్త్వదర్శనముగూడ అట్లు దుర్లభము. సహజా మనస్కస్థితి మిక్కిలి దుర్లభము. ఇవన్నియు సద్గురు దేవునికృప వలననే గలుగవలసియున్నవి అని హఠయోగప్రదీపిక.

విరక్తుడైన శిష్యునకు వైరాగ్యపురుషుడగు గురువు దొరకుట కన్న మించిన భాగ్యము లేదు. ఆలాగున పుణ్యవతియగు నారీమణికి ఉత్తముడగు భర్త లభించుటకన్న మించిన భాగ్యము లేదు.

బహుజన్మ కృతైః పుణ్యైః వైరాగ్యం ఖలు జాయతే ।
వైరాగ్యేణ వినా జ్ఞానం కదాచిన్నోపజాయతే ॥

అనేకజన్మములలో జేసిన నిష్కామ పుణ్యకర్మలచేతనే జీవులకు వైరాగ్యము జనించును. అట్టి వైరాగ్యము లేకయే జీవికిని జ్ఞాన మేకాలమందైనను గలుగుట లేదు.

రోగులు, దారిద్ర్యపీడితులు, అనేక సంతానములు గలవారు, వార్ధక్యావస్థలో నుండువారు, తక్కువ జాతిలో జనన మొందిన వారు, నివసించుట కొక గుడిసెయైనను లేక తిరిగెడివారు, నిరాధారులైన వారుగూడ విరక్తిని బొందక మఱల మఱల సంసారవిషయములలోనే పడియుండుట జూడ ఉత్తమకులములో బుట్టి, సర్వావయవములు పూర్ణముగా గలిగి, ఆరోగ్యవంతుడై, సర్వసౌఖ్యములుండి, యౌవనదశయం దున్నప్పుడే, విషయాదుల యందు విరక్తి గలిగియుండిన ఆ జీవి యెంత పుణ్యాత్ముడో యోచించవచ్చును.

నాస్తి శ్రద్ధాసమం పుణ్యం నాస్తి శ్రద్ధాసమం సుఖమ్ ।
నాస్తి శ్రద్ధాసమం తీర్థం సంసారే ప్రాణినాం నృప ॥

ఓ రాజా! శ్రద్ధగల స్వభావమునకు సమమగు పుణ్యము వేరొండు గానరాదు. శ్రద్ధగల స్వభావమునకన్న సుఖము మఱియొకటి లేదు. శ్రద్ధగల స్వభావమునకన్న వేరొక తీర్థస్నాన ఫలము ఈ ప్రపఞ్చమున గానరాకున్నది.

యుంజీత ప్రణవే చేతః ప్రణవో బ్రహ్మ నిర్భయమ్ ।
ప్రణవే నిత్యయుక్తస్య న భయం విద్యతే క్వచిత్ ॥

ప్రణవమునందు సాధకుడు మనస్సును బొందింపజేయ వలయును. ప్రణవమే నిర్భయమగు బ్రహ్మము, ప్రణవమునం దెల్లప్పుడు మనస్సును లయముగావించి ధ్యానము జేయువాని కెచ్చోటను భయ ముండదు. వాని కెల్లప్పుడును మంగళమే గలుగును, విఘ్నము లుండవు.

అథాతస్సంప్రవక్ష్యామి శుద్ధకైవల్యముక్తిదమ్ ।
అనుగ్రహాన్మహేశస్య భవదుఃఖస్య భేషజమ్ ॥

ఓ మునివరులారా! నేను శ్రీపరమేశ్వరుని యనుకంపాతిశయంబున పరమపవిత్ర మైనదియు, సంసారమను రోగమునకు నౌషధ మగునదియు, బ్రహ్మరూపకమగు ముక్తినిచ్చు కైవల్యప్రదమునగు జ్ఞానమును జెప్పు చున్నాడను (శివగీత).

''అనుగ్రహాన్మహేశస్య''- ఈశ్వరానుగ్రహము వల్లనే విఘ్నము లన్నియు దొలగి ముక్తి గలుగును.

కంచిత్కాలముమామహేశ భవతః పాదారవిందార్చనైః
కంచిద్ధ్యానసమాధిభిశ్చ నతిభిః కంచిత్కథాకర్ణనైః ।
కంచిత్కంచిదవేక్షణైశ్చ నుతిభిః కంచిద్దశామీదృశీం
యః ప్రాప్నోతి ముదా త్వదర్పితమనా జీవన్ స ముక్తః ఖలు ॥

ఓ ఉమామహేశ్వరా! కొంతకాలము నీ పాదార్చనచేతను, కొంత కాలము నీ ధ్యానసమాధులచేతను, కొంతకాలము నీ నమస్కారముల చేతను, కొంతకాలము నీకథాశ్రవణములచేతను, కొంతకాలము నీదర్శన ములచేతను, కొంతకాలము నీస్తోత్రములచేతను కూడి సంతోషముచేత నీయందుంచబడిన మనస్సు గలవాడెవ్వడో వాడు జీవించియుండినను ముక్తుడే.(శివానందల హరి- శ్రీశంకరాచార్యులవారి వాక్యము).

పై జెప్పిన ప్రకారము చేయువారి మనస్సు ఎల్లప్పుడు ఈశ్వర

భావములో నుండుటచే నితరములగు చెడు సంకల్పముల కవకాశమే కలుగదు. రాత్రికాలమున నింటిలో దీపము వెలుగుచుండిన చీకటి ప్రవేశింప జాలనట్లు అతని హృదయమందును తమస్సు ప్రవేశింపజాలదు.

ఆశ్రమధ్యాననిరతః సంశయచ్ఛిత్సు బుద్ధిమాన్ ।
నిత్యానుష్ఠానసంయుక్తస్త్వాచార్యః పరికీర్తితః ॥

తన యాశ్రమమునకు తగిన ధ్యానానుష్ఠానములు గలవాడును, సంశయమును ఛేదించువాడును, నిర్మలమైన బుద్ధిగలవాడును, నిత్యానుష్ఠానము నందు మంచి నిష్ఠగలవాడును ఆచార్యు డనంబడును. (గురుగీత-ఈశ్వరవాక్యము.)

భావహీనో నరస్సర్వం కృత్వాఽపి న విముచ్యతే ।
భావయుక్తః పునస్సర్వమకృత్వాఽపి విముచ్యతే ॥

ఆత్మభావనాశుద్ధి లేనివాడు ఎన్ని పుణ్యకర్మానుష్ఠానములను, బ్రహ్మ విచారణను చేసినను మోక్షమును బొందజాలడు. ఆత్మయందు శుద్ధమైన స్థితి గలిగి బ్రహ్మభావన జేయువాడు పైజెప్పిన క్రియల నేవియు చేయకుండి నను జీవన్ముక్తుడగును.

భావనతో జేయకపోవుటయే జపధ్యానాదులచే పొందెడి ఫలమును బొందకుండుటకు గారణము. హృదయమందు పవిత్రత గలిగి దైవభావన గలవా డేక్రియలను జేయకుండినను ముక్తుడగును. పూర్వీక ఋషులు జపించిన మంత్రములను ధ్యానములను ఇపుడుండు వారు చేసియు ఆ మహనీయులు బొందిన స్థితిని బొందకుండుటకు వారు భావనప్రకారము చేయకపోవుటయే కారణమగును.

ఈ విషయమై పతంజలి మహర్షి యోగదర్శనమున నిట్లు వచించిరి.

తజ్జ

ఏ మంత్రమును జప మొనర్చునో దానియొక్కయర్థమును దైవ భావమును గలిగి జపము చేయవలయును.

మంత్రార్థం మంత్రచైతన్యం యో న జానాతి సాధకః ।
శతకోటిప్రజప్తాఽపి తస్య సిద్ధిర్న సిధ్యతి ॥

సాధకుడు తాను జపించు మంత్రార్థమును, ఆమంత్రాధిష్ఠాన దైవమును భావనచేయక నూరుకోట్ల జప మొనర్చినను దానియందు చెప్పబడిన సిద్ధిని బొందజాలడు.

సాధకుడు, జపధ్యానపరాయణు డీసత్యమును బాగుగ జ్ఞప్తిలో నుంచుకొని ప్రవర్తించవలయును.

బ్రహ్మజ్ఞానాత్పాశహానౌ క్షీణక్లేశో న జన్మభాక్ ।
పాశాశ్చతుర్విధాశ్చైవ శాస్త్రేషు ప్రతిపాదితాః ॥

బ్రహ్మజ్ఞానమువలన పాశములు నశింపగానే క్లేశములు లేనివాడై జీవుడు మరల జన్మించడు. పాశములు నాల్గువిధములని శాస్త్రములయందు చెప్పబడినవి.

మలో మాయా కర్మ తత్త్వతిరోధానం చ తే మతాః ।
మలో జ్ఞానక్రియాశక్త్యోశ్చాదకో దోష ఉచ్యతే ॥

మలము, మాయ, కర్మ, తత్త్వము మూతబడియుండుట – యని పాశ ములు నాల్గు విధములు. మలమనగా జ్ఞాన క్రియాశక్తులను మూతవేసియున్న దోషమునకు పేరు.

రాగాది హేతుర్మాయోక్తా కర్మ పుణ్యం చ పాతకమ్ ।
మూఢై స్తత్త్వతిరోధానం సర్వైరప్యనుభూయతే ॥

రాగద్వేషాదులను కలిగించునది మాయ యనబడును. పుణ్యము, పాపము కర్మ యనబడును. తత్త్వతిరోధానము నిజము తెలియకుండుట మూఢులందరికిని అనుభవసిద్ధమే.

ఈ దోషములు నశించుటకు ఈశ్వరానుగ్రహము తప్ప వేరు మార్గము లేదని అనుభూతిప్రకాశము.

ఉపాయః ప్రణవేనాత్మధ్యానం తేనైష లభ్యతే ।
తిలాత్తైలాదయో యద్వల్లభ్యా స్తత్తదుపాయతః ॥

ఓంకారముతో ఆత్మను ధ్యానించుట యుపాయము. దానిచేత బ్రహ్మము తెలియబడును. తిలలనుండి నూనె మొదలగునవి ఆయా యుపాయములతో నెట్లు తీయబడునో అట్లు.

సర్వవ్యాపినమాత్మానం క్షీరే సర్పిరివార్పితమ్ ।
ఆత్మవిద్యాతపోభ్యాం తముపలభ్య విముచ్యతే ॥

పాలలో నేయివలె సర్వత్ర జగత్తులో వ్యాపించియున్న ఆత్మను ఆత్మ జ్ఞానముచేతను, తపస్సుచేతను దెలిసికొని ముక్తిని బొందును.

యదు క్తం ప్రణవధ్యానం స యోగ స్తత్ర యత్నవాన్ ।
మనో బ్రహ్మణి యుంజాన స్తత్సాక్షాత్కురుతే ధియా ॥

ఏ ప్రణవధ్యానము చెప్పబడినదో అది యోగ మనబడును. దానికై యత్నించువాడు మనస్సును బ్రహ్మమునందు గూర్చిన వాడగుచు బుద్ధితో బ్రహ్మమును సాక్షాత్కరించుకొనును.

ఉరోఽంసమూర్ధస్థానేషు త్రిషు దేహం సమున్నతమ్ ।
అవస్థాప్యాసనం జిత్వా ప్రత్యాహారం సమాశ్రయేత్ ॥

వక్షఃస్థలము, భుజము, శిరస్సు- ఈ మూటియందు దేహము నున్నతముగా నుంచి యాసనమును జయించి అనగా లొంగదీసికొని ప్రత్యాహారము చేయవలయును.

హృద్యక్షాణాం నిరోధో యః ప్రత్యాహారః స ఉచ్యతే ।
జయేత్ప్రాబల్యమక్షాణాం ప్రాణాయామేన ధైర్యవాన్ ॥

ఇంద్రియములను హృదయమందు నిలుపుటయే ప్రత్యాహార మనబడును. ప్రాణముల ప్రాబల్యమును ప్రాణాయామముచేత ధైర్యవంతుడై జయింపవలెను.

ప్రాణాధీనవ్యాపృతానామక్షాణాం ప్రాణరోధనాత్ ।
నిరోధః స్యాత్తతశ్చిత్తం ధారయేత్తాప్రమాదతః ॥

ప్రాణమున కధీనమైన వ్యాపారముగల యింద్రియములకు ప్రాణమును నిరోధించుటయే నిరోధము. పిమ్మట పొరపాటులేక మనస్సును నిలుపవలెను.

సమే శుచౌ శర్కరాది మశకాది వివర్జితే ।
మనోఽనుకూలేఽవస్థాయ దేశే ధ్యానం సమాచరేత్ ॥

హెచ్చుతగ్గులు లేనిది, శుచి యగునది, రాళ్ళు మొదలయినవి లేనట్టిది, దోషములు మొదలయినవి లేనట్టిది, తన మనస్సున కిష్టమునగు ప్రదేశమునందు ధ్యానము చేయవలయును.

నాడీరూపాణి నీహారధూమాన్యత్ర విభాంతి చేత్ ।
బ్రహ్మసన్నిధిమాప్తా ధీరితి నిశ్చీయతాం తదా ॥

మంచుపొగవలె నాడీరూపములు కనబడినట్లయిన బుద్ధి బ్రహ్మ సమీపమునకు జేరెనని యపుడు నిశ్చయించవలయును.

నిర్జరత్వవితృష్ణత్వ శుభగంధాది చేద్భవేత్ ।
యోగసిద్ధిః ప్రవృత్తేతి జ్ఞాత్వా యోగే స్థిరో భవేత్ ॥

ముసలితనము లేకుండుట, దాహము లేకుండుట, సుగంధము వాసించుట మొదలగునవి గలిగిన యోగసిద్ధి ప్రారంభించినదని తెలిసి యోగమందు నిలకడ గలవాడు గావలయును.

మేఘచ్ఛన్నం చంద్రబింబం మేఘాపాయేఽతినిర్మలమ్ ।
తథైవ బుద్ధిచాంచల్యశాంతావాత్మా ప్రసీదతి ॥

మేఘముతో గప్పబడిన చంద్రబింబము మేఘము పోయిన పిమ్మట అతినిర్మల మగునట్లు బుద్ధిచాంచల్యము శాంతించగా నాత్మ నిర్మల మగును.

స్వాత్మతత్త్వప్రసాదేన బ్రహ్మత త్త్వం ప్రసీదతి ।
శాస్త్రాద్బుద్ధం బ్రహ్మత త్త్వమాత్మత్వేనానుభూయతామ్ ॥

తన యాత్మతత్త్వము ప్రసన్న మగుటచేత బ్రహ్మతత్త్వము ప్రసన్న మగును. అంతవఱకు శాస్త్రమువలన దెలిసికొనిన బ్రహ్మతత్త్వము తానే యని యనుభవము నొందగలుగును.

అజం ధ్రువం మాయికై స్తైః కార్యైః సర్వైర్వివర్జితమ్ ।
జ్ఞాత్వా దేవం పరాత్మానం సర్వపాపైర్విముచ్యతే ॥

జన్మము లేనిది, నిత్యమైనది, ఆయా మాయాకార్యములు లేనిదియు నగు దానినిగా పరమాత్మను దెలిసికొని సర్వపాపములచే విడువంబడును.

ఏష దేవః సర్వదిక్షు వహ్న్యాదిష్వఖిలేషు చ ।
వర్తతే తం విచింత్యాథ ప్రణమేత్సర్వదైవతమ్ ॥

ఈదేవుడన్నిదిక్కులయందును, అగ్ని మొదలయిన అన్ని వస్తువు లయందును గలడు. అతనిని ధ్యానించి సర్వకాలములందును అతనికి నమస్కరింపవలయును.

ఇక మనుమహర్షి మనుస్మృతియందు కట్టకడపటి యధ్యాయము నందు తెలిపిన భావమును గుఱించి చూడుడు.-

యథోక్తాన్యపి కర్మాణి పరిహాయ ద్విజోత్తమః ।
ఆత్మజ్ఞానే శమే చ స్యాద్వేదాభ్యాసే చ యత్నవాన్ ॥

మానవుడు శాస్త్రవిహితములగు ఇదివరలో జెప్పబడిన అగ్నిహోత్ర నిత్యనైమిత్తిక కర్మల నాచరించక పోయినను పరమాత్మచింతనము, ఇంద్రియజయము, ప్రణవజపము (ఉపనిషదాది పారాయణము) - వీనియందైనను ప్రయత్నము గలిగియుండవలయును.

అన్ని యనుష్ఠానములను జేయకపోయినను పైజెప్పిన మూడింటి యందైనను ప్రయత్నవంతుడై యుండవలయునని మనువుపదేశించెను. ఇది సామాన్యజనులకు సయితము సాధ్యమైనదే. అంతమాత్రముగూడ జేయక పోయిన ఆత్మశుద్ధి యెట్లు గలుగును? మోక్షసౌఖ్యమును ఎట్లు బొందగలుగును?

సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

సమస్త ధర్మములను విడిచి నన్నొకనినిమాత్రము శరణుబొందుము. అట్లయిన నేను నిన్ను సమస్త పాపములనుండి విముక్తునిగా జేసెదను, దుఃఖింపకుము.

మనుమహర్షి సమస్తధర్మములను సంగ్రహించి ఆత్మజ్ఞానము, ఇంద్రియ నిగ్రహము, ప్రణవజపము అను మూడు విషయములనైన తప్పక యనుష్ఠించు విధమును ఉపదేశించెను. శ్రీకృష్ణభగవానుడు ఇంకను ధర్మములను సంక్షేపమొనర్చి యొక్క అనన్య భగవచ్చిన్తనమునే యుపదేశించెను. మనువు కృతయుగమందుండినవాడు. అందువలన పైజెప్పిన మూడు ధర్మములనైన ఆచరించు లాగున దెలిపెను.

శ్రీకృష్ణభగవానుడు ద్వాపరాంతమునందుండిన వాడగుటచే కాలగతి నాలోచించి మనువు చెప్పిన మూడు వాక్యములనుగూడ మానవుడనుష్ఠించలేడని తలంచి ఒక్క అనన్యభక్తి నైన గలిగియుండు లాగున నుపదేశించెను. ఇది శ్రీభగవద్గీత యొక్క యంతి మోపదేశము.(అ. 18 శ్లో॥ 66) గీతయొక్క ఋష్యాది న్యాసములలో దీనిని గీతయొక్క శక్తియనియు, గీతయొక్క కీలకమనియు తెలుపడమైనది.

''సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజే'' తి శక్తిః।
''అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ ఇతి కీలకమ్'' ॥

అనన్యభక్తి యనగా సామాన్యమని తలంచరాదు. దీనికే చరమశ్లోకమని పేరు గలిగియున్నది. హృదయములో నొకే దైవచింతన దప్ప, దైవ భావము దప్ప ఇతర సంకల్పములుగాని భావములుగాని జనింపగూడదు. ఇట్టివారికి భగవత్ప్రాప్తి గలుగుటకు గల విఘ్నము లన్నిటిని దొలగించి భగవానుడే మోక్షమును గలుగజేయును. సంశయము లేదు.

★★★

నాల్గవ భాగము

నిరతిశయానంద బ్రహ్మప్రాప్తి

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥

ఓమ్ శాన్తిః శాన్తిః శాన్తిః

పూర్ణం–అదః–పూర్ణం– ఇదం–పూర్ణాత్–పూర్ణం– ఉదచ్యతే – పూర్ణస్య – పూర్ణం – ఆదాయ – పూర్ణం – ఏవ – అవశిష్యతే॥

అదః = పరోక్షమగు పరబ్రహ్మము, పూర్ణం=అంతటను నిండి యున్నది, ఇదం= నామరూపాత్మకమై ప్రత్యక్షమగు బ్రహ్మము, పూర్ణం= పరమాత్మ రూపముతో నంతటను వ్యాపించియున్నది. పూర్ణాత్ = కారణబ్రహ్మమునుండి, పూర్ణం = కార్యబ్రహ్మము. ఉదచ్యతే = ప్రకట మగుచున్నది. పూర్ణస్య = కార్యాత్మక బ్రహ్మముయొక్క, పూర్ణం = ఆత్మస్వరూపత్వమును, ఆదాయ=గ్రహించి, పూర్ణమేవ=పరిపూర్ణ పరబ్రహమే, అవశిష్యతే=మిగులుచున్నది.

ఈ పరబ్రహ్మము, ఆకాశమువలె సర్వత్ర వ్యాపించి నిరుపాధికమై యున్నది. వ్యవహార యోగ్యమైన ఈ సోపాధిక బ్రహ్మము పరమాత్మ స్వరూపముతో వ్యాపించియున్నది. నిరుపాధిక కారణబ్రహ్మమునుండి సోపాధిక కార్యబ్రహ్మము ప్రకటమగుచున్నది. కార్యబ్రహ్మమునకు ఆత్మ స్వరూపైకరసత్వమును బొందించి (జ్ఞానముచే తత్తదుపాధిగత సంబంధ మును దూరీకరించి) పరిపూర్ణబ్రహ్మమే ప్రజ్ఞానఘనమై శేషించియున్నది. దోష త్రయ నివారణకొఱకు శాన్తిత్రయ మేర్పడినది అని మొదటనే వ్రాయడమైనది.

జాగ్రత్స్వప్న సుషుప్త్యాది ప్రపంచం యత్ప్రకాశతే ।
తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా సర్వబన్ధైః ప్రముచ్యతే ॥

జాగ్రత్స్వప్నసుషుప్తులు మొదలుగా గల ఈ దేహేంద్రియ ప్రపంచము

లను ఏ యాత్మ ప్రకాశింపజేయుచున్నదో, అట్టి యాత్మను పరమాత్మ స్వరూపముగా దెలిసికొనినవాడు సమస్త బంధములనుండి విముక్తుడై పర బ్రహ్మాకార స్థితి గలవాడగుచున్నాడు (కైవల్యోపనిషత్తు).

ఇట్టిభావన ఒక్కదానివలన సమస్తబంధములును, విఘ్నములును దొలగిపోవును. మొట్టమొదట అట్టి భావన గలుగుటకు కొంత ప్రయాసగా నుండినను ఎప్పటికినైన నిట్టి స్థితి గలుగనిచో బంధనములుగాని, విఘ్నములు గాని తొలగవు. నిరతిశయానంద బ్రహ్మప్రాప్తియు సిద్ధించదు. ఇది "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్యమునకు సంబంధించినది యగును.

గాలిలేని స్థలమున ప్రమిద, తైలము, వత్తియు నమర్చిన తదుపరి దీపమును వెలిగించిన నెట్లు వెలుగునో, ఆలాగున నిర్వాసనస్థలమను వాయువులేని ప్రదేశము, వైరాగ్య మను ప్రమిద, అనన్యదైవభక్తియను తైలమును ఏర్పడిన పిమ్మటనే "తత్త్వమసి" అను మహావాక్యము నుపదేశించిన "అహం బ్రహ్మాస్మి"యను జ్ఞానజ్యోతి వెలుగుచుండును. దీపము వెలిగిన వెంటనే చీకటి పారిపోవునట్లు ఆత్మజ్యోతి వెలిగిన తత్‌క్షణమే యవిద్య హృదయమునుండి వెడలిపోవును. ప్రమిద, తైలము, వత్తి సరిగా లేని గాలి గల స్థలములో వెయ్యి నిప్పుపుల్లలు గీచి వెలిగించినను దీపము మండని విధమున పైజెప్పిన నాలుగు సాధనలు గలుగనిచో "తత్త్వమసి" మహావాక్యము నెంతకాలము శ్రవణము చేసినను బ్రహ్మజ్ఞానోదయము గలుగదు. పూర్వీక ఋషులకును, వర్తమాన జనులకును ఇచటనే భేదమేర్పడినది. అందువలననే నాలుగు వేదముల సారమగు నాలుగు మహావాక్యములను ఇప్పుడుండు ముముక్షువులు శ్రవణ, మనన, నిదిధ్యాసనాదులు చేసియు ఫలమును బొందక పోవుచున్నారు. మఱియు ప్రస్తుత జనులలో చాలమంది శ్రవణము మాత్రము చేతనే తృప్తులగుచున్నారు. మనన, నిదిధ్యాసనలను జేయువారు చాల అరుదైరి. ఆ కారణమువలనను పూర్వీక ఋషుల స్థానమును బొందజాలరైరి.

దీనియందు మఱియొక రహస్యముగూడ గలదు. బంగారము, వెండి, రాగి, ఇత్తడి మొదలైన లోహములతో జేయబడిన ప్రమిదలైనను విరోధము

లేదు. తైలము, వత్తి, గాలిలేని ప్రదేశముండి వెలిగించినచో దీపము వెలుగుచుండును. అట్లయిన బదరికాశ్రమమునందుగాని, హృషీకేశమునందుగాని, కాశియందుగాని, స్వగృహమందుగాని యుండినను దీపము వెలుగును. పైసాధనలు నాలుగు గలిగి యుండినచో ఎచ్చోట నుండినను ఆత్మజ్ఞానజ్యోతి వెలుగును. లేనిచో నెచ్చట నుంచినను వెలుగదు. మఱియు నాలుగు విధములగు లోహములను చెప్పినట్లు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులైనను విరోధమేమియు లేదు. సాధనములు నాలుగింటిని కలిగి యుండిన చాలును. ఇంకను వినుడు. ఆ పాత్రలు ఎఱుపు, తెలుపు, పసుపు, నలుపు రంగులను కలిగియున్నను బాధ ఏమియు లేదు. ఆలాగుననే సన్న్యాసి, వానప్రస్థ, గృహస్థ, బ్రహ్మచారులైనను విరోధ ముండనేరదు. సాధనములు నాలుగు గలిగియుండిన చాలును.

> శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః
> శృణ్వంతోఽపి బహవో యం న విద్యుః ।
> ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా
> ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః ॥

ఈ ఆత్మ యనేకులచేత శ్రవణమునకును పొందబడుట లేదు. ఈ యాత్మను అనేకులు వినుచున్నను తెలిసికొనజాలరు. ఈ ఆత్మనుగూర్చి చెప్పువా రరుదు. ఈ ఆత్మను నిపుణముగా గ్రహించిన వారును అరుదు. నిపుణుడైన ఆచార్యునిచే సుశిక్షితుడైన జ్ఞాతయు అరుదు (కఠోపనిషత్తు).

వేలకొలది జనులలో పుణ్యవిశేషముచేతను, ఈశ్వరుని యనుగ్రహముచేతను ఆత్మసంస్కారము గల జీవు లరుదు. వారిలో నుత్తమ, మధ్యమ, మంద, తీవ్రాధికారులను తారతమ్య ముంటున్నది. కావుననే కొందరు శ్రవణము మాత్రమే చేయుదురు. మఱికొందరు మననమును గొంతవరకు శీలింతురు. ఇకకొందరు నిదిధ్యాసములోనికి ప్రవేశింతురు. సాక్షాత్కారము వరకు అనుష్ఠించువారు చాల అరుదుగా నుందురు. అయితే దీనియందొక రహస్యము గలదు. ఏ ఏ జన్మములో ఏయే స్థితిలోనికి

వచ్చునప్పు డేయే కారణములచే ఈ దేహము పతనమై పోయినను మఱల వచ్చెడి జన్మలో నిపుడు గలిగియుండు ప్రతిబంధములు లేని జన్మము తప్పక గలుగును. ఇది బ్రహ్మవిద్యానుష్ఠానములో గల ఫలితము. గీతయందును శ్రీకృష్ణభగవాను డీలాగున వచించెను-

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వే త్తి త త్త్వతః ॥

మనుష్యులలో వేలకొలది సంఖ్యలయం దొకానొకడు పూర్వపుణ్య విశేషములచే ఆత్మజ్ఞానసిద్ధికి యత్నించుచుండును. అట్లు యత్నము జేయువారలలో జ్ఞానసిద్ధిని బొందినవారిలో సయితము ఒకానొకడు నన్ను (పరమాత్మను) బొందగలుగుచున్నాడు.

ఇచటగూడ ప్రారంభించినవాడు పూర్ణత్వమును బొందక పోయినను విరోధము లేదు. పుణ్యాత్ముల లోకమును బొంది మఱల పూర్ణత్వమును బొందుటకు దగిన ప్రజ్ఞయు, జ్ఞానమును, బలమును గల జన్మము నొందును.

ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీస్సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥ అని గీత.

యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది శ్రితాః ।
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥ (కఠోపనిషత్తు)

ఎవనియొక్క అంతఃకరణములోగల సమస్త ప్రపంచ వాసనా రూపమగు వృత్తులు సంపూర్ణముగా వదలిపోవునో, అట్టి బ్రహ్మనిష్ఠు డిచటనే యమృతత్వమును బొందుచున్నాడు. ఈ దేహముతో గూడియున్నప్పుడే బ్రహ్మమును బొందుచున్నాడు అని కఠవల్లి శ్రుతి.

ముక్తియనగా విడుదల అని యర్థము. దేనినుండి విడుదల? ఆత్మ కనాత్మ వస్తువులతోగల బంధములనుండి విడుదల యని భావము. అది ఇచట జీవించి యున్నప్పుడే గలుగవలయును. కావుననే ఆ ముక్తి జీవన్ముక్తి అని పేర్కొనబడినది. మరియు ''అత్ర బ్రహ్మ సమశ్నుతే'' అని చెప్పబడినది.

ఏకాకీ రమతే నిత్యం స్వభావగుణవర్జితః

ఎవ డేకాంతమునందు ఏకాకియై ఇదివరలో గలిగియుండు ప్రకృతి గుణములను విడిచి బ్రహ్మజ్ఞానామృతముచే తృప్తుడగునో వాడు జీవన్ముక్తుడని వచింపబడుచున్నాడు అని జీవన్ముక్త గీత.

స్వభావగుణ మనగా నిది నా జాతిస్వభావము, నా దేహ స్వభావము, నా వాక్కుయొక్క స్వభావము, నా యాశ్రమస్వభావము, నా మానసిక స్వభావము, నాదేశస్వభావము అని యీలాగున స్వభావమును గురించి గొప్పగా జెప్పుకొనువారు కొంతమంది గలరు. ఈ స్వభావములను త్యజించ వలయు నని విజ్ఞు లుపదేశించినను, ఇది నా పూర్వజన్మకర్మస్వభావమని వీరముగా బలుకువారుగూడ లేకపోలేదు. ఆత్మజ్ఞాని యీ స్వభావమును దేహసంబంధము, మానసిక స్వభావమని తలంచి అతని అనాత్మ స్వభావము గలవానినిగా గుర్తించి ఆత్మయొక్క స్వభావము బొత్తిగా తెలియని వాడనియే తలంచును.

ఆత్మానాత్మ విచారణచే, పైజెప్పిన స్వభావము లన్నియు అనాత్మ స్వభావములని త్యజించి, తన యాత్మస్వరూపముయొక్క లక్షణమును గ్రహించుకొన్నప్పుడే ముక్తి గలుగును. అట్లుగాక ఒకడు ధరించియుండు తెలుపు, నలుపు , ఎఱుపు, పసుపు రంగులుగల ఉడుపులను జూచి నీ వెవరవని యడిగినచో తాను ధరించిన యుడుపుల యాకృతిని రంగులను జూపి అదే తానని చెప్పినచో అట్టి వానిని జూచి జనులేమి తలంతురు? ఇతడు పిచ్చివాడని గ్రహింతురు. అట్టి భ్రమలేని మానవుండైన తన పేరును, జాతినిమాత్రమే చెప్పును. ఆలాగున అజ్ఞానభ్రాన్తిగల మానవుడు పైజెప్పిన స్వభావము తానని వచించును. ఈ విషయమై శంకరాచార్యులు తెలిపినది చూడుడు—

శ్లో ।

స్వభావస్సచ్చిదానందనిత్యనిర్మలతాఽఽత్మనః ॥

సూర్యునకు ప్రకాశమును, నీళ్ళకు చల్లదనము, అగ్నికి ఉష్ణత్వమును స్వతస్సిద్ధమైన స్వభావ మైనట్లు, ఆత్మకు సత్ చిత్ ఆనందాదులే స్వభావమని ముముక్షువు తెలిసికొనవలయును.

ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।
ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥

ప్రశాన్తమైన మనస్సు గలవాడును, రజోగుణము నశించినవాడును, కల్మషరహితుడును, బ్రహ్మమే తనయాత్మ యను నిశ్చయము గలవాడు నగు యోగిని ఉత్తమమైన నిరతిశయానందము వచ్చి పొందును.

ఈశ్లోకమున చెప్పిన గుణములు గలవానిని నిరతిశయానందము స్వయముగా వచ్చి వరించునని తెలుపడమైనది. విరక్తుడై యాత్మనిష్ఠ గలవాడు మోక్షముకొఱకు ప్రయత్నింప నక్కరలేదు. మోక్షము వచ్చి వీనిని వరించును. ఇట్టి విరాగిని బ్రహ్మనిష్ఠుని ముక్తికాంత స్వయముగా వచ్చి వరించును. అట్లు గానివాడు మోక్షము కొఱకు వెదకి వెదకి ప్రార్థించినను లభించదు. రాచకన్య ధీరుడైన రాకుమారుని వరించునేగాని, రోగిష్ఠుడు, హీనకుల సంజాతుడగు వాడు కోరినను దొరకునా? మోక్షలక్ష్మి యను ముక్తికాంతయొక్క స్థితి యీలాగున నుండును. మఱియు బ్రహ్మచర్య వ్రతనిష్ఠ గలవాడును, వేదాధ్యయన పరుడును, ఇంద్రియజయము గలవాడును నగు బ్రాహ్మణునికి శ్రేష్ఠకులజాలు శ్రీమంతులును నగు విప్రులు సుగుణనిధియు, విద్యావతియునగు తమకన్నెను దానము చేయుదురేగాని హీనజాతి సంజాతుడును, దుర్గుణభూయిష్ఠుడునగు వాడెంత ధనమిచ్చినను, ప్రాధేయ పడినను ఇవ్వనేర్తురా? బ్రహ్మజ్ఞానముయొక్క స్థితియు నీలాగున నుండును.

అచ్యుతోఽహమనన్తోఽహం గోవిందోఽహమహం శివః ।
ఆనన్దోఽహమశేషోఽహమజోఽహమమృతోఽస్మ్యహమ్ ॥

నిత్యోఽహం నిర్వికల్పోఽహం నిరాకారోఽహమవ్యయః ।
సచ్చిదానందరూపోఽహం పరిపూర్ణోఽస్మి సర్వదా ॥

బ్రహ్మైవాహం న సంసారీ ముక్తోఽహమితి నిశ్చయః ।
శుద్ధబోధస్వరూపోఽహం నిర్మలోఽహం సనాతనః ॥

నేనచ్యుతుండను, నేననంతుండను, నేను గోవిందుడను, నేను శివుడను, నే నానందస్వరూపుడను, నే నశేషుండను, నే నజుడను, నే నమృత స్వరూపుడను అగుచున్నాను. నేను నిత్యుండను, నేను నిర్వికల్పస్వరూపుడను, నేను నిరాకారుండను, నే నవ్యయుండను, నేను సచ్చిదానంద స్వరూపుడను, నే నెల్లప్పుడు పరిపూర్ణ స్వరూపుండనుగా నుంటున్నాను. నేను పరబ్రహ్మస్వరూపుడను, నేను సంసారినిగాను, నేను ముక్తుండను. ఇది నిశ్చయము. నేను శుద్ధబోధస్వరూపుండను, నేను నిర్మలుండను, నేను సనాతనుడనై యుంటున్నాను. ఇట్లు శ్రీవేదవ్యాసులు మానసిక స్నానవిధి యందు భావనచేయుట కుపదేశించిరి. ఇట్టి బ్రహ్మభావనవలననే జీవుని యొక్క అజ్ఞానము నశించునుగాని వేరుమార్గమున నశించదు. జలస్నానముచే దేహమలము నశించునేగాని ఆత్మమలము నశించదు.

ధ్యానహ్రదే జ్ఞానజలే రాగద్వేషమలాపహే ।
యః స్నాతి మానసే తీర్థే స యాతి పరమాం గతిమ్ ॥

ధ్యానమను అగాధమగు మడుగునందు, రాగద్వేషములనెడి మలినమును పోగొట్టు జ్ఞానజలమందు ఎవడు స్నానమాచరించునో అతడు అజ్ఞానమను మాలిన్యము లేనివాడై సర్వోత్తమమగు బ్రహ్మమును బొందుచున్నాడు.

కావున బాహ్యతీర్థములలో స్నానమాచరించినందుచే కృతార్థుడనైతినని తలంచి మోసపోక ఆత్మతీర్థములో స్నానము చేయులాగున జూడ వలయును. భారతమున ధర్మరాజు, భీష్ముని తీర్థమాహాత్మ్యమును అడిగి నప్పుడు సమస్తతీర్థములయొక్క మహిమయు, స్నానవిధియు, అనంతరము జేయవలసిన దాన ధ్యానములను గుఱించి తెలిపి చివరి కీయాత్మతీర్థమును గురించిన ఒక శ్లోకము నుపదేశించెను. తీర్థయాత్ర చేయువారు స్నానము, దానము, ధ్యానము అను నంతిమ నకారత్రయమును గలిగి యుండవలయు

నని వచించిరి. శాంతిపర్వమున భీష్ముడు చెప్పిన శ్లోకము-

ఆత్మానదీ సంయమతోయపూర్ణా సత్యహ్రదా శీలతటాదయోర్మిః ।
తత్రావగాహం కురు పాణ్డుపుత్ర న హ్యన్యథా శుధ్యతి చాంతరాత్మా ॥

ఆత్మ యనునది యింద్రియముల సంయమమను జలములతో నిండినది. సత్యమను మడుగుతో గూడినది. పవిత్రశీలమను తీర్థములతో గూడినది. జీవరాసులలో కరుణయను నలలతో గూడినది. ఓ ధర్మరాజా! అట్టి నదిలో స్నానమాచరింపుమా! వేరు ఏ విధమైన దానివలనను అంత రాత్మశుద్ధి కాజాలదు.

ఆత్మా క్షేత్రజ్ఞసంజ్ఞోఽయం సంయుక్తః ప్రాకృతైర్గుణైః ।
తై రేవ విగతశ్శుద్ధః పరమాత్మేతి గద్యతే ॥

ఆత్మయనియు, జీవాత్మయనియు, క్షేత్రజ్ఞుడనియు పేరు గల ఈ యాత్మవస్తువు ప్రకృతిగుణములను సత్త్వరజస్తమస్సులచే బద్ధుడై జీవుడను పేరు గలిగియుండును. అట్టి ప్రకృతిసంబంధ త్రిగుణములనుండి బ్రహ్మ నిష్ఠానుష్ఠానముచే శుద్ధుడై విడుదల పొందునప్పుడు పరమాత్మ యని చెప్ప బడుచున్నది అని విష్ణుపురాణము.

ప్రకృతితో గూడియున్నప్పుడు జీవుడనియు, ప్రకృతినుండి విముక్తిని బొందినప్పుడు శివుడనియు గ్రహించదగినది. ఈవిషయమై యిదివరలో అపరంజి బంగారపు దృష్టాంతము తెలుపడమైనది.

యల్లాభాన్నాపరో లాభో యత్సుఖాన్నాపరం సుఖమ్ ।
యజ్జ్ఞానాన్నాపరం జ్ఞానం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥

ఏ యాత్మలాభముకంటె అనగా బ్రహ్మప్రాప్తికంటె వేరు లాభము లేదో, యే జ్ఞానసుఖముకంటె వేరుసుఖము లేదో, యే యొక్క జ్ఞానమును తెలిసికొనుటకంటె వేరుగ తెలియందగినది లేదో, అదియే బ్రహ్మమని నిశ్చయముగా తెలిసికొనవలయును అని యాత్మబోధము.

బ్రహ్మప్రాప్తికి మించిన లాభముగాని, సుఖముగాని, జ్ఞానముగాని మఱియొకటి లేదని గ్రహించినవాడే ఆత్మజ్ఞానముయొక్క మహిమను ఎఱింగినవాడు. ఏలన తక్కినవన్నియు నశించును. ఈ యాత్మజ్ఞాన మొక్కటియే నాశము లేనిది.

జ్ఞానయజ్ఞోడుపేనైవ బ్రాహ్మణో వాఽన్త్యజోఽపి వా ।
సంసారసాగరం తీర్త్వా ముక్తిపారం హి గచ్ఛతి ॥

ఆత్మనిష్ఠాపరమగు జ్ఞానయజ్ఞమనెడి యోడచే బ్రాహ్మణుడైనను సరి, అంత్యజుడైనను సరి ఈ దుఃఖసాగరమను సంసారమునుండి తరించినవాడై నిత్యశాంతియు, శాశ్వతసుఖమగు మోక్షమును బొందగలుగును.

బ్రహ్మజ్ఞానము గలవా డెవ్వడైనను సంసారసాగరమును దాటి మోక్షపుదరిని జేరగలుగును.

ధర్మమేఘమిమం ప్రాహుస్సమాధిం యోగవిత్తమాః ।
వర్షత్యేష యతో ధర్మామృతధారాస్సహస్రశః ॥ (పంచదశి)

బ్రహ్మజ్ఞానులగు మహాత్ములు నిర్వికల్పసమాధిని (ఆత్మసాక్షాత్కార జ్ఞానమును) ధర్మమేఘమునుగా వర్ణించియున్నారు. మేఘము కుంభవృష్టి చేయునట్లు ఈనిర్వికల్పసమాధి పుణ్యలక్షణములైన యమృతధారలను అపరిమితముగాను, సహస్ర సంఖ్యాకములుగాను వర్షించుచున్నది.

ఇట్టి మహిమాతిశయ మీ యాత్మజ్ఞానమునందు లేనిచో రారాజులు, చక్రవర్తులు సహా వార్ధక్య దశారంభమునందు రాజ్యమును, రాజభోగమును త్యజించి వనమునకేగి యోగనిష్ఠ నవలంబింతురా?

ధన్యోఽహం ధన్యోఽహం నిత్యం స్వాత్మానమంజసా వేద్మి ।
ధన్యోఽహం ధన్యోఽహం బ్రహ్మానన్దో విభాతి మే స్పష్టమ్ ॥

సర్వదా నాయొక్క నిజరూపమగు దేశకాలాద్యనవచ్ఛిన్న ప్రత్య గాత్మను సాక్షాత్తుగా నెఱిగితిని. అందువలననే నేను కృతార్థుడనైతిని.

కృతార్థుడనైతిని. మఱియు బ్రహ్మస్వరూపమగు ఆనందము నాకు స్పష్టముగా స్ఫురించుచున్నది. అందువలన నేను కృతార్థుడనైతిని. నేను కృతార్థుడనైతిని.

ధన్యోఽహం ధన్యోఽహం దుఃఖం సాంసారికం న వీక్షేఽద్య ।
ధన్యోఽహం ధన్యోఽహం స్వస్యాజ్ఞానం పలాయితం క్వాపి ॥

మఱియు నిప్పుడు దుఃఖస్వరూపమగు సంసారమును నేను చూచు చున్నవాడను గాను. అందుచే నేను కృతార్థుడనైతిని. నేను కృతార్థుడనైతిని. నాయొక్క అనేక జన్మకర్మవాసనా సమూహము గల అజ్ఞానము ఎక్కడనో పారిపోయెను (నశించెను). అందుచేత నేను కృతార్థుడ నైతిని. నేను కృతార్థుడ నైతిని.

ధన్యోఽహం ధన్యోఽహం కర్తవ్యం మే న విద్యతే కించిత్ ।
ధన్యోఽహం ధన్యోఽహం ప్రాప్తవ్యం సర్వమద్య సంపన్నమ్ ॥

మఱియు నాకు జేయందగినది కొంచెమైనను ఇప్పుడు లేనందున నేను కృతార్థుడ నైతిని. నేను కృతార్థుడ నైతిని. మఱియు పొందదగిన ఫలవర్గ మంతయు ఇప్పుడు నాచే పొందబడినట్లాయెను కనుక నేను కృతార్థుడ నైతిని. నేను కృతార్థుడ నైతిని.

ధన్యోఽహం ధన్యోఽహం తృప్తేర్మే కోపమా భవే లోకే ।
ధన్యోఽహం ధన్యోఽహం ధన్యో ధన్యః పునః పునర్ధన్యః ॥

మఱియు నాయొక్క తృప్తికి సమానమైన వస్తువెద్దియు లోకము నందు లేదు. అందువలన నేను ధన్యుడ నైతిని. నేను ధన్యుడ నైతిని. ఈ తృప్తికంటె మఱి యొకటి చెప్పందగినది కనబడని కారణముచేత నేను కృతార్థుడ నైతిని. నేను కృతార్థుడ నైతిని. మాటిమాటికి కృతార్థుడ నైతిని. నేను కృతార్థుడ నైతిని, కృతార్థుడ నైతిని.

అహో పుణ్యమహో పుణ్యం ఫలితం ఫలితం దృఢమ్ ।
అస్య పుణ్యస్య సంపత్తే రహో వయమహో వయమ్ ॥

అహో! నాయొక్క పుణ్యము దృఢముగా ఫలించెను. ఓహో! నా యొక్క పుణ్యము దృఢముగా ఫలించెను. ఈ పుణ్యసంపత్తివలన నోహో మేము ధన్యులము, అహో మేమే ధన్యులము.

అహో శాస్త్రమహో శాస్త్రమహో గురురహో గురుః ।
అహో జ్ఞానమహో జ్ఞానమహో సుఖమహో సుఖమ్ ॥

(దత్తాత్రేయోపనిషత్తు.)

వేదాంతశాస్త్ర మెంత మనోహరము! వేదాంతశాస్త్రము ఓహో, ఎంత సారమైనది! ఓహో, వేదాంతగురు వెంత గొప్పవాడు! ఓహో, మాగురు వెంతగొప్పవాడు! ఓహో, అద్వైతాత్మ తత్త్వజ్ఞానమెంత మంచిది! అహో, అద్వైతాత్మ తత్త్వజ్ఞానమెంత సారమైనది! ఓహో మా యాత్మసుఖ మెంత గొప్పది! ఓహో! మా సుఖ మెటువంటిది; ఓహో! ఆశ్చర్య మాశ్చర్యము!!

దత్తాత్రేయులకు కలిగిన యానందావిర్భావము పట్టజాలక తాండవము చేసి యిట్లు వచించిరి. నిరతిశయానందమనియు, అతిహర్ష మనియు దీనికి పేరుగలదు. అందువల్ల ద్విరుక్తప్రయోగ మిచ్చోట దోషము గాదు. ఆత్మజ్ఞానముయొక్క మహిమ యెట్టిదియో దీనివలన తెలిసికొన వచ్చును. ఇట్టి మహిమ దీనియందు లేనిచో శ్రీబుద్ధ, శ్రీశంకర, శ్రీదయానంద, శ్రీవివేకానంద ప్రభృతులు బాహ్యలోకమును త్యజించి, ఆత్మలోకములో ప్రవేశింతురా?

వాఞ్ఛంతి జన్మ మానుష్యం భువి దేవాశ్శతక్రతుః ।
చిద్విద్యాయాం పరోఽపాస్తో యతో నాన్యోఽధికారభాక్ ॥

ఇంద్రుడును, దేవతలును ఎప్పుడెప్పుడు భూలోకములో మనుజ జన్మము లభించునాయని వాంఛించుచుందురు. ఏలన బ్రహ్మవిద్యను సాధించి ముక్తిని బొందుటకు మనుష్యశరీరము తప్ప వేరు ఏ జన్మము నెత్తినవారికిని సాధ్యపడదు.

దీనివల్ల మానవజన్మముయొక్క మహిమ యెట్టిదో తెలిసికొనవచ్చును. దేవతలు ఒకానొకప్పుడు భూలోకమున మనుష్యులై యుండి యజ్ఞాది క్రతువు లొనర్చి స్వర్గలోకమును బొందిరి. ''క్షీణేపుణ్యే మర్త్యలోకం విశ న్తి'' ఆ పుణ్యము నశించిన మఱల భూలోకములో మనుష్యులై పుట్టవలసి యుందురు. ఇచటనే తపమొనర్చి జ్ఞానమును బొంది ముక్తులు గావలసి యున్నారు. ఈ విషయమై కఠోపనిషత్తు నుడివినది చూడుడు-

యథా స్వప్నే తథా పితృలోకే।
యథాఽప్సు పరీవ దదృ శే తథా గన్ధర్వలోకే
ఛాయాఽఽతపయోరివ బ్రహ్మలోకే॥

ఏవిధముగా అద్దమునందు తన ప్రతిబింబము స్పష్టముగా గనబడు చున్నదో, అదే విధముగా నిర్మలమైన మనుష్యబుద్ధియందు ఆత్మదర్శనము స్పష్టముగా నగుచున్నది. స్వప్నమునందు తన దేహమేలాగున వికార రూప ముగా కనబడుచుండునో, పితృలోకమందును అలాగుననే యుండును. నీటియందు తనముఖ ప్రతిబింబము స్పష్టముగా దెలియక ఎట్లు విభ క్తావయువములుగ కనబడుచుండునో, అట్లే గన్ధర్వలోకమున (స్వర్గ లోకమున) ఆత్మదర్శనము స్పష్టముగా గలుగజాలదు. మఱియు బ్రహ్మలోక మందుగూడ ఛాయాఽఽతపములవలె అనగా తనయొక్క నీడవలె అస్పష్టముగానే కనబడును. కావున దీనిని బట్టి యాలోచించిన మానవుని జన్మ యెట్టి గొప్పతనమును గలిగినదో గ్రహించుకొనవచ్చును.

కుక్కకు టెంకాయ దొరకినట్లును, కోతికి రత్నహారము లభించి నట్లును సామాన్యమానవులు మానవ జన్మము దొరకియు దానిచే బొందెడి ఫలమును బొందకయున్నారు.

సృష్ట్వా పురాణి వివిధాన్యజయాఽఽత్మశక్త్యా
వృక్షాన్ సరీసృపపశూన్ ఖగదంశుమత్స్యాన్।

తైస్తైరతుష్టహృదయః పురుషం విధాయ
బ్రహ్మావలోకధిషణ ముదమాప దేవః ॥

బ్రహ్మదేవుడు తనశక్తిచే వృక్ష, సర్ప, పశు, పక్ష్యాది వివిధ జంతువులను సృజించి సంతోషింపక, మానవుని సృజించి యతడు పరబ్రహ్మస్వరూపమును తెలిసికొనుటకు తగిన బుద్ధిగలవాడని తలంచి సంతసించెను అని భాగవతము.

బ్రహ్మదేవుడు సమస్త చరాచర ప్రాణికోటు లన్నిటిని సృష్టించిన తదుపరి వాటికి, వేటికిని ఆత్మజ్ఞానస్వరూపమును తెలిసికొనెడి శక్తి లేకపోవుట చేత తనసృష్టి నిరుపయోగమైనది గదా యని తలంచి విషాదపడెనట. తరువాత మఱింత తపస్సుచేసి, ఆత్మశక్తిని కేంద్రీకరించి బ్రహ్మస్వరూపమును తెలిసికొనే లాగున మానవుని సృష్టించెను. అతనిని పరీక్షించి బ్రహ్మావలోకమును జేయందగిన బుద్ధిగలవాడని తలంచి, ఇప్పుడు తన సృష్టి సార్థక మైనదని తలంచి యానంద భరితుడాయెను. పైకఠోపనిషత్తు వాక్యమును ఈ భాగవత వాక్యమును గ్రహించిన మానవజన్మయొక్క యుత్కృష్టత గ్రహించుకొనవచ్చును. శ్రీశంకర భగవత్పాదాచార్యులవారు ''జంతూనాం నరజన్మ దుర్లభమ్'' అనియు, ఉత్తరగీతయందు శ్రీకృష్ణభగవానుడు:-

ఆహారనిద్రాభయమైథునాని సామన్యమేతత్పశుభిర్నరాణామ్ ।
జ్ఞానం నరాణామధికో విశేషో జ్ఞానేన హీనాః పశుభిస్సమానాః ॥

అనియు వచించిరి. మరియు ''దుర్లభో మానుషో దేహః ప్రాణినాం క్షణభంగురః'' అని భాగవతము తెలుపుచున్నది. ఇక నీ విషయమై యెన్నియో ప్రమాణములు గలవు.

అహం బ్రహ్మేతి వాక్యార్థబోధో యావద్దృఢీభవేత్ ।
శమాది సహితస్తావదభ్యసేచ్ఛ్రవణాదికమ్ ॥

బ్రహ్మాత్మైక్యజ్ఞానము దృఢముగ గలుగువరకు శమదమాది ధర్మములతో గూడినవాడై వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసములను బ్రహ్మనిష్ఠులు తప్పక యభ్యసింపవలయును.

రోగియైనవాడు సంపూర్ణారోగ్యము గలుగువరకు ఔషధపథ్యాదులెట్లు గలిగియుండవలయునో, ఆలాగున భవరోగముగల జీవులుగూడ ప్రకృతిదోషము నశించువరకు బ్రహ్మాభ్యాసము, ఆహార నియమము, నివాసస్థల యోగ్యతయు గలిగియుండవలయును. పూర్వీక ఋషులాలాగున నుండిరి. వర్తమాన ముముక్షువు లట్లు చేయకపోవుటయే సంపూర్ణ భవరోగ విముక్తులు గాకపోవుటకు గారణము.

భావితం తీవ్రవేగేన యద్వస్తు నిశ్చయాత్మనా ।
పుమాం స్తద్ధి భవేచ్ఛీఘ్రం జ్ఞేయం భ్రమరకీటవత్ ॥

నిశ్చయబుద్ధి గలవానిచేత నేవస్తువు తీవ్రవేగముతో రేయింబవళ్ళు భావింపబడుచున్నదో అట్టి జ్ఞేయవస్తువును భ్రమరకీటకమువలె నతడు పొందుచున్నాడు (అపరోక్షానుభూతి).

కీటకము ఎడతెగక భ్రమరమును భావనచేయుటచే తుమ్మెదగా మారునట్లు జీవుడున్ను ఎడతెరపిలేక బ్రహ్మభావన చేయుచుండవలయును.

అఖండైక రసం బ్రహ్మ చాఖండైకరసం వ్రతమ్ ।
అఖండైక రసో జీవ శ్చాఖండైకరసో హ్యజః ॥ 1

అఖండైక రసో బ్రహ్మ చాఖండైక రసో హరిః ।
అఖండైక రసో రుద్ర శ్చాఖండైక రసోఽస్మ్యహమ్ ॥ 2

అఖండైక రసో హ్యాత్మా హ్యఖండైక రసో గురుః ।
అఖండైక రసం లక్ష్యమఖండైక రసం మహః ॥ 3

అఖండైక రసో దేహ శ్చాఖండైక రసం మనః ।
అఖండైక రసం చిత్తమఖండైక రసం సుఖమ్ ॥ 4

అఖండైక రసం కించి దఖండైక రసం పరమ్ ।
అఖండైక రసాదన్యత్ నాస్తి నాస్తి షడానన ॥

అఖండైక రసం సర్వం చిన్మాత్రమితి భావయేత్ ।
చిన్మాత్రమేవ చిన్మాత్రమఖండైకరసం పరమ్ ॥

భవవర్జిత చిన్మాత్రం సర్వం చిన్మాత్రమేవ హి ।
ఇదం చ సర్వం చిన్మాత్రమయం చిన్మయమేవ హి ॥

చిత్తవృత్తివిహీనోఽహం చిదాత్మైకరసోఽస్మ్యహమ్ ।
సర్వదృశ్యవిహీనోఽహం దృగ్రూపోఽస్మ్యహమేవ హి ॥

చిద్రూపమాత్రబ్రహ్మైవ సచ్చిదానందమద్వయమ్ ।
ఆనందఘన ఏవాహమహం బ్రహ్మాస్మి కేవలమ్ ॥

సత్యానందస్వరూపోఽహం జ్ఞానానందఘనోఽస్మ్యహమ్ ।
విజ్ఞానమాత్రరూపోఽహం సచ్చిదానంద లక్షణః ॥

బంధముక్తి విహీనోఽహం శాశ్వతానంద విగ్రహః ।
ఆదిచైతన్యమాత్రోఽహ మఖండైక రసోఽస్మ్యహమ్ ॥

ముక్తోఽహం మోక్షరూపోఽహం నిర్వాణసుఖరూపవాన్ ।
నిత్యవిజ్ఞానమాత్రోఽహం సన్మాత్రానందవానహమ్ ॥

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం దేహదోషం వినాశయేత్ ।
అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం జన్మపాపం వినాశయేత్ ॥

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం మృత్యుపాశం వినాశయేత్ ।
అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం ద్వైతదుఃఖం వినాశయేత్ ॥

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం భేదబుద్ధిం వినాశయేత్ ।
అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం చిన్తాదుఃఖం వినాశయేత్ ॥

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం కోటిదోషం వినాశయేత్।

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం జ్ఞానానందం ప్రయచ్ఛతి ॥ 4

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం సర్వశోకం వినాశయేత్ ।
అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం దృశ్యపాపం వినాశయేత్ ॥ 5

అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం క్రోధశక్తిం వినాశయేత్ ।
అహంబ్రహ్మాస్మి మంత్రోఽయం బుద్ధివ్యాధిం వినాశయేత్ ॥ 6

(ధ్యానబిందూపనిషత్తు.)

ఇది ధ్యానానంతరము పగలు పారాయణచేయుటకు తగినది. అర్థము సులభగ్రాహ్య మగుటచేత తాత్పర్యము వ్రాయలేదు.

అనాదిమాయయా సుప్తో యదా జీవః ప్రబుధ్యతే ।
అజమనిద్రమస్వప్నమద్వైతం బుధ్యతే తదా ॥

(మాండూక్య ఉపనిషత్తు)

ఈ జీవుడెప్పుడు మాయారూపమైన నిద్రనుండి మేలుకొనుచున్నాడో అప్పుడే జన్మాదులు లేని అద్వయస్వరూపమైన స్వయంప్రకాశకమగు నాత్మను తెలిసికొనుచున్నాడు(పొందుచున్నాడు).

మానవు డెంతవరకు నిద్రయందున్నాడో అంతవరకు తానెవ్వడు, ఎచ్చట నుంటున్నాడు, దేనికై యేతెంచెను అను మూడు విషయములను తెలిసికొనజాలడు. నిద్రనుండి మేల్కాంచిన వెంటనే తానెవ్వడు, ఎచటనున్నాడు, ఎందులకై వచ్చెను- ఇవన్నియు నెఱుంగుచున్నాడు. ఆలాగున మాయా మోహముండువర కాత్మస్వరూప మిట్టిదనియు, జన్మమునకు గారణమును, జన్మాంతరస్థితియును తెలిసికొనలేడు. ఇది అందరికిని ననుభవమే. పండితుడైనను, సార్వభౌముడైనను, సన్న్యాసియైనను, గృహస్థుడైనను, స్త్రీయయినను, పురుషుడైనను, అగ్రజన్మము గలవాడైనను, అంతిమ కులజాండైనను, ఆత్మప్రబోధ జ్ఞానోదయము గలుగువరకు నెవ్వరును తన నిజస్వరూపము నెఱుంగజాలరు.

మఱియు నిద్రలో నుండువారు పై నిరూపించిన వారైనను నిద్రలో నుండు మరియొకనిని ఎట్లు లేపంజాలరో, నిద్రనుండి లేచినవాడు పైజెప్పిన వేలాదిజనులను నిద్రనుండి యెట్లు లేపగలుగునో, ఆలాగున ఆత్మ ప్రబోధము గలుగనివాడు అజ్ఞాననిద్రలో నుండువారిని ప్రబోధము గావించ జాలడు. గురువులుగా నుండు వారందరును ఈసత్యము నెరుంగవలయును.

ఇది బ్రాహ్మణాది జాతులకును, సన్న్యాసాది ఆశ్రమములకును, స్త్రీ పురుషులకును సంబంధించినది గానేరదు. కావున సన్న్యాసియే గురువుగా నుండవలయును. బ్రాహ్మణుడే యుపదేశాధికారము గలిగియుండవల యును. పురుషుడే అర్హుడు అని చెప్పునది సరిగాదు. దేహధర్మము లన్నియు గురుత్వమునకు సంబంధించినవి గావు. ఆత్మప్రబోధమే కారణమని గ్రహించుకొనవలయును. ఔషధమును, రోగమును ఎరిగినవాడే వైద్యుడు గాని తక్కినవారెవరును కానట్లు ఈ బ్రహ్మోపదేశవిషయము గూడ తెలిసికొనవలయును.

ఘటమధ్యే యథా దీపో బాహ్యే నైవ ప్రకాశతే।
భిన్నే తస్మిన్ ఘటే చైవ దీపజ్వాలా చ భాసతే॥
స్వకాయం ఘటమిత్యుక్తం యథా జీవో హి తత్పదమ్।
గురువాక్యసమాభిన్నే బ్రహ్మజ్ఞానం ప్రకాశతే॥

ఏలాగున కుండలోనుండు దీపము బాహ్యమున ప్రకాశింపనేరదో, అట్టి ఘటమును భేదించిన దీపజ్వాల యేలాగున బాహ్యమునకు ప్రకాశించునో, ఆలాగున హృదయగుహయందు ఆవరింపబడియుండు అజ్ఞానమునకు ఘటమని పేరు. దానియందు వెలుగుచుండు ప్రజ్ఞాన స్వరూపమై యుండు ఆత్మను దీపమని గ్రహించవలయును. గురుబోధైక జ్ఞానమనెడి దండముచే ఉపాధిని పగులగొట్టునప్పుడు పరబ్రహ్మస్వరూప మగు జ్ఞానజ్యోతి ప్రకాశించును.

కొందరు ఆత్మ స్వప్రకాశస్వరూప మైనది కావున దానిని తెలిసి

కొనుటకు మఱియొక సాధనమేలయని యడుగుచున్నారు. ప్రకాశించు చుండు దీపమును ప్రకాశింపజేయుటకు మరియొక దీప మేలాగున అవసరము లేదో ఆలాగున మరియొక గురు వవసరము లేదని వచింతురు. ఇక కొందరు ఘటములోపల దీపము వెలుగుట సత్యమైనను, ఘటావరణ మును ధ్వంస మొనర్చకపోయిన దీపముండియు నేలాగున ప్రయోజనము లేదో, అది ప్రకాశింపజాలదో, ఆలాగున అజ్ఞానరూపమగు ఆవరణమును రహిత మొనర్చుటకు దగిన యనుష్ఠాన మవసరమనియు, గురువాక్య ముండవలయుననియు జెప్పుదురు. ఈ మూలశ్లోకమున, "గురువాక్య సమాభిన్నే బ్రహ్మజ్ఞానం ప్రకాశతే" అని యుండుటవలన గురువాక్య మవసరమని తేలుచున్నది. పైవాక్యద్వయమునకు ఈ శ్లోకమున సమాధానము గలదు. ఆత్మ స్వప్రకాశ మైనదియు సత్యమే. ఆవరణ గలిగియుండుటయు నిజమే యగుచున్నది.

అహెూ జ్ఞానస్య మాహాత్మ్యం మయా వక్తుం న శక్యతే ।
అత్యల్పోఽపి యథా దీపస్సుమహన్నాశయేత్తమః ॥
జ్ఞానాభ్యాస స్తథాఽల్పోఽపి మహత్పాపం వ్యపోహతి ॥

ఆత్మజ్ఞానమును గురించి సాక్షాచ్ఛంకరుడు సూతసంహితయందు వర్ణన చేయుచున్నాడు. ఓహెూ! పరమాశ్చర్యము. జ్ఞానముయొక్క మహి మను జెప్పుటకు నాకే యలవిగాదు. దీపము చిన్నదైనను గృహాంత రాళములోనుండు గొప్పదగు చీకటిని ఏలాగున విలయ మొందించునో ఆలాగున నీ యాత్మజ్ఞానాభ్యాసము కొంచెమైనను అజ్ఞాన మనెడి మహాపాప మును విలయ మొందింప గలుగును.

జ్ఞానముయొక్క మహిమను గుఱించియు, అభ్యాసముయొక్క ప్రయోజనమును గుఱించియు మహేశ్వరుండు సనకాది యోగుల కుపదేశించినది చూడుడు-

యథా వహ్నిర్మహాదీ ప్తశ్శుష్కమార్ద్రంచ నిర్దహేత్ ।
తథా శుభాశుభం కర్మ జ్ఞానాగ్నిర్దహతి క్షణాత్ ॥

ఏలాగున మిక్కిలి ప్రజ్వలించుచున్న యగ్ని యెండినను గాని, ఎండ కుండినను గాని కట్టెలనన్నింటిని భస్మ మొనర్చుచుండునో, అలాగున ఈ జ్ఞానాగ్ని పాపపుణ్యములనెడి కర్మకట్టెల నన్నింటిని దహింపజేయుచుండును.

పుణ్యపాపములను గూడ జ్ఞానాగ్ని దహింపజేయునని చెప్పుటలో వేదాంతతత్త్వము లెస్సగా తెలియని వారికొక సందేహము కలుగును, "పుణ్యముగూడ నశించునా? పుణ్యముకొఱకుగదా ఈసత్కర్మలను మనము చేయుచున్నా"మని తోచును. ఇచట సకామముగా జేసిన పుణ్యకర్మగూడ పునర్జన్మమునకు హేతువగుచున్నది. మంచి విత్తనముగాని, చెడువిత్తనము గాని భూమిలో పాతినచో రెండింటికిని నంకురించు స్వభావ మెట్లు గలిగియుండును? వేగిన విత్తనములైనచో అంకురించక జీర్ణించి పోవును. ఆలాగున సకామ పుణ్యకర్మలకు పునర్జన్మము గలుగును. కావున జన్మ రాహిత్యము గలుగదని భావము.

మానవుండు ప్రప్రథమమున కొంత ఆత్మశుద్ధి గలుగునప్పుడు పాపకర్మముల నన్నింటిని మానును. పుణ్యకర్మలను ఫలాసక్తితో జేయును. అధికమగు ఆత్మశుద్ధి గలుగునప్పుడు ఫలాసక్తిని విడిచి ఈశ్వరార్పణబుద్ధితో సత్కర్మ మొనర్చును. అందువలన మనస్సు మిక్కిలి శుద్ధమగుతరి ఆత్మోదయమగును. అత్తరి జేయు పుణ్యకర్మలన్నియు నిష్కామముగా జేయునవి యగుటచే పునర్జన్మమును గలుగజేయవు. మహనీయు లందరీలాగుననే చేయుచుందురు. ఈ సత్యమును తెలిసికొనజాలక శాస్త్రజ్ఞానములేని కొందరు వేదాంతులు "పుణ్యకర్మగూడ చేయరాదు, ఆ కర్మఫల మనుభవించుటకుగాను మఱల జన్మమును ఎత్తవలసియుండు" నని పలుకుదురు. ఇది వారి బుద్ధిమాంద్యముచే కలిగిన ప్రమాదము. అయితే గురుసేవ లెస్సగా జేయవలెననియు, ధన, తను, మనములను గురుస్వాముల వారికి సమర్పింప వలయుననియు చెప్పుదురు. దీనికి మాత్రము ఫలమెద్దియు లేదా? యని విజ్ఞులెవరైన నడిగిరేని 'శేషం కోపేన పూరయేత్' లేక 'మౌనేన' ఇంతియే సమాధానము దొరకును.

రాజయోగస్య మాహాత్మ్యం కో విజానాతి తత్త్వతః ।
తద్‌జ్ఞో నివసతే యత్ర స దేశః పుణ్యభాజనమ్ ॥

దర్శనాదర్చనాదస్య త్రిస ప్తకులసంయుతాః ।
అజ్ఞా ముక్తి పదం యా న్తి కిం పునస్తత్పరాయణాః ॥

అంతర్యోగం బహిర్యోగం యో జానాతి విశేషతః ।
త్వయా మయాఽప్యసౌ వంద్య శ్శేషైర్వంద్యస్తు కిం పునః ॥

ఆత్మసాక్షాత్కార జ్ఞానముయొక్క మాహాత్మ్యమును ఉన్నదున్నట్లు ఎవ్వడెఱుంగగలుగును? అట్టి మహాత్ము డెచ్చట నివసించుచున్నాడో ఆ దేశము పుణ్యభూమి యగును. ఈ యోగిని దర్శించుటచేతను, పూజించుట చేతను ఇరువదియొక్క తరములవా రజ్ఞానులైనను తరింతురు. అంతర్యోగ మును, బహిర్యోగమును ఎవడు తెలిసికొనుచున్నాడో వాడు నాచేతను, నీచేతను నమస్కరింపదగినవాడు. ఇట్లుండగా తదితరులచే పూజింపదగిన వాడని మఱల చెప్పవలయునా? అని సూతసంహితయందు పరమశివుడు వామదేవాదులకు తెలిపెను.

సర్వపాపప్రసక్తోఽపి ధ్యాయన్నిమిషమచ్యుతమ్ ।
భూయ స్తపస్వీ భవతి పంక్తిపావన పావనః ॥

పాపము గలవాడైనను ఒక నిమిషము నారాయణ మూర్తిని ధ్యానము చేసిన యెడల సమస్త పాపములు నశించినవాడై పాపములనుండి విముక్తి గలిగినవాడై మఱల గొప్ప తపస్వి యగును. అట్టి మహాత్ముడెప్పు డేపంక్తిలో గూర్చొని భోజనము చేయునో, ఆ తరుణమున నా పంక్తిలో గూర్చొనిన వారందరును పావను లగుదురు.

ఇట్టి కారణమువలననే మహనీయుల పంక్తిలో నందరును భోజనము చేయుటకు వాంఛింతురు. అయితే భోజన సమయములో ఇతర భావము లెవ్వియు మనస్సులోనికి రానీయక, ఆ మహనీయుని చూచుచు వారెట్టి భావ మును గలిగియున్నారో అట్టి దైవభావము గలిగి మౌనముతో భోజనము

చేయవలయును.

యద్యేకో బ్రహ్మవిద్భుంక్తే జగత్తర్పయతేఽఖిలమ్ ।
విధేయమపి సత్కారం యద్యల్పమపి తద్బహు ॥

బ్రహ్మవేత్తయగువా డొకనికి భోజనముచే తృప్తిని గలుగజేసిన యెడల ప్రపంచమున కంతయు తృప్తిని గలుగజేసిన వాడగుచున్నాడు. అట్టి బ్రహ్మవేత్తకు అతి స్వల్పమయిన సత్కారము నాచరించినను అదియే మిక్కుట మగుచుండును.

బ్రహ్మవేత్త చరాచరములలో వ్యాపించియుండు బ్రహ్మమునే తన యాత్మగా దైవభావన చేయుటచే నిట్టి ఫలితము గలుగుట కవకాశ మగుచున్నది.

యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్ ।
తృష్ణాక్షయసుఖస్యైతే కలాం నార్హన్తి షోడశీమ్ ॥

ప్రపంచములో సకల సంకల్పములను పూర్తిగా అనుభవించిన వాని కేసుఖము గలదో, స్వర్గలోకమం దేమహత్తయిన దివ్యసుఖములు గలవో, అవన్నియు అంతఃకరణములోగల తృష్ణాదిదోషములు నశించిన సంయమి యొక్క నిర్వాణసుఖములో పదునారవ భాగము సుఖము నైనను గలుగజేయజాలవు.

సమాధినిర్ధౌతమలస్య చేతసో నివేశితస్యాత్మని యత్సుఖం భవేత్ ।
న శక్యతే వర్ణయితుం గిరా తదా స్వయం తదన్తఃకరణేన గృహ్యతే ॥

సమాధినిష్ఠచేత చక్కగా శుద్ధము చేయుబడినదియును, ఆత్మ యందుంచబడినదియును అగు మనస్సున కేబ్రహ్మసుఖము గలుగు చున్నదో, దానిని వాక్కుచే నుడువుట కెవ్వరికిని అలవిగాదు. అనుభవైక వేద్యమై యున్నది.

మందబుద్ధిగల యొక శిష్యుడు గురుదేవులతో కలకండ గుణమెట్టిదని

యడిగెను. మధురమే దాని స్వభావమని గురు డుపదేశించెను. తదుపరి ఆ శిష్యుడు మధురమెట్టిదని యడిగెను. మధుర మిట్టిదని చెప్పుటకు వేరు పదము లేదు. అది మధురమే కావున నీవు స్వయముగా తిని చూడవలసినదే యని గురుమూర్తి సమాధాన మొసంగెను. ఈ బ్రహ్మాత్మానందముయొక్క స్థితియు ఆలాగున నున్నది.

సంసారార్ణవమగ్నానాం జన్తూనామవివేకినామ్ ।
అగతీనాం గతిస్సాక్షాద్జ్ఞానమేవ హి కేవలమ్ ॥

జననమరణమను భవార్ణవమున మునింగిన వారికిని, అవివేకులగు మానవులకును, ఏ సహాయము లేనివారికిని, కేవల మీ యాత్మజ్ఞాన మొక్కటియే గతి యగును. అనగా నిది యొకటియే దరిజేర్చును.

అయమాత్మా స్వయంజ్యోతిర్మహానందమయశ్శివః ।
అయోగినః పరోక్షస్స్యాదపరోక్షశ్చ యోగినః ॥

ఈ యాత్మ స్వయంజ్యోతిస్స్వరూపము, మహానందమయము, ప్రకృతిదోషములు లేని శివస్వరూపము. యోగనిష్ఠ లేనివారికి అప్రత్యక్షము, ధ్యాననిష్ఠ గలవానికి ప్రత్యక్షము.

ఆత్మజ్ఞానానుభవము గలుగక పోవుటకును, కలుగుటకును కారణ మిచట నిరూపించడమైనది.

సంసారదుఃఖతప్తానామాత్మజ్ఞానామృతాంభసా ।
తాపశాంతిర్న చాన్యేన సత్యమేవ న సంశయః ॥

సంసారదుఃఖమనెడి తాపత్రయాగ్నిచే తపించెడు జీవకోట్లకు ఆత్మ జ్ఞానమనియెడు అమృత మొక్క దానివల్లనే తాపశాంతి గలుగునుగాని వేరు మార్గము లేదు. ఇది సత్యము, సంశయ పడకుము.

ముక్తిస్తు బ్రహ్మత త్త్వజ్ఞానాదేవాస్య న చాన్యథా ।
స్వప్రబోధం వినా నైవ స్వస్వప్నో హీయతే కథమ్ ॥

జీవన్ముక్తి కలుగవలయునని సాధనచేయువానికి, బ్రహ్మసాక్షాత్కార జ్ఞాన మొక్కదానిచేతనే అది సిద్ధించును. ఎట్లన స్వప్నావస్థలో నుండువానికి జాగ్రదవస్థ గలుగకపోయిన స్వప్నములో గనిపించిన దృశ్యము లన్నియు మిథ్యయని బోధ యెట్లు గలుగును?

సర్వగం సచ్చిదాత్మానం జ్ఞానచక్షుర్నిరీక్షతే ।
అజ్ఞానచక్షుర్నేక్షేత భాస్వన్తం భానుమంధవత్ ॥

లోకమందు సర్వత్ర ప్రకాశించుచుండు సూర్యుని, గ్రుడ్డివాడు తప్ప అందరును చూచినప్పటికిని, వాడాసూర్యుని చూడనేరనట్లు సచ్చిదానందాత్మ సర్వత్ర వ్యాపించియున్నప్పటికిన్ని శ్రవణాదులవలన విచారించి తెలిసికొనిన ఆత్మజ్ఞాని ఆ యాత్మను చూచుచున్నాడు. అజ్ఞాని చూడలేడు (ఆత్మ బోధము).

ఆత్మ యొకటి యుండిన, ఈశ్వరుడు ఏల కనిపించుటలేదను ప్రశ్నకు అనేకవేల సంవత్సరములకు పూర్వమే సమాధానము చెప్పడమైనది. అట్టి ఆర్ష గ్రంథములను చదువకపోవుట చేతను, అట్టి ఋషిసదృశులతో సహవాసము చేయకపోవుట చేతను ఇట్టి సందేహములు గలుగుచున్నవి.

నిమిషం నిమిషార్ధం వా యత్ర తిష్ఠన్తి యోగినః ।
తత్రైవ సర్వశ్రేయాంసి త త్తీర్థం తత్తపోవనమ్ ॥

ఒకనిమిషముగాని, అర్ధనిమిషముగాని ఆత్మసంయములగు యోగులు ఎచట బ్రహ్మనిష్ఠ చేయుచుందురో అచట సర్వశ్రేయస్సులు గలుగును. ఆ స్థలము పుణ్యతీర్థముగను, తపోవనముగను అగుచున్నది.

ఇప్పుడు ప్రపంచములో కానిపించెడు పుణ్యాశ్రమములు, పుణ్య తీర్థములు, పుణ్యక్షేత్రములు ఒక కాలమున మామూలు ప్రదేశములుగా నుండినవి. అచ్చోట మహనీయాత్ములు తపస్సు జేయుటచేతను, బ్రహ్మనిష్ఠ చేయుటచేతను, బ్రహ్మవిచారణ సలుపుటచేతను ఇప్పుడు పుణ్యక్షేత్రములైనవి.

బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥

బాహ్యములగు ఇంద్రియసుఖములయం దాసక్తి లేని యంతఃకరణము గలవాడై తనయాత్మయందు ఏ జ్ఞానసుఖమును బొందునో అట్టి యక్షయ మగు సుఖమును బ్రహ్మయందు నిశ్చలమైన యంతఃకరణము గలవాడు బొందగలుగును అని గీత.

స్నాతం తేన సమ స్తతీర్థనిచయే ద త్తం మహీమణ్డలం
విప్రేభ్యః పితృదేవతాస్సురగణాస్సర్వేఽపి సంతర్పితాః ।
జప్తా మంతసహస్రకోటిరమునా త ప్తం చ తీవ్రం తపో
యస్య బ్రహ్మవిచారణే క్షణమపి ప్రాప్నోతి స్థైర్యం మనః ॥

ప్రపంచములోగల సమస్త తీర్థములలో సంకల్పదాన పూర్వకముగా స్నానము చేసిన ఫలమేది గలదో, చక్రవర్తి యయినవాడు పుణ్యకాలములో కాశ్యాది క్షేత్రములలో వేదవేదాంత పారంగతులగు బ్రాహ్మణులకు భూమండల మంతయు దానమిచ్చిన ఫలమేది గలదో; విప్రులను, పితృ దేవతలను, సంతృప్తిగా ప్రతిష్ఠించి పూజించిన ఫలమేది గలదో; గాయత్ర్యాది మహామంత్రముల నన్నింటిని వెయ్యికోట్ల సారులు జపించిన ఫలమేది గలదో; కృచ్ఛ్రచాంద్రాయణాది తీవ్రతపస్సుచే గలిగెడు ఫలమేది గలదో- అవన్నియు నొక్క క్షణకాలము వృత్తిరహితమై బ్రహ్మాకార వృత్తిలో నుండెడు ఫలమునకు సరి కానేరవు (యోగవాసిష్ఠము).

వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥

నియమ పూర్వకముగా వేదవేదాంతములను జదువుటవలనను, సాంగోపాంగములుగా యజ్ఞముల నన్నిటిని ఆచరించుటవలనను, కాయ శోషణాదులగు కృచ్ఛ్రచాంద్రాయణాది తపముల నొనర్చుటచేతను, దేశకాల పాత్రానుసారముగా సమస్తదానముల నాచరించుటవలనను కలిగెడి పుణ్యఫల

మేది గలదో, ధ్యానయోగి వీటన్నిటివలన గలిగెడు ఫలమునకన్న యధికమైన ఫలమును బొందుచున్నాడు. పై నిరూపించిన వారు పొందెడు ఫలమునకన్న ఎక్కువైన మోక్షమును బొందుచున్నాడు అని గీత.

బ్రహ్మనిష్ఠచే గలిగెడు ప్రయోజన మెట్టిదియో, దీనియందు నిరూపించడమైనది. పైజెప్పిన సత్కర్మలను జేయ శక్తిలేదని తలంచి వ్యాకులమును బొందు బీదలు కొందరు గలరు. అట్టివారిపై కరుణగలిగి భగవాను డీ శ్లోకమును ఉపదేశించెను. అక్షర పరబ్రహ్మమును బొందెడు అష్టమాధ్యాయమున నిది చెప్పుటవలన శాశ్వత బ్రహ్మప్రాప్తికి ధ్యానయోగమే యుపకరించునని తెలుపడమైనది. దీనికి విద్యతోగాని, ధనముతో గాని, జాతితోగాని ఏలాటి సంబంధమును లేదు. కేవలము ధ్యానయోగ మొకటియే చాలును. ఇది సర్వజనులకు సులభము, అనుష్ఠేయమున్ను అయియున్నది.

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి ॥

ఈ లోకమందాత్మజ్ఞానముతో సమానమగు పవిత్రమైనది మఱి యొకటి లేదు. అట్టి జ్ఞానమును యోగనిష్ఠుడు అనుష్ఠానము పరిపక్వ మగునపుడు తానే తనయందు బొందుచున్నాడు అని గీత.

''కాలేనాత్మని విన్దతి'' అని తెలుపుటచే కాలము పరిపక్వదశను బొంది నప్పుడు, అట్టిజ్ఞాన ముదయ మగుచున్న దనియు, కాలపరిపక్వత గలుగువరకు అనుష్ఠానమును విడువరాదనియు నుపదేశించడమైనది. మఱియు అట్టి జ్ఞానము ఇతర లోకములలోగాని, స్థలములలోగాని పొంద బడునది గాదనియు, తనలోనే కలుగవలయుననియు గ్రహించు కొనవలయును.

యథాఽగాధనిధేర్లాభే నోపాయః ఖననం వినా ।
మల్లాభేఽపి తథా స్వాత్మచింతాం ముక్త్వా న చాపరః ॥

భూమియొక్క అగాధ భాగమునందుండు నిక్షేపమును తీయుటకు

గడ్డపారచే త్రవ్వుటగాక మఱియొక యుపాయ మెట్లు లేదో, ఆలాగున బుద్ధిగుహయందుండు జ్ఞానధనము లభించుటకొఱకు తదేకధ్యానమగు నిరంతర చిన్తనము వినా, వేరుపాయము లేదని ఆత్మగీత చెప్పుచున్నది.

స తు దీర్ఘకాలనైరంతర్యసత్కారాసేవితో దృఢభూమిః ॥

బ్రహ్మాభ్యాసమన్ననో చాలకాలమువరకును ఎడతెగని తపముచేతను, బ్రహ్మచర్యముతోడను, శ్రద్ధతోడను, అనుష్ఠింపబడినదై దృఢజ్ఞానానుభవము (సమాధిస్థితిని) గలుగజేయును.

శ్రీపతంజలిమహర్షియు పై జెప్పిన యభిప్రాయమునే యోగదర్శ నమునందు తెలిపిరి.

న తత్సుఖం సురేంద్రస్య న సుఖం చక్రవర్తినామ్ ।
యత్సుఖం వీతరాగస్య మునేరేకాంతవాసినః ॥

ఏకాంతవాసియై, రాగరహితుడై, మౌన (మనన) శీలుడగు మహాత్మునికి ఏయొక్క బ్రహ్మానందము గలదో, అట్టిసుఖము దేవేంద్రునికి గాని, చక్రవర్తులకు గాని లేనే లేదు (గురుగీత.)

రసం బ్రహ్మ పిబేద్యశ్చ తృప్తో యః పరమాత్మని ।
ఇంద్రం చ మన్యతే రంకం నృపాణాం తత్ర కా కథా ॥

ఎవడు బ్రహ్మానంద రసామృతమును పానముచేసి పరమాత్మధ్యానము నందు తృప్తుడగుచున్నాడో, ఆ మహాత్ముడు దేవేంద్రునిగూడ పేదవాడైన భృత్యునివలె చూచుచున్నాడు. అట్లుండ రాజులయొక్క గతి యేమున్నది!

నాతస్సుఖతరం కించిత్త్రిషు లోకేషు విద్యతే ।
వీతతృష్ణస్య కామేభ్యో ముక్తసంగస్య యత్సుఖమ్ ॥

సమస్తమైన కామాది విషయములను వదలినవాడై నిస్సంగుడైన వాని కే యొక్క బ్రహ్మానందము గలదో, దానికి సరియయిన మఱియొక సుఖము మూడు లోకములయందును లేదు(గురుగీత.).

తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్ ॥

పరవైరాగ్యముగలిగి అనుష్ఠానము చేయు యోగిచిత్తమున నింతకు ముందున్న క్లేశబీజములు, వేగినవడ్లు మొలకలెత్తని చందమున, సంపూర్ణముగా నశించిపోవును. (యోగదర్శనము.)

అనేక జన్మములనుండి వచ్చిన సంస్కార బీజములన్నియు జ్ఞానాగ్ని యందు దహించిపోయినందుచే, జ్ఞానులకు ప్రకృతిగుణము లుండవు. ఉండినచో వేగని విత్తనములవలె జ్ఞానాగ్నియందు కర్మబీజములు దహించ బడలేదని గ్రహించుకొనవలయును.

సత్త్వపురుషయో శ్శుద్ధిసామ్యే కైవల్యమ్ ।

బుద్ధిసత్త్వమునకు వివేకఖ్యాతి యుదయించుటవలన పురుషుని (ఆత్మ) తో సమానమగు నైర్మల్య మొదవును. అట్టి బుద్ధినైర్మల్యము సిద్ధించెనేని సిద్ధ్యంతరాపేక్ష లేకయే కైవల్యము లభించును.

బుద్ధియందుగల సత్వరజస్తమోగుణములు నశించు నప్పుడును, ఆత్మయందుగల అవిద్యాక్లేశములు నశించునప్పుడును కైవల్యప్రాప్తి గలుగును. జీవుడు శుద్ధజ్ఞాన స్వరూపుడైనను మూలావిద్యచే గూడియుండు వరకు శుద్ధజ్ఞానస్వరూపుడు గాజాలడు. శుద్ధజ్ఞానప్రకాశుడుగా జీవుడును త్రిగుణదోషములు నశించినదిగా హృదయమును ఎప్పుడేర్పడునో అప్పుడే మోక్షము సిద్ధించును. ఇందువల్ల ఆత్మస్వరూపము తెలిసికొనిన చాలుననియు, ప్రకృతిగుణములతో నేమి సంబంధమనియు, గుణములు దృశ్యములుగదా, దృక్కయిన తనకు ఏమి బాధ గలదనియు చెప్పు వేదాంతము యొక్క రహస్యము ముముక్షువులు తెలిసికొనందగినది.

మైత్రీ కరుణా ముదితోపేక్షాణాం సుఖదుఃఖ పుణ్యాపుణ్య విషయాణాం భావనాతశ్చిత్తప్రసాదనమ్ ॥

సుఖవిషయమున, దుఃఖవిషయమున, పుణ్యవిషయమున, పాపవిషయమున (క్రమముగా) 1. మైత్రి, 2. కరుణ, 3. ముదిత, 4. ఉపేక్షలయొక్క

భావనవలన చిత్తము నిశ్చలమగును. అనగా నిర్మల మగును. అనగా పుణ్యాత్ములతో మైత్రియు, దీనులయందు దయయు, తనకన్న యధికులను జూచి యానందించుటయు, పాపాత్ములయం దుపేక్షయు (సంబంధము లేక యుండుట) గలిగియుండవలయును. అట్లయిన మనోనిర్మలత్వమున కేలాటి మార్పును గలుగదు.

లోకములో నేదైన నొక సంస్థను నిర్వహించు వాడెల్లరతోను సమత్వము గలిగియుండుట అసాధ్యమగునని తలంపుగల మహనీయాత్ములు గూడ చాలమంది గలరు. దుష్ట, శిష్ట భేదము లేక అందరిని సమానముగా జూచుట గదా జ్ఞానము. భేదముతో జూచిన నజ్ఞాన మగును. కార్యము నిర్వహించు నప్పుడు, రాజ్యమును పాలించునప్పుడు, సంస్థను నడుపునప్పుడు దుష్టులను, శిష్టులను వేరు వేరుగా జూడకపోయిన కార్యము జరుగదు. గొప్ప వివేకజ్ఞానులకు గూడ నిది గొప్పధర్మసంకట మగు గండముగా నున్నది. కావున శ్రీపతంజలిమహర్షి చెప్పిన ఈ చతుర్విధోపాయములచేత గొప్ప సంస్థను నిర్వహించుకొని ఆత్మశాంతికి భంగములేక యుండవచ్చును. శ్రీ యోగవాసిష్ఠమున శ్రీవసిష్ఠులకును, శ్రీరామచంద్రులకును గలిగిన వాదప్రతివాదములు దీనిని గురించియే యేర్పడెను. ఆ ఘట్టము యోగవాసిష్ఠమున గనందగును.

కులం పవిత్రం జననీ కృతార్థా విశ్వంభరా పుణ్యవతీ చ తేన ।
అపారసచ్చిత్సుఖసాగరేఽస్మిన్ లీనం పరే బ్రహ్మణి యస్య చేతః ॥

ఎవని మనస్సు ఒక్కక్షణ కాలమైనను అపారజ్ఞానసారమగు పరమాత్మ ధ్యానమందు లీనమగునో, అట్టివాని కులము పవిత్రమగును. తల్లి కృతార్థురాలగును. తండ్రియును కృతార్థు డగును. వాడు నివసించు భూమియు పుణ్యక్షేత్ర మగును అని సూతసంహిత.

మహాత్ములయొక్క జన్మముచే గలిగెడి ఫలితమెట్టిదో ఇచట నిరూపించడమైనది.

సమాధిమథ కర్మాణి మా కరోతు కరోతు వా ।
హృదయే నాస్త సర్వాస్థో ముక్త ఏవో త్తమాశయః ॥

జీవన్ముక్తస్థితి గలిగిన పిమ్మట నిరంతర సమాధినిష్ఠలో నుండినను సరి, లేక పరప్రాణుల కుపకారము చేయుచుండినను సరి, హృదయమునం దేలాటి విషయభావములును, దృశ్యవాసనలును లేనందుచే వారు సర్వదా ముక్తు లగుచున్నారు. ఇదియే యుత్తములయొక్క యాశయము.

నివృత్తిరపి మూఢస్య ప్రవృత్తిరుపజాయతే ।
ప్రవృత్తిరపి ధీరస్య నివృత్తిఫలభాగినీ ॥

మూఢబుద్ధిగలవా డేప్రవృత్తి చేయకున్నను, అతని మనస్సు నిరంతరము ప్రపంచవిషయములలో ప్రవర్తించుచునే యుండును. ఆత్మ సాక్షాత్కారము గల ధీరుని యింద్రియములు సత్కర్మలో ప్రవర్తించు చుండినను, ఫలాపేక్ష లేక ప్రవర్తించుచుండుటచే అవి నివృత్తిఫలమునే గలుగ జేయుచుండును.

వేదాంతముయొక్క కీలక మిచట నిరూపించడ మైనది. ఆత్మశుద్ధి లేక కొందరు ఏ కర్మమును జేయకయుండుటయే గొప్పతనమని తలంతురు. ఆత్మజ్ఞానులు ఫలాపేక్షను విడిచి, పరప్రాణులకు మేలుచేయునది చూచి, అట్టి శుద్ధాత్ములను ప్రవృత్తిగల వారివలె తక్కువగా జూచెదరు. విద్యా వివేకములేని లోపమే వారికిట్టి విపరీత భావము గలుగుటకు కారణము. వేగిన విత్తనములు ఎచట చల్లినను మొలకలెత్త నేరవు. పచ్చివిత్తనములను మూటగట్టి ఏకాంత ములో నుంచినను నీరుతడి గలిగిన వెంటనే మొలకలెత్తు విధముగ, పైజెప్పిన యుభయులయొక్క స్థితియు నుండును. అయితే అంతఃకరణ శుద్ధిగలిగి ఆత్మజ్ఞానము దృఢముగ గలుగువరకు తననిష్ఠకు విఘ్నము గలుగని లోక సేవగాని, పరోపకారములుగాని, దైవకైంకర్యము గాని, పుణ్యకర్మగాని చేసిన జాలును. లేనిచో, అసలు మూలమునకే మోసము వాటిల్లును. మూలము చెడిన వృక్షము వ్యర్థమగు నట్లు తన నిష్ఠనుండి పతనము గలిగినచో అంతయు

వ్యర్థమగును. ఈ రహస్యము బుద్ధిమంతు డెఱింగియుండవలయును.

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥

సమస్త భూతాంతరాత్ముడగు నన్ను సర్వచరాచరములలో వెలుగుచుండు ఒకేయాత్మగా తెలిసినవాడై యెవడున్నాడో, అట్టి జ్ఞానయోగి సర్వ ప్రకారముగా వర్తించుచున్న వాడైనను, ఎల్లప్పుడు నాయందున్న వాడగుచున్నాడు. అనగా పైజెప్పిన ప్రకారము నిరంతరము సమాధినిష్ఠ యందుండినను, లేక ఫలాపేక్షలేక పరప్రాణుల కుపకారము జేయుచుండినను, గృహస్థాశ్రమమునందుండినను, లేక సన్న్యాసాశ్రమము నందుండినను, వనమందుండినను, పట్టణమునందుండినను విరోధము లేదు. అతడు దేశకాల దేహేంద్రియముల కతీతస్థితిలో నుండుటవలన పైజెప్పిన వేవియు అతని కడ్డు రాజాలవు. ఆ మార్పులన్నియు నతని ప్రారబ్ధ కర్మానుసారముగా నుండును అని గీత.

బ్రహ్మవేత్త తన జీవనాధారమునకు తగిన ధనమున్నచో నేలాగున జీవయాత్ర గడుప వచ్చునో, ఆ విషయము నిరూపించబడుచున్నది.

అత్రాహారార్థం కర్మ కుర్యాదనింద్యం
కుర్యాదాహారం ప్రాణసంరక్షణార్థమ్ ।
ప్రాణాస్సంధార్యా స్తత్త్వసంపాదనార్థం
తత్త్వం సంపాద్యం యేన భూయో న జన్మ॥

ఆహారముకొఱకై ధర్మవిరుద్ధముగాని కర్మను జేయవలయును. ప్రాణ సంరక్షణకొఱకు మాత్రమే ఆహారమును భుజింపవలయును. ప్రాణ సంరక్షణము తత్త్వసంపాదనకొఱకే యగును. పునర్జన్మరాహిత్యమునకై తత్త్వమును సంపాదింపవలెను అని వాసిష్ఠము.

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥

దేనియందును ఆశలేనివాడును, మనోనిగ్రహము గలవాడును, పరవస్తు పరిగ్రహము లేనివాడును, దేహధారణకు మాత్రము విధి ననుసరించిన కర్మను జేయువాడు పాపమును బొందడు అని గీత.

పూర్వముండు మహర్షులు అరణ్యములోనుండి యీలాగుననే జీవించిరి. గృహస్థులైన జనకుడు, తిరవళ్ళూరినాయన, కబీరుదాసు, ఘోరాకుంభారు, వీరబ్రహ్మయ్యగారు మొదలగు మహనీయులు గృహస్థాశ్రమములో నుండియు నిట్టివిధి ననుసరించియే జీవించిరి. పరవస్తు పరిగ్రహముచేత పుణ్యము నశించి దాతయొక్క పాపము తనలో చేరు చుండును. అందువలననే పరవస్తు పరిగ్రహమునుగురించి మనువు చెప్పిన వాక్యము ఈ గ్రంథమున నిరూపించినది చూడుడు. భుక్తికిమాత్రము నిషేధము లేని పనిని చేయుట ముక్తికి అడ్డు గాజాలదు. భోగముపెరిగిన యోగము తరుగునని గ్రహించుకొనిన చాలును. అయితే నిరంతరము బ్రహ్మనిష్ఠ యందుండువారిని, తీవ్రతర బుద్ధితో నధ్యయనము చేయువారిని ఈ విధి బాధింపజాలదు. సామాన్యు లందరును పైజెప్పిన విధముగా జరుపుటయే మంచిది.

ఇక చెప్పబోయెడి విషయము త్రిపుటిరహితమైనది. దృగ్దృశ్యముల యేకత్వము. దీనినే నిర్వికల్ప సమాధియనియు, అద్వైత బ్రహ్మసాక్షాత్కార స్థితి యనియు గ్రహించుకొనవలయును. ఇది వేదాంతముయొక్క విచారణచే గలిగెడి పరమకాష్ఠ యని తెలియందగును. ఈ స్థితిలోనికి వచ్చుటకే జప, జ్ఞాన, భక్తి యోగములన్నియు నేర్పడినవి.

అజ్ఞానాద్భాసతే సర్వం త్వయి రజ్జౌ భుజంగవత్ ।
ప్రజ్ఞానాల్లీయతే సర్వం త్వయి రజ్జౌ భుజంగవత్ ॥

అజ్ఞానముచేత నీయందు రజ్జువునందు సర్పమువలె నీ దృశ్యము ప్రతీతి యగుచున్నది. ప్రజ్ఞానమువలన నీయందు, రజ్జువునందు కల్పింప బడిన సర్పము లీనమై రజ్జువుమాత్రము ప్రతీతి యగునట్లు దృశ్యము లీనమై

నీవు మాత్రము శేషింతువు.

ఒక యవస్థయందు త్రాడుప్రతీతి గాక సర్పప్రతీతి గలుగుచున్నది. మఱియొక యవస్థయందు త్రాటియందు సర్పము లేనిదై త్రాడు మాత్రమే ప్రతీతి యగునుగాని సర్పప్రతీతి గలుగదు. ఇదియే అజ్ఞాన జ్ఞానావస్థలలో గలిగెడి యవస్థయని గ్రహించదగినది. వాస్తవముగా త్రికాలములందును రజ్జువునందు సర్పము లేనప్పటికిని అవిచారణచే సర్పము గోచరించుచున్నది. భయము గలుగుచున్నది. దీపసహాయముచే పరిశోధన సలుపునప్పుడు త్రాడు వ్యక్త మగుచున్నది. సర్పభీతి నశించుచున్నది. ఇది వేదాంతములో వివర్తవాదమనియు, వేదాంతముయొక్క తుది స్థితి యనియు గ్రహించు కొనవలయును.

రజ్జుసర్పవదాత్మానం జీవం జ్ఞాత్వా భయం వహేత్।
నాహం జీవః పరాత్మేతి జ్ఞాతశ్చేన్నిర్భయో భవేత్ ॥

త్రాటిని పామువలె సత్యజ్ఞానానంద స్వరూపియగు నాత్మను కించిద్ జ్ఞుడగు జీవునిగా భ్రమించి భయమును బొందుచున్నాడు. శ్రుతి, యుక్త్య నుభవములచేత నేను కించిజ్జ్ఞుడనగు జీవిని గానేరను; ఇక నేమన సర్వపరిపూర్ణ స్వరూపుడనని గుర్తెఱింగి నట్లయిన భయ మేమాత్ర మైనను లేనివాడు కాగలడు.

కారుచీకటిలో త్రాడు కనిపించదు. ప్రాతః సంధ్యాకాలములలో మంద ప్రకాశమందు త్రాటిని చూచి సర్పమను భయము గలుగుచున్నది. మఱల సూర్యుడు ప్రకాశించుతరి త్రాడుగానే గోచరించుచున్నది. సర్పభ్రాంతి గలుగదు. ఆలాగున గాఢాజ్ఞానస్థితిలో నుండువారికి ఆత్మను గుఱించిన విచారణ చేయనందుచే సంశయము గలుగదు. సూర్యోదయమైన పిమ్మట నుండు వారికిని సందేహ ముండదు. ఇంకెవరికి సంశయము గలుగుచున్న దనగా మందప్రకాశమగు అరుణోదయ స్థితిలో నుండువారి కేర్పడుచున్నది. ఆలాగున కేవల బద్ధాత్ములకును కేవల ముక్తాత్ములకును సందేహము

గలుగదు. జిజ్ఞాసువులకే కలుగుచుండును. అట్టి సందేహము గలవారు తమ్ముఁ పాపులని గాని, హీనులనిగాని తలంచవలదు. వీరు మధ్యమస్థితిలోనికి వచ్చినవారు. అరుణోదయ స్థితిలో నున్నవారు. అరుణోదయముయొక్క స్థితిలో సూర్యోదయము గాబోవుచున్నదనియు, కాలరాత్రి తొలగిపోయిన దనియు ఎట్లు గ్రహించుచున్నారమో; ఆలాగున కొలది కాలములోనే సంశయము నశించి పూర్ణబ్రహ్మైక్యైక జ్ఞానము గలిగి ధన్యులు గాగలరనియు తలంచవలయును.

రజ్జురూపే పరిజ్ఞాతే సర్పఖండం న తిష్ఠతి ।
అధిష్ఠానే తథా జ్ఞాతే ప్రపంచః శూన్యతాం గతః ॥

రజ్జువుయొక్క యథార్థజ్ఞానము గలుగుచుండగా రజ్జువునందు త్రికాలములయందును సర్పము ఉండలేదని దృఢముగ జ్ఞానమెట్లు గలుగు చున్నదో ఆలాగున నధిష్ఠానమగు యాత్మయొక్క దృఢజ్ఞానము గలుగు చుండగా కల్పితమగు జగద్భ్రాంతియు నశించును.

గృహత్వేనైవ కాష్ఠాని ఖడ్గత్వేనైవ లోహతా ।
వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తథాత్మతా ॥

కొయ్య యొక్కటైనను అనేక గృహోపకరణములుగా నేర్పడి నట్లును, ఇనుమొక్కటైనను అనేక యంత్రములుగాను, ఖడ్గాదులుగాను ఏర్పడి నట్లును, మాయచే నొకేబ్రహ్మము అనేకములుగా గనిపించుచున్నది. గృహపరికరములయొక్కయు, యంత్రములయొక్కయు నామరూపములు తీసివేసిన నొకే కట్టెయు, నొకే లోహ మెట్లగుపడుచుండునో; ఆలాగున మూఢత్వముచే అనేకత్వమును, జ్ఞానిత్వముచే నేకత్వమును గలుగుచున్నవి.

ఒకే కట్టచే అనేకములగు బొమ్మలను జేయునట్లు మాయచే నానాత్వ మేర్పడినది. విచారణ చేసిన నొకే సద్వస్తువు మాయచే ననేక వస్తువులైనట్లు గ్రహించుకొనవచ్చును. ఆలాగున బాహ్యదృష్టిచే అనేక విధములుగా గనపడిన ఈ జగత్తు ఆంతరదృష్టిచే జూచువారికి నొకే సద్వస్తువుగా గోచరించును.

ఆలాగున నొక వృక్షమును చూచినప్పుడు ఫలము, పుష్పములు, విత్తనములు, గుజ్జులు, రసములు భిన్న భిన్నముగా గనిపించినను, విచారణ సలిపిన అవన్నియు నొకే బీజమునుండి యేర్పడినట్లు తెలిసికొననగును. ఆత్మవిచారణ చేయని వారికి జగత్తు అనేకముగానే గోచరించును. విచారణచేయువారి కేకముగా గనిపించును.

యథాతరంగకల్లోలైర్జలమేవ స్ఫురత్యలమ్ ।
పాత్రరూపేణ తామ్రం హి బ్రహ్మాండౌఘైస్తథాత్మతా ॥

సముద్రమునందుగల తరంగ, బుద్బుద, ఫేనాదులు సముద్ర జలమున కన్యములుగా నుండవు. ఒకే తామ్రము పంచపాత్ర, కమండలువు మొదలగు అనేక పాత్రములుగా గనిపించినను, నిజముగ విచారించిన నొకే తామ్రరూపముగా నెట్లుండునో, ఆలాగున నీ ప్రపంచములో గనిపించెడు నానాత్వము ఒకే బ్రహ్మ యగుచున్నది అని అపరోక్షానుభూతి.

మర్త్యోఽహమితి సంధాయ మ్రియతే జాయతే చ సః ।
బ్రహ్మాహమితి సంధాయ ముచ్యతే న చ జాయతే ॥

మర్త్యుడను బుద్ధి యెంతకాలమువఱకు మానవుడు గలిగియుండునో అంతవరకు మరణించుటయు, జన్మించుటయు జరుగుచుండును. బ్రహ్మమే తాననియెడి అనుసంధానము గలిగియుండిన తప్పక ముక్తుడగును. వాడు మఱల జన్మించడు.

ఇప్పుడు గ్రంథము పూర్తి చేయబడుచున్నది. నిజస్వరూపములో మనస్సును ఎల్లప్పుడు నిలుపశక్తి లేనివారికి యోగధారణతో గూడిన ధ్యానమును గీత. అ.5, శ్లో॥ 27,28, లలో పరమరహస్యముగా శ్రీభగవాను డుపదేశించెను.

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాంతరే భ్రువోః
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥

యతేంద్రియ మనోబుద్ధిర్మునిర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥

ఎవడు బాహ్యములగు స్పర్శాదివిషయములను బయలున నుంచి మనస్సునందు జొరనీయక దృష్టిని కనుబొమలయొక్క మధ్యప్రదేశమునందే నిలిపి ముక్కులోపల సంచరించునట్టి ప్రాణాపానవాయువులను సమముగా జేసి ★స్వాధీనములైన యింద్రియములు, మనస్సు, బుద్ధియును; నశించిన యాశయు, భయమును, క్రోధమును గలవాడో, మోక్షమునం దాసక్తిగల వాడును, మననశీలము (మౌనము) గలవాడునగునో అతడెల్లప్పుడు ముక్తుడే.

ఏతదాలంబనం శ్రేష్ఠమేతదాలంబనం పరమ్।
ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే॥

ఈ ఓంకారరూపమగు బ్రహ్మప్రాప్తి సాధనము శ్రేష్ఠమయినది. ఈ ఓంకారరూపమగు ఆలంబనమే పరబ్రహ్మ సంబంధమైనది. ఈ యోంకార రూపమగు ఆలంబనమును తెలిసికొని బ్రహ్మలోకమును పొందుచున్నాడు. అనగా బ్రహ్మప్రాప్తి గలవాడగుచున్నాడు.

ఆలంబన మనగా సహాయమని యర్థము. నడువశక్తిలేని వాడు కఱ్ఱ సహాయముతోగాని మఱియొకని సహాయముతోగాని యెట్లు నడుచు చుండునో, ఆలాగున స్వయముగ "అహం బ్రహ్మాస్మి" అను భావన చేయుటకు మనః పరిపక్వత లేనివారు ఈ ప్రణవముయొక్క సహాయముతో బ్రహ్మప్రాప్తిని ప్రయాసము లేక పొందవచ్చును. అనగా ఓంకారమును

★ ఇది కేవల కుంభకమును గుఱించిన యోగసాధన యగును. దీని యందు ఏలాటి అపాయ మును గలుగదు. దీనికి కేవల కుంభకమని పేరు. పద్మాసనమందుండిగాని సిద్ధాసన మందుండిగాని మూలబంధ, ఉడ్యాణబంధ, జాలంధరబంధమును జేసికొని ప్రాణాపానములను ఏకముజేసి ప్రణవమునుగాని, సోఽహం మంత్రమునుగాని భావనజేసికొని స్వప్రకాశానందమయాత్మలో నుండులాగున అభ్యాసము చేసికొనవలయును. ఈ విషయమై వ్యాసాశ్రమమువారిచే వ్రాయబడిన గీతార్థప్రకాశమను గ్రంథమున అ.5, శ్లో।27,28లోను, రజతోత్సవసంచిక 35-వ పేజీలోను జూడందగును. రజతోత్సవ సంచికలో ఫోటోతో గూడ జూడవచ్చును.

ఉచ్చరించి ఓంకారముయొక్క నాలుగవపాదమును అర్ధమాత్రయగు పరబ్రహ్మమును తన యాత్మగ భావన చేయుచుండవలయును. ఇట్లభ్యసించుచు రాగా రాగా ఓంకారశబ్దము సహా లీనమై ఓంకారార్థ పరబ్రహ్మము మాత్రము మిగిలియుండును(కఠోపనిషత్తు).

జపేచ్చ ప్రణవం నిత్యం జితాత్మా విజితేంద్రియః ।
పఠేదుపనిషద్వాక్యం వేదాన్తార్థాంశ్చ చి న్తయేత్ ॥

ఎవడు నియమము గలవాడై మనోజయము, ఇంద్రియజయము గలిగి యర్థముతో గూడి ప్రణవమును జపించునో, మఱియు ఉపనిషత్పారాయణము వేదాంతార్థవిచారణయు చేయునో- అట్టివాడిచటనే ఈ దేహముతో నుండునపుడే మోక్షమును బొందగలుగును.

బ్రహ్మనిష్ఠులయొక్క యంతిమస్థితి యీలాగున నుండవలయును. ఇంద్రియజయము గలిగి ప్రణవముయొక్క నాల్గవ పాదమును భావనచేసికొని యోంకారమును జపించుటయు;ఉపనిషత్పారాయణయు, వేదాంత విచారణయు గలిగియుండవలయును.

ఆత్మానమరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిమ్ ।
జ్ఞాననిర్మథనాభ్యాసాద్దేవం పశ్యేన్నిగూఢవత్ ॥

తనయాత్మను క్రింది అరణిగాను, ప్రణవమును పై అరణిగాను చేసికొని జ్ఞాననిర్మథనము చేయునప్పుడు, అరణినుండి అగ్ని యుదయించునట్లు ఆత్మలో పరమాత్మను దర్శింపగల్గును.

కట్టెలో నిప్పు నిగూఢమై యున్నప్పటికిని అరణిగాచేసి తరచునప్పుడు నిప్పు పుట్టి కొయ్యను కాల్చివేయునట్లు పైజెప్పిన అభ్యాసమువలన జ్ఞానము గలిగి అజ్ఞానమును నశింపజేయును. ఆలాగున క్షీరమున నవనీతము నిగూఢమై యుండినను చిలుకుటచే వెన్న బయలుదేరునట్లు; ఆత్మలో పరమాత్మయు ధ్యానమథనమువలన గోచరించును.

ఓంకారాది జపోఽప్యేవం భావగర్భో హ్యుదాహృతః ।
ధ్యేయవస్తుస్వరూపస్య దార్ఢ్యాయ హి జపో మతః ॥

ప్రణవము మొదలగు మంత్రజపములు తత్తద్దైవభావ గర్భితములుగా నుండవలయును. ధ్యేయవస్తువుయొక్క దృఢజ్ఞానముకొరకు జప మేర్పడినది.

"ధ్యేయవస్తు స్వరూపస్య దార్ఢ్యాయ హి జపో మతః" అని చెప్పుటచే సాకార రూపమైనను. నిరాకార రూపమైనను ధ్యానించువారు ధ్యేయాకారముయొక్క దృఢత కలుగుటకొఱ కాయా మంత్రములను జపించ వలయునని యేర్పడినది. ఆలాగున జపము ధ్యానమై మారునప్పుడు జపము గూడ ఆగిపోయి ధ్యేయాకారమాత్ర వస్తువై నిలుచును. అట్టి స్థితి గలుగు వరకు జపధ్యానాదులు గలిగియుండవలయును.

ప్రణవస్సర్వవేదాదిః ప్రణవశ్శివవాచకః ।
మంత్రాధిరాజరాజశ్చ మహాబీజ మతఃపరమ్ ॥

ప్రణవము సర్వవేదములకు ఆదిమూల మైనది. ప్రణవము ఈశ్వర వాచకము (మంగళస్వరూపము). ప్రణవము మంత్రము లన్నిటికి రాజాధి రాజుగా నుంటున్నది. దీనికే మహామంత్రమనియు, మంత్రబీజమనియు పేరు గలదు. దీనికి మించిన మహామంత్రము మఱి యొకటి లేదు.

ఓమితీదం సర్వమితి శ్రుతిరాహ సనాతనీ ।
భవంతోఽపి విదిత్వైవం ప్రణవార్థమహేశ్వరమ్ ॥
వేదగుహ్యం చ సర్వస్వం తారకం బ్రహ్మ ముక్తిదమ్॥

సర్వమును ఈ ప్రణవస్వరూపమని సనాతనమగు వేదము పలుకు చున్నది. అందువలన మీరందరును ఈ ప్రణవస్వరూపమును ఈశ్వర స్వరూపముగా నెఱుంగవలయును. ఇది వేదములలో నిగూఢమైనది. సమస్త మును దీనియందు గలదు. ఇదియే ముక్తి నిచ్చెడి తారక బ్రహ్మస్వరూపము అని సూతసంహిత. మహేశ్వరుండు సనకాది ఋషుల కుపదేశించెను.

జపంతః ప్రణవం నిత్యం ముచ్య న్తే సర్వపాత కైః ।
సదాభ్యాసేన సంయుక్తాః పరం మోక్షం లభన్తి చ ॥

ప్రణవమును బ్రహ్మానుసంధానముగా జపమాచరించువారు సర్వపాపములనుండి విముక్తు లగుదురు. అట్టి ప్రణవాభ్యాసముతో గూడిన వారు శ్రేష్ఠమగు మోక్షమును బొందుచున్నారు.

ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా ।
కంఠం భిత్వా వినిర్యాతౌ తస్మాన్మాంగళికావుభౌ ॥

సృష్ట్యాదిలో బ్రహ్మదేవుని కంఠమునుండి వెలువడిన శబ్దములు రెండు. మొదటిది ''ఓంకారము'' రెండవది ''అథ'' అనెడి శబ్దము. కావున నివి రెండును పరమపవిత్రములైన మంగళ శబ్దములు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

సంపూర్ణము.

లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు

ఓమ్ తత్ సత్.

★★★